


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఖమ్మం | 13-05-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 302 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal
Follow us on

## కొనుగోలు కేంద్రాల్లో

# రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

### ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి



ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలి. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్‌కు తరలించాలి. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దు

– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**కలెక్టర్లను హెచ్చరించిన సిఎం**

- **అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలి**
- **లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలి**
- **గోదాముల సమస్య ఉంటే తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి**
- **సమస్య తీవ్రతను గుర్తించి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి**
- **అకాల వర్షాల సమయంలో రైతులకు నష్టం జరగకుండా**
- **శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి**
- **ప్రతీ ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలి**
- **ప్రతి రైస్‌మిల్లు వద్ద అధికారిని నియమించి పర్యవేక్షించాలి**
- **వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మే 12 (వుదయం ప్రతినిధి) :** మిషన్ మోడ్‌లో పనిచేస్తూ రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోళ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని కలెక్టర్లను ఆదేశించారు.

మిగతా 2లో

## నేను జైలుకు వెళ్లాను

- విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో చాలామార్లు జైలుకు వెళ్లా
- ఫీల్ ది జైల్ ప్రారంభించడం నాకు చాలా ఆనందంగా ఉంది
- స్వాతంత్ర్యానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుంది
- మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలి

2

గవర్నర్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు.

## అస్సాం పీఠంపై మరోసారి హిమంత

### అస్సాం ముఖ్యమంత్రిగా రెండోసారి ప్రమాణస్వీకారం చేసిన హిమంత బిశ్వ శర్మ



కామాఖ్య అమ్మవారు, శ్రీమంత శంకర దేవుడు, అస్సాం ప్రజల ఆశీస్సులతో, నేను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాను.
–హిమంత

- **మంత్రులుగా పలువురు ఎమ్మెల్యేల ప్రమాణం**
- **ప్రమాణ స్వీకానికి హాజరైన ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, బిజెపి ప్రధాన నేతలు**

**వుదయం డెస్క్, మే 12 :** మంగళవారం నాడు, హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండవసారి అస్సాం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈశాన్య భారతదేశం అంతటా బీజేపీ ఎదుగుదలకు ఆయనే ప్రధాన కారకుడిగా విస్తృతం గుర్తింపు పొందారు. దీనితో రాష్ట్రంలో వరుసగా మూడవసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 126 మంది సభ్యులు కలిగిన అసెంబ్లీలో ఎన్డీయే రికార్డు స్థాయిలో 102 స్థానాలను కైవసం చేసుకోగా, కేవలం బీజేపీ మాత్రమే 82 నియోజకవర్గాల్లో విజయం సాధించింది. ఈ విజయం, ఈశాన్య భారతదేశంలో పార్టీ అత్యంత ప్రభావవంతమైన నాయకులలో ఒకరిగా శర్మ స్థానాన్ని మరింత సుస్థిరం చేసింది. శర్మతో పాటు, బీజేపీ నాయకులు రామేశ్వర్ తేలి, అజంతా నియోగ్, ఏజీపీ అధ్యక్షుడు అతుల్ బోరా, బీపీఎఫ్ నాయకుడు చరణ్ బోరో కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

మిగతా 2లో

# నీట్ యుజి పరీక్ష రద్దు

### అయోమయం.. ఆగ్రహంలో విద్యార్థులు




- త్వరలోనే తేదీ ప్రకటన, అవకతవకలపై విచారణ
- ఎన్‌టిఏ అప్‌డేట్‌లను మాత్రమే అనుసరించాలని సూచన

**న్యూఢిల్లీ, మే 12 (వుదయం) :** మే 3న నిర్వహించిన నీట్ యుజి 2026 పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేసింది. ఈ వైద్య ప్రవేశ పరీక్షను తిరిగి నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ పరీక్షకు సంబంధించి ఆరోపిత అవకతవకలపై జరుగుతున్న విచారణ, ఆన్‌లైన్‌లో విద్యార్థుల నుండి వ్యక్తమైన ఆగ్రహం,

మిగతా 2లో

**మే 22 లోపే నీట్ పునఃపరీక్ష** 5

### నీట్ యుజి ఎందుకు రద్దైంది?

అక్రమాలు జరిగినట్లు వచ్చిన సమాచారం ఆధారంగా, ఎన్‌టిఏ మే 3న జరిగిన పరీక్షను రద్దు చేసింది. పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత, అంటే మే 7 సాయంత్రం తమకు ఈ సమాచారం అందినట్లు ఆ సంస్థ తెలిపింది. ఆ సమాచారాన్ని స్వతంత్ర ధృవీకరణ, తగిన చర్యల నిమిత్తం మే 8న కేంద్ర సంస్థలకు పంపినట్లు ఎన్‌టిఏ తెలిపింది. తన రద్దు ప్రకటనలో ఆ సంస్థ ప్రశ్నపత్రాల లీకేజీ అనే పదాలను ప్రత్యక్షంగా ఉపయోగించలేదు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీక్ కేసుగా అనుమానిస్తున్న దానిపై స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ దర్యాప్తు ప్రారంభించడంతో, అక్కడి నుంచి వచ్చిన నివేదికల తర్వాత ఈ వివాదం మరింత ముదిరింది. అందిన సమాచారం ప్రకారం, దర్యాప్తు అధికారులు చేతితో రాసిన ఒక సూచన పత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులోని సుమారు 120 ప్రశ్నలు, వాస్తవ నీట్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయని తెలిసింది. వీటిలో దాదాపు 90 బయాలజీ ప్రశ్నలు, సుమారు 30 కెమిస్ట్రీ ప్రశ్నలు ఉన్నాయి.

## కేరళ ముఖ్యమంత్రి రేసులో ముందున్న కేసీ వేణుగోపాల్



- రాహుల్ గాంధీతో కీలక సమావేశంలో 10లో ఏడుగురి మద్దతు

5

## 14, 15న బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం



- అతిధ్యానికి భారత్ సిద్ధం
- ధృవీకరించిన విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్
- భారతదేశం ఆతిథ్యం ఇవ్వడం ఇది నాలుగోసారి

5

## పాక్‌లో బాంబు పేలుడులో 9 మంది దుర్మరణం

- 23 మందికి గాయాలు
- లక్కీ మార్వత్‌లోని రద్దీ మార్కెట్‌లో పేలుడు
- ఆఫ్ఘన్ మిలిటెంట్లే కారణం : పాక్ ఆరోపణలు

5




## విమానయాన, పారిశ్రామిక లూబ్రికెంట్స్ రంగాలలో వృద్ధి సాధనకు ఒప్పందం చేసుకున్న లాంక్సెస్, హెచ్‌పిసిఎల్

- **లాంక్సెస్ బ్రాండెడ్ లూబ్రికెంట్స్, హెచ్‌పిసిఎల్ ద్వారా భారత్, సార్క్ దేశాల అంతటా విక్రయం**



**ముంబై, మే 12 :** 2026 – ప్రత్యేక రసాయనాల కంపెనీ లాంక్సెస్, భారతదేశ ప్రముఖ చమురు, గ్యాస్ కంపెనీ అయిన హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్), భారత్, సార్క్ దేశాలలో విమానయాన, పారిశ్రామిక లూబ్రికెంట్స్ లభ్యతను సంయుక్తంగా

మిగతా 2లో

## నీట్ రద్దు, విద్యార్థులకు శాపంగా ఎన్‌డిఏ వైఫల్యం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, మే 12 (ఎఎంఎస్) :** కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీట్ రద్దైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచకపడ్డారు. ప్రశ్నాపత్రం లీక్‌తో నీట్ పరీక్ష రద్దు కావడం కేంద్రానికి సిగ్గుచేటని విమర్శించారు. ఎన్డీఏ వైఫల్యం విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందురోజే లీక్ అయ్యాయని.. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాట మాడిందని ఆక్షేపించారు. 2024లోనూ ప్రశ్నాపత్రం లీకైందన్నారు.

## తెలంగాణ నర్సులకు జర్మనీలో ఉపాధి

- **అవకాశాలు కల్పించేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది**
- **79 మంది నర్సులు త్వరలోనే జర్మనీకి వెళ్లనున్నారు**
- **గనులు, ఉపాధి కల్పన, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**



**హైదరాబాద్, మే 12 (ఎఎంఎస్) :** తెలంగాణ రాష్ట్రంలోని నర్సులకు విదేశాల్లో ముఖ్యంగా జర్మనీలో అద్భుతమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక సమావేశంలో 'ట్రిపుల్ విన్' ప్రోగ్రాం వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని నర్సులకు విదేశాల్లో ముఖ్యంగా జర్మనీలో అద్భుతమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు

మిగతా 2లో

# భగీరథ్ కేసులో బాధితు రాలికి న్యాయం చేయాలని మాత్రమే మాట్లాడాను

## నా మాటలు వక్రీకరించారు

### మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మే 12 (ఎఎంఎస్) :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని మాత్రమే తాను మాట్లాడానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేసే అంశంపైనే తాను మాట్లాడానని.. తన మాటలను కొంతమంది వక్రీకరించారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లో మంత్రి పొన్నం మాట్లాడారు. ఈ కేసులో భగీరథ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తాను అన్నానని ప్రస్తావించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మున్నూరు కాపు సంఘాలు ఆరోపణలు చేశాయని అన్నారు. ఈ కేసులో బాధితురాలు కూడా అదే సామాజిక వర్గమని తాను చెప్పానని ప్రస్తావించారు. తన ఉద్దేశంలో కూడా బాధితురాలికి న్యాయం జరగాలనే తపన మాత్రమే ఉందని అన్నారు. ఇందులో ఎక్కడ కూడా కాంప్రమైజ్ కావాలని తాను మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. బాధితురాలికి కాంగ్రెస్ అండగా ఉంటుందని.. వారికి పూర్తిగా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాను పోరాడతానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# తెలంగాణ నర్సులకు జర్మనీలో ఉపాధి

మొదటి పేజీ తరువాయి

తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక సమావేశంలో 'ట్రిపుల్ విన్' ప్రోగ్రాం వివరాలను వెల్లడించారు. ఈ ప్రోగ్రాం కింద శిక్షణ పొందిన సుమారు 79 మంది నర్సులు త్వరలోనే జర్మనీకి వెళ్లనున్నారని తెలిపారు. జర్మనీలో రోగులతో సంభాషించడానికి జర్మన్ భాష అత్యంత అవసరమన్నారు. ముఖ్యమంత్రి విదేశీ విద్యానిధి కింద, అభ్యర్థుల వీసా, ఇతర ఖర్చులపై ప్రభుత్వం 50శాతం సబ్సిడీ అందిస్తోందని హామీ ఇచ్చారు. ఏజెంట్ల చేతిలో మోసపోకుండా, ప్రభుత్వ సంస్థ అయిన 'టామ్‌కామ్' ద్వారా ఈ నియామకాలు పారదర్శకంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జర్మన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, శిక్షణ పొందిన విద్యార్థులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శిక్షణలో ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# విమానయాన, పారిశ్రామిక లూబ్రికెంట్స్ రంగాలలో వృద్ధి సాధనకు ఒప్పందం చేసుకున్న లాంక్సెస్, హెచ్‌పిసిఎల్

మొదటి పేజీ తరువాయి

పెంపొందించడానికి ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకున్నాయి. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన, పారిశ్రామిక మార్కెట్లలో ప్రమాణాలను, లభ్యతను మెరుగుపరుస్తూ, సాంకేతికంగా ఆధునికమైన, అత్యుత్తమ పనితీరు కనబరిచే లూబ్రికెంట్స్ ఉత్పాదనలను అందించడమే ఈ భాగస్వామ్యం లక్ష్యం. ఈ భాగస్వామ్యం కింద, లాంక్సెస్, హెచ్‌పిసిఎల్ సంస్థలు లూబ్రికెంట్ల కోసం స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలిక మార్కెటింగ్, వ్యాపార అభివృద్ధి అవకాశాలను అన్వేషిస్తాయి. ఈ




సహకారం, కీలకమైన విభాగాలతో సహా, ప్రీమియం లాంక్సెస్ బ్రాండెడ్ ఏవియేషన్, పారిశ్రామిక లూబ్రికెంట్లకు స్థానికంగా విస్తృత ప్రాప్యతను కల్పిస్తుంది.''ఈ అవగాహన ఒప్పందం మా వృద్ధి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది. హెచ్‌పిసిఎల్‌తో కలిసి,భారతదేశంలోని చైతన్యవంతమైన ఏవియేషన్, పారిశ్రామిక మార్కెట్లలో వృద్ధిని వేగవంతం చేస్తూ, నాణ్యత, పనితీరులో మేం కొత్త ప్రమాణాలను నెలకొల్పుతాం'' అని లాంక్సెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ యూనిట్ లూబ్రికెంట్ అడిటివ్స్ గ్లోబల్ హెడ్ నీలాంజన్ బెనర్జీ అన్నారు. ''సామర్థ్యాన్ని, పనితీరును మెరుగుపరిచే అత్యాధునిక లూబ్రికెంట్లను భారతీయ వినియోగదారులకు అందించడానికి లాంక్సెస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం మాకు చాలా సంతోషంగా ఉంది. లాంక్సెస్ నైపుణ్యం, మార్కెట్‌లో మా బలమైన ఉనికితో, ఈ సహకారం విమానయాన, పారిశ్రామిక రంగాలలో వృద్ధిని సాధిస్తుంది," అని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, లూబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ సిహెచ్ అన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

**మహబూబ్ నగర్ మే12(వుదయం ప్రతినిధి) :** ప్రజా పాలనా-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వడ దెబ్బ నివారణ చర్యలకై ప్రజలకు 259 మంది ఉపాధి హామీ పథకము కూలీలకు వడ దెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించి 2132 ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ లు వైద్యాధికారులు పంపిణీ చేశారు. క్షయ నిర్ధారణ కార్యక్రమమును ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నవాబ్ పేట పరిధిలోని ఎన్మాన్ గండ్ల, రుద్రారం గ్రామములో క్షయ నిర్ధారణ కొరకు ఆరోగ్య శిబిరములు నిర్వహించి 203 మందికి ఎక్స్ రేలు 25 మందికి తెమడ పరీక్షలు చేశారు.దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ కార్యక్రమము పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి అవగాహన కల్పించారు.749 గృహములను సందర్శించి నీటి నిల్వలలో లార్వా ను పరిశీలించగా 27 గృహములలో లార్వాను గుర్తించి నిర్మూలన చర్యలు తీసుకున్నారు.31 మంది జ్వరం తో వున్నవారిని గుర్తించి రక్త పరీక్షలు చేసి చికిత్సలు చేశారు.



# కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

మొదటి పేజీ తరువాయి




"కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలి. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్లకు తరలించాలి. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించరాదు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు. ధాన్యం లోడింగ్ విషయంలో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలి. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలి. అలా చేయడం వల్ల తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చు" అని ముఖ్యమంత్రి చెప్పారు. లారీల కొరత ఉంటే దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని, ధాన్యం తరలించడానికి అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. "పలు ప్రాంతాల్లో గోదాముల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. అవసరమైన చోట రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను అందుబాటులోకి తీసుకుని ధాన్యాన్ని తరలించాలి. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలుండాలి" అని సూచించారు. ప్రాంతాల వారిగా సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారితనంతో వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించే అధికారులు, కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని సిఎం హెచ్చరించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని ఆదేశించారు. అకాల వర్షాల సమయంలో రైతులకు నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఇలాంటి సమయాల్లో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని సిఎం చెప్పారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలి. ప్రతి రైస్‌మిల్లు వద్ద ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తుమ్మల నాగేశ్వర రావు , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి గారు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావుతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# నేను జైలుకు వెళ్లాను

**హైదరాబాద్, మే 12 (ఎఎంఎస్) :** స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాలిసిన అవసరం ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ..తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు. మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమ యంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు తెలంగాణ శివ ప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు.



# నీట్ యుజి పరీక్ష రద్దు

మొదటి పేజీ తరువాయి

రోజుల తరబడి కొనసాగిన వివాదం నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. లక్షలాది మంది వైద్య విద్యార్థులకు, ఇది కేవలం మరొక పరీక్షా అప్‌డేట్ మాత్రమే కాదు. దీని అర్థం మరింత నిరీక్షణ, మరింత ఒత్తిడి, మరింత పునశ్చరణ. చాలా మంది విద్యార్థులు అప్పటికే జవాబు కీ, కటాఫ్ మార్కులు కళాశాల ప్రవేశాల గురించి ఆలోచించడం మొదలుపెట్టారు. ఇప్పుడు, ఈ పరీక్షా ప్రక్రియ మొత్తం మళ్ళీ అనిశ్చితిలో పడింది. నీట్ యుజి వివాదంపై సిబిఐ విచారణకు ఆదేశాలు ఈ విషయాన్ని విస్తృత విచారణ కోసం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు అప్పగించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. విచారణకు పూర్తి సహకారం అందిస్తామని, ఏజెన్సీకి అవసరమైన అన్ని రికార్డులు, సామాగ్రి, సాంకేతిక సహాయాన్ని అందిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. విద్యార్థులు, కుటుంబాలపై ఉన్న మానసిక భారాన్ని తాము అర్థం చేసుకున్నామని తమ ప్రకటనలో ఎన్‌టిఏ పేర్కొంది. నెలల తరబడి చదువుకున్న లక్షలాది మంది అభ్యర్థులు ఇప్పుడు మళ్లీ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపింది. లోపభూయిష్టమైన పరీక్షా ప్రక్రియను కొనసాగనివ్వడం వల్ల వ్యవస్థపై నమ్మకానికి మరింత తీవ్రమైన, శాశ్వతమైన నష్టం వాటిల్లుతుందని ఆ ఏజెన్సీ వివరించింది. నిజమైన అభ్యర్థులలో అత్యధిక శాతం మంది చేసిన కఠోర శ్రమ ఎప్పుడూ ప్రశ్నార్థకం కాలేదని కూడా ఎన్‌టిఏ పేర్కొంది.



**విద్యార్థులు ఇప్పుడు ఏం చేయాలి?**

విద్యార్థులు కొత్తగా దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదు. మే నెలలో జరిగిన పరీక్షా విడతకు సంబంధించిన అభ్యర్థుల వివరాలు, పరీక్షా కేంద్రాల ప్రాధాన్యతలు, కొత్త పరీక్షకు స్వయంచాలకంగా బదిలీ అవుతాయని ఎన్‌టిఏ తెలిపింది.

**విద్యార్థులకు ముఖ్యమైన సూచనలు**

కొత్త నీట్ యూజీ 2026 పరీక్ష తేదీ త్వరలో ప్రకటించనున్నారు. సవరించిన అడ్మిట్ కార్డ్ షెడ్యూల్ తర్వాత తెలియజేస్తారు. ప్రస్తుతానికి కొత్తగా దరఖాస్తు చేయనవసరం లేదు. విద్యార్థులు అధికారిక ఎన్‌టిఏ అప్‌డేట్‌లను మాత్రమే అనుసరించాలి. ఎన్‌టిఏ హెల్ప్‌లైన్లు neet-ug@nta.ac.in, 011-40759000, 011-69227700 నంబర్ల ద్వారా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతానికి, విద్యార్థులు, తల్లిదండ్రులు కొత్త తేదీ కోసం వేచి చూస్తున్నారు. ఇవ్వదగిన అత్యంత ముఖ్యమైన సలహా ఒక్కటే, అడ్డదిడ్డంగా వచ్చే ఫార్వార్డ్ సందేశాలను నమ్మవద్దు. అధికారిక ఎన్‌టిఏ మాధ్యమాలను మాత్రమే తనిఖీ చేయండి, అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోండి. వినడానికి కష్టంగా అనిపించినా సరే, మీ పుస్తకాలను మా త్రం పక్కన పెట్టకుండా చదువు కొనసాగించడమే మార్గం.

# అస్సాం పీఠంపై మరోసారి హిమంత

మొదటి పేజీ తరువాయి

గౌహతిలోని ఖానాపారాలో గల వెటర్నరీ మైదానంలో వైభవంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య వీరిచే ప్రమాణాలు చేయించారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సర్బానంద సోనోవాల్, పవిత్ర మార్గరీటా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ హాజరయ్యారు.

కామాఖ్య అమ్మవారు, శ్రీమంత శంకరదేవుడు, అస్సాం ప్రజల ఆశీస్సులతో, నేను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాను. మంత్రి మండలితో కలిసి, మా ప్రజలకు సేవ చేయడానికి, వారి ఆకాంక్షలన్నింటినీ నెరవేర్చడాన్ని కొనసాగించడానికి మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం.



**మంత్రివర్గ సభ్యులు..** గోలాఘాట్ నుండి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అజంతా నియోగ్ గత ప్రభుత్వంలో అసోం ఆర్థిక మంత్రిగా సేవలందించిన అనంతరం తిరిగి మంత్రివర్గంలోకి ప్రవేశించారు. రాష్ట్రంలో అత్యంత సుదీర్ఘకాలం పాటు శాసనసభ్యురాలిగా కొనసాగిన మహిళ ఈమె. 2001 నుండి నిరంతరాయంగా గోలాఘాట్ నియోజకవర్గానికి ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2020లో కాంగ్రెస్ పార్టీ నుండి బీజేపీలో చేరిన నియోగ్, 2021లో అసోం రాష్ట్రపు తొలి మహిళా ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రముఖ టీ తెగ నాయకుడు, మాజీ కేంద్ర సహాయ మంత్రి అయిన రామేశ్వర్ తేలి, అస్సాం మంత్రివర్గంలో తొలిసారిగా ప్రవేశించారు. జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టడానికి ముందు, 2001లో దులియాజాన్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి, తేలి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2014, 2019లో లోక్‌సభలో దిబ్రూగఢ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన, రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించారు. ఈ ఏడాది ఆయన తిరిగి రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. ఎజిపి అధ్యక్షుడు అతుల్ బోరా, ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన మాజీ ఆసు నాయకుడు. గత ప్రభుత్వంలో వ్యవసాయం, సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి వంటి కీలక శాఖలను నిర్వహించిన ఆయనను, మరోసారి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. మజ్‌బాట్ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బిపిఎఫ్ నాయకుడు చరణ్ బోరో కూడా, గత ప్రభుత్వంలో రవాణా మంత్రిగా సేవలందించిన అనంతరం, ప్రస్తుత మంత్రివర్గంలో తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు.

# ప్రారంభం – ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యం

**దౌల్తాబాద్ మే 12 (వుదయం):** రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పల్వనూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, కార్మికులు, సాధారణ ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సేవలో ముందుంటుందని పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు, స్థానిక ప్రజలు లాభపడతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిష్టారెడ్డి, ఉషనగల్ల స్వామి, నర్సింగరావు, యూసుఫ్, నాగేశ్వర రావు, వెంకట్, స్వామి, అశోక్, మహేష్ పాల్గొన్నారు.



# పోక్సో కేసులో నిందితుడి అరెస్టు ఆలస్యం ఎందుకు?

### ప్రభుత్వం సమాధానం చెప్పాలి: శ్రీజ్యోతిభీమ్ భరత్

### బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి వెంటనే న్యాయం చేయాలి: మహిళా కాంగ్రెస్ డిమాండ్

### .పిల్లల భద్రత విషయంలో రాజీ లేదు.. పోరాటం కొనసాగుతుంది: శ్రీజ్యోతిభీమ్ భరత్ హెచ్చరిక




**శంకర్‌పల్లి, మే 12 (వుదయం) :** పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేసి, బాధిత కుటుంబానికి పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతిభీమ్ భరత్ డిమాండ్ చేశారు. 17 ఏళ్ల బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదై మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు నిందితుడిపై అరెస్ట్ చర్యలు తీసుకోకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని ఆమె పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమే అయితే, పోక్సో వంటి సున్నితమైన కేసుల్లో ఎందుకు ఆలస్యం జరుగుతోందో పోలీసులు మరియు ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. పిల్లల రక్షణకు సంబంధించిన కేసుల్లో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో మాట్లాడిన శ్రీజ్యోతిభీమ్ భరత్, బాధితురాలి కుటుంబం న్యాయం కోసం పలుమార్లు పోలీసులను ఆశ్రయించినప్పటికీ సరైన స్పందన లభించలేదని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లు, ప్రభావాల కారణంగానే కేసు దర్యాప్తు నెమ్మదిగా సాగుతోందనే భావన ప్రజల్లో బలపడుతోందన్నారు. బాధిత కుటుంబాన్ని బెదిరింపులకు గురిచేస్తున్నారనే సమాచారం తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి పరిస్థితుల్లో కుటుంబానికి తక్షణ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందనే విమర్శలు వస్తున్నాయని ఆమె అన్నారు. పోక్సో చట్టం చిన్నారుల రక్షణ కోసం తీసుకువచ్చిన కఠినమైన చట్టమని, అలాంటి కేసుల్లో విచారణ వేగంగా జరగాల్సిన అవసరం ఉందని శ్రీజ్యోతిభీమ్ భరత్ పేర్కొన్నారు. అయితే ఈ కేసులో మాత్రం అధికారులు ఆలస్యం చేస్తున్నారనే అనుమానం ప్రజల్లో నెలకొందన్నారు. ఒక సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి ఇదే తరహా ఆరోపణలు ఎదుర్కొంటే ఇప్పటికి అరెస్ట్ జరిగేదని, కానీ రాజకీయ సంబంధాలు ఉన్న నేపథ్యంలో కేసు వ్యవహారంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని విమర్శించారు. చట్టపరమైన ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగితే మహిళా కాంగ్రెస్ ఊరుకోదని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని శ్రీజ్యోతిభీమ్ భరత్ స్పష్టం చేశారు. మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలు చేయకుండా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి, నిజాలు బయటపెట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే శంకర్ చేతుల మీదుగా ఎల్ఓసిలు అందజేత



**హైదరాబాద్, మే 12 (వుదయం ప్రతినిధి) :** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరియు మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ మంగళవారం రోజు ఎల్ఓసి మరియు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. 18వ వార్డు భాగ్యనగర్ కాలనికి చెందిన అబ్దుల్ రెహమాన్‌కు ఎల్ఓసి ద్వారా రూ.1,00,000 చెక్కును, హనుమాన్లుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.37,000 చెక్కును అందజేశారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,కౌన్సిలర్లు పెంటయ్య, మురళి మోహన్, నరేష్, లింగారెడ్డిగూడెం ఉపసర్పంచ్ అశోక్, తంగేడుపల్లి శంకర్, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్ విజేతలను అభినందించిన గోలి

**వెల్దండ మే 12 (వు దయం) :** మండలంలో జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షల్లో 73, 74 శాతం ఉత్తీర్ణత సాధించిన కొమ్ము హన్సిక, దాసరి అఖిల లను మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి శాలువాలు కప్పి అభినందించారు . విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి రూ. 8,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగులు నాయక్,మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,మాజీ సర్పంచ్ ప్రభాకర్,మాజీ ఎంపీటీసీ లింగం, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, సీనియర్ నాయకులు జోగాయ్య,మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి,చుక్కాపూర్ సర్పంచ్ వీరేషం,సురేందర్ రెడ్డి,వార్డు సభ్యులు దేవేందర్, ఆనంద్,మాజీ ఉప సర్పంచ్ నర్సింహా,శేఖర్,ఉప సర్పంచ్ కొండల్ యాదవ్,నాయకులు ప్రవీణ్,శ్రీను,గణేష్,స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులు,విద్యార్థుల కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని అభినందనలు తెలిపారు.





# గ్రేటర్ హైదరాబాద్



## రబీ రైతుకు అండగా ప్రభుత్వం

### మొక్కజొన్న సేకరణపై సీఎం దిశానిర్దేశం





**రంగారెడ్డి ,మే 12**
**(ఉదయం ప్రతినిధి).**

మంగళవారం రబీ 2025 26 మక్కజొన్న కొనుగోలు మరియు వరి ధాన్యం సేకరణపై గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, దనసరి అనసూయ, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు తో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో బాధ్యత, జవాబుదారీతనం స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలన్నారు. ధాన్యం రవాణా వేగవంతం చేయడానికి రవాణా శాఖ కమిషనర్ సహకారంతో మరిన్ని వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలి, హమాలీలను అవసరమైన సంఖ్యలో నియమించి, వారికి తగిన పారితోషికం చెల్లించాలని సూచించారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనులు వేగంగా జరిగేలా చూడాలి, ప్రతి కొనుగోలు కేంద్రానికి బాధ్యతాయుత అధికారిని నియమించి, పూర్తి బాధ్యత కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. బీ హా ర్ , పశ్చిమ బెంగాల్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించకుండా స్థానిక హమాలీల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. మిల్లర్ల నుంచి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. లారీలపై మాత్రమే ఆధారపడకుండా, సమీప ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను కూడా వినియోగించాలని అన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాలలో మరిన్ని టార్పాలిన్లను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్రత్యేక అధికారిని నియమించి, అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా అధికారులు ప్రతిరోజూ కొనుగోలు ప్రక్రియపై నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రతిరోజూ సమీక్షిస్తూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, పనుల్లో జాప్యం జరిగితే లేదా రైతులు ఆందోళనలు చేపడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ధా న్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలన్నారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలి, ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దు, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దు, ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్ ను ఆదేశించారు.

సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందేనని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదన్నారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్ ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలి. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్ కు తరలించేలా ప్రణాళికలుండాలి. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలాచూడాలి. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్ కు రిపోర్ట్ పంపించాలి. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రియాజొద్దీన్, పిడి డీఆర్డీఏ శ్రీలత, డీసీసీఓ సుధాకర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అభినందనలు

### నర్సులకు ప్రత్యేక గౌరవం

**ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్**
**అంతర్జాతీయ నర్సుల దినోత్సవము**
**శేరిలింగంపల్లి ,మే 12**
**(ఉదయం ప్రతినిధి)**



లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపంలో గల పద్మా అపార్ట్ మెంట్ లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి క్రొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ R. పుట్టరాజు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్, BHEL జనరల్ హాస్పిటల్ అతిథులుగా డాక్టర్ B.C.రామన్న సత్యసాయి సేవాసమితి రంగారెడ్డి జిల్లా కన్వీనర్, E. దేవానంద్ యాదవ్ సోషల్ వర్కర్ విచ్చేసి మాట్లాడుతూ " ప్రపంచ ఆరోగ్యసంస్థ వారు మే 12వ తారీఖున ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఒక ప్రత్యేక నినాదంతో నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 'మన నర్సులు మన భవిష్యత్తు సాధికారులైన నర్సులు మన ప్రాణాలను కాపాడతారు' అనే నినాదంతో నిర్వహిస్తున్నారు. మానవులకు సేవ చేయడానికి భగవంతుడు కల్పించిన అవకాశమే వైద్య రంగం. దీనిలో ప్రధానమైంది నర్సింగ్ వృత్తి. రోగులకు వైద్యులు యిచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవకూడా అంతే ముఖ్యం" అని అన్నారు. " ఫ్లోరెన్స్ నైటింగేల్ 1812 మే 12వ తేదీన ఇటలీలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. ఆ రోజులలో వైద్యశాలలు శుచిశుభ్రత లేకుండా అధ్వాన్నస్థితిలో ఉండేవి. నైటింగేల్ తన తల్లిదండ్రుల అభీష్టానికి వ్యతిరేకంగా సేవ చేయడానికై నర్సింగ్ వృత్తిని యెంచుకొని జర్మనీ, ఐర్లాండ్ లలో పనిచేసి అక్కడ వైద్యశాలల పరిస్థితులలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి మెరుగుపరచి తిరిగి లండన్ వచ్చి అక్కడ హాస్పిటళ్ళలో పరిశుభ్రతకు ప్రాధాన్యతతో పాటు రోగులకు పౌష్టికాహారాన్ని అందించే ఏర్పాటు చేసింది. 1854లో క్రీమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో క్షతగాత్రులైన సైనికులకు తోటి నర్సులను కూడగట్టుకుని నిరుపమానమైన సేవలు అందించింది. ఎంతో గుండె నిబ్బరంతో చిమ్మచీకట్లలో చిరుదీపం వెంట తీసుకుని వెళ్ళి రోగులకు సేవలందించి, వారిలో బ్రతుకుతామనే ఆశలను చిగురింపజేసింది. వారి ముఖాలపై చిరునవ్వులు ఆమె చేతిలోని దీపంలాగా వెలిగాయి. రోగులకు కావలసిన మందులు, పరికరాలు పంపమని ప్రభుత్వానికి అర్జీలు పంపేది. రోగులకు ఆసుపత్రులలో చోటు సరిపోకపోతే అధికారులను ఒప్పించి పాత యిళ్ళను, భవనాలను ఆసుపత్రులుగా మార్చేది. 'త్రాగుడుకు డబ్బులు కర్చు పెట్టకండి. ఆ డబ్బులను మీ యింటికి పంపిస్తే యిల్లు గడుస్తుంది కదా' అని హితబోధ చేసేది. గ్రంథాలయాలు, చదువుకునే గదులు అందరికి అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది. నోట్స్ ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్ అనే గ్రంథాలను వ్రాయడమే కాక, విక్టోరియా రాణికి అలాగే ప్రభుత్వ అధికారులకు హాస్పిటల్స్ బాగు కొరకు అభ్యర్థనలు పంపేది. నాటి నుండి నర్సింగ్ వృత్తికి ప్రత్యేకంగా శిక్షణ యివ్వడం ప్రారంభం అయింది. 1860వ సంవత్సరం జూన్ 24 న ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సెస్ అనే సంస్థను లండనులో స్థాపించింది. ఆమెను 'మదర్ ఆఫ్ మోడ్రన్ నర్సింగ్' గా గుర్తించారు. ఆవిడ భారతదేశానికి కూడా యితోధిక సేవలు అందించారు. 1859వ సంవత్సరంలో విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కొరకు ఒక కమీషన్ ను నియమించింది. ఫ్లోరెన్స్ నైటింగేల్ సూచనలు, సలహాల మేరకు భారతదేశంలో శానిటరీ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

దాని వల్ల మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గడం జరిగింది. ఫ్లోరెన్స్ నైటింగేల్ మరలా పుట్టి నేటి ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితులను మెరుగు పరచాలని కోరుకుందాం. సేవానిరతి గల ప్రతి నర్సులోనూ ఆమె జీవించి ఉంటుంది. నర్సులు, రోగులు గుర్తుంచుకోవలసిన ఆదర్శమూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ " అని కొనియాడారు. " NURSE అనే ఆంగ్ల పదంలోని అక్షరాలకు (N) NOBLE, (U) UNDERSTANDING, (R) RESPONSIBILITY, (S) SYMPATHY (E) EFFICIENT అనే ఆంగ్ల పదాలను తెలుగులోకి అనువదిస్తే మహోన్నతమైన, అవగాహన, బాధ్యత, సానుభూతి, సమర్థవంతమైన సేవలు అందించేదే నర్సింగ్ వృత్తి" అని అన్నారు. " ్సంగ్ వృత్తికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆవిడ జన్మదినమైన మే12వ తారీఖునాడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం" అని అన్నారు. "నేటి యువ నర్సులు ఆవిడ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలి " అని కోరారు. " కనిపించే దేవుళ్ళు వైద్యులైతే కాపాడే దేవతలే నర్సులు" అని కొనియాడారు. తదనంతరం నర్సులచేత ' రోగులకు అంకితభావంతో మెరుగైన సేవలు అందిస్తాం' అని ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా మానవసేవే మాధవసేవగా భావించి వివిధ ప్రభుత్వ వైద్యశాలలో (నిమ్స్, లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రంగారెడ్డి జిల్లా ఆసుపత్రి, కొండాపూర్, ఏరియా హాస్పిటల్, పటాన్ చెరు, ESI హాస్పిటల్, RC పురం, BHEL జనరల్ హాస్పిటల్, హఫీజ్ పేట అర్బన్ హెల్త్ సెంటర్, HCU హెల్త్ సెంటర్, ఉర్దూ యూనివర్సిటీ హెల్త్ సెంటర్, సరోజినీ దేవి కంటి ఆసుపత్రి, ఉస్మానియా జనరల్ హాస్పిటల్) రోగులపట్ల ప్రేమానురాగాలు చూపిస్తూ వైద్య సేవలందించిన సేవామూర్తులైన 80 మంది నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుతో పాటు శాలువ, జ్ఞాపిక, పగిడిలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం E. దేవానంద్ యాదవ్ సౌజన్యంతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందూరి వెంకటేశ్వర రాజు, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, G.V. రావు, సత్యనారాయణ,వాణిసాంబ శివరావు,విజయలక్ష్మి ,విష్ణుప్రసాద్, బాలాజీ, శివరామిరెడ్డి,వెంకటేశ్వర్లు, పాండు,తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి (85)ఫిర్యాదులు

- సమస్యలను వెంటనే పరిష్కరించాలి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశం
- పెండింగ్‌లో ఉంచరాదు అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అనవసరంగా పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కార మార్గాలను అన్వేషించాలని స్పష్టం చేశారు.

**రంగారెడ్డి ,మే 12**
**(ఉదయం ప్రతినిధి)**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (85) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రె వె న్యూ శాఖ- 42, ఇతర శాఖలు - 43, మొత్తం 85 దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పేదల ఆరోగ్యానికి ఎమ్మెల్యే గూడెం భరోసా

**గుమ్మడిదల,మే 12(ఉదయం)**

నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.గుమ్మడిదల రూ. 3.25 లక్షల ఎల్ఓసీల అందజేతఎమ్మెల్యే గూడెం.. మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి గ్రామానికి చెందిన ఉపేంద్ర కుమార్, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం గ్రామానికి చెందిన సుజాత గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, వారికి రూ.3 లక్షల 25 వేల విలువైన ఎల్ఓసీలు మంజూరయ్యాయి. మంగళవారం ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా సంబంధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ అనుమతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, యునూస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభవంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం




**దుండిగల్, మే 12**
**(ఉదయం ప్రతినిధి )**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ లోని ప్రభుత్వ పాటశాలలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 10వ తరగతి లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా లొనే మొదటి స్థానం సంపాదించిన విద్యార్థికి, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం, అభినందన సభ నిర్వహించారు. భౌరంపేట్‌కు చెందిన ఒక విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి లక్ష్మీ నారాయణకు రూ.50,000 నగదు పురస్కారం అందజేశారు. అలాగే మండల స్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.30,000 నగదు బహుమతిని ప్రదానం చేశారు. అదేవిధంగా 500 పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున, 490 పైగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు పురస్కారాలను అందజేసి వారి ప్రతిభను కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం భౌరంపేట్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాటశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, నాయకులు మన్నే శేఖర్ ముదిరాజ్, మిద్దెల మల్లారెడ్డి, కటకం విరేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్‌లో గుండె దడ సమస్యలకు విప్లవాత్మక చికిత్స

- దేశంలోనే మొదటిసారిగా 'పల్స్ ఫీల్డ్ అబ్లేషన్' (PFA) సాంకేతికత ప్రారంభం

**హైదరాబాద్, 12 మే,**
**(ఉదయం ప్రతినిధి ),**




గుండె సంబంధిత సమస్యల చికిత్సలో హైదరాబాద్ లోని శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ సరికొత్త రికార్డు సృష్టించింది. గుండె కొట్టుకోవడంలో తేడాలు (హార్ట్ రిహైతం డిసర్డర్స్ ) ఉన్నవారికి చికిత్స చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా వాడుతున్న అత్యంత ఆధునిక 'పల్స్ ఫీల్డ్ అబ్లేషన్' (పి ఎఫ్ ఎ) అనే టెక్నాలజీని ఆసుపత్రిలో ప్రారంభించారు. భారతదేశంలోనే మొదటిసారిగా ఈ అధునాతన టెక్నాలజీని తీసుకువచ్చిన ఆసుపత్రిగా శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ నిలిచింది. కార్డియాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ వి.ఎస్. రామచంద్ర, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బిజు గోవింద్, నిపుణులు డాక్టర్ భరణి వేలం, డాక్టర్ ప్రకాష్ నంజయ్య వారి బృందం ఈ కొత్త టెక్నాలజీని ప్రజలకు పరిచయం చేశారు. పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ సాధారణంగా గుండెలో విద్యుత్ ప్రవాహంలో లోపాల వల్ల గుండె కొట్టుకోవడంలో వేగం పెరగడం లేదా తగ్గడం జరుగుతుంది (దీనిని వైద్య పరిభాషలో అరిథ్మియా అంటారు). గతంలో దీనికి చేసే చికిత్సలో గుండెలోని కొన్ని భాగాలను వేడి చేయడం (హీట్ ) లేదా గడ్డకట్టించడం (కోల్డ్ ) ద్వారా సరిచేసేవారు. ఈ కొత్త పి ఎఫ్ ఎ టెక్నాలజీ విద్యుత్ తరంగాల (ఎలక్ట్రిక్ పల్స్ ) ద్వారా కేవలం దెబ్బతిన్న కణాలను మాత్రమే సరిచేస్తుంది. ఈ పద్ధతిలో గుండె చుట్టూ ఉండే నరాలు, రక్తనాళాలు లేదా ఆహార వాహికకు ఎటువంటి హాని కలగదు. నొప్పి ఉండదు ఇది సర్జరీ లాంటిది కాదు, కేవలం చిన్న రంధ్రం ద్వారా చేసే చికిత్స కాబట్టి నొప్పి ఉండదు. చికిత్స జరిగిన కొద్ది గంటల్లోనే లేదా అదే రోజున రోగి ఇంటికి వెళ్లవచ్చు. పాత పద్ధతులతో పోలిస్తే ఈ చికిత్స చాలా తక్కువ సమయంలో పూర్తవుతుంది. డాక్టర్ వి.ఎస్. రామచంద్ర (ఛైర్మన్, శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్) మాట్లాడుతూ భారతదేశంలోనే మొదటిసారిగా ఈ పి ఎఫ్ ఎ టెక్నాలజీని మా ఆసుపత్రిలో ప్రారంభించడం గర్వంగా ఉందని గుండె దడ సమస్యలతో బాధపడే రోగులకు ఇది ఒక వరం లాంటిది. దీని ద్వారా మరింత సురక్షితంగా, ఖచ్చితత్వంతో చికిత్స అందించవచ్చు అని అన్నారు. డాక్టర్ ప్రకాష్ నంజయ్య మాట్లాడుతూ అమెరికా, యూరప్ వంటి దేశాల్లో ఇప్పుడు ఈ టెక్నాలజీనే ఎక్కువగా వాడుతున్నారని ఇప్పుడు అది మన హైదరాబాద్‌లోని శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్‌లో అందుబాటులోకి రావడం మన రోగులకు గొప్ప విషయం అని ఈ టెక్నాలజీతో శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ ఇప్పుడు గుండె దడ (అట్రియల్ ఫైబ్రిలేషన్ ) సమస్యలకు దేశంలోనే అత్యుత్తమ చికిత్సా కేంద్రంగా మారిందని అత్యాధునిక ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలను సామాన్యులకు కూడా అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## పోక్సో కేసు నిందితుడు సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి



**శంకర్ పల్లి, మే 12 (ఉదయం)**

పోక్సో కేసులో బీజేపీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై 17 సంవత్సరాల బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో కేసు నమోదు అయినప్పటికీ మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం పట్ల శంకర్‌పల్లి పీఏసీఎస్ ఛైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో పోలీసుల నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు. బాధిత కుటుంబం న్యాయం కోసం రోజుల తరబడి తిరుగుతున్నా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మండల పరిధిలోని సిటిజన్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పోక్సో వంటి అత్యంత తీవ్రమైన కేసులోనూ పోలీసుల చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని అన్నారు. బాధిత కుటుంబం మూడు రోజులుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా నిందితుడిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. చట్టం ముందు అందరూ సమానమైతే, ఇలాంటి కేసుల్లో అరెస్ట్ ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాల విషయంలో ప్రభుత్వ వ్యవస్థలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కేసులో రాజకీయ ప్రభావంతో బాధిత కుటుంబాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కేసులో విచారణ వేగవంతం చేసి బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఇక ఈ సంఘటనపై మండల మరియు మున్సిపల్ కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా స్పందించి బాధిత కుటుంబానికి మద్దతుగా నిలవాలని వారు కోరారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అవసరమైతే పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి పీఏసీఎస్ ఛైర్మన్, మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బద్దం శశిధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాణిక్ రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మన్న గారి గోవర్ధన్ రెడ్డి, చెందిప్ప సర్పంచ్ మల్లికార్జున్, కౌన్సిలర్లు ఉషా కిరణ్ విజయ్ కుమార్, బానూరి కృష్ణ, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, వడ్డే మహేష్, మాజీ సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బుల్కాపూర్ మాజీ వార్డ్ సభ్యులు మల్లారెడ్డి, జులకంటి మహేందర్ రెడ్డి, అశోక్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అందరూ ఒకే స్వరంతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని బాధిత కుటుంబాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు.




## మనసు నిండుగా ఆరోగ్యానికి అండగా

- సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే " వీర్ల పల్లి శంకర్"..
- ఆరోగ్య బాధితులకు సర్కారు అండగా ఉంటుందన్న ఎమ్మెల్యే షాద్ నగర్ అసెంబ్లీ వ్యాప్తంగా 83 చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

**షాద్ నగర్ ,మే 12**
**(ఉదయం ప్రతినిధి)**

మనసు నిండుగా.. ఆరోగ్యానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిరుపేద అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడి పెద్ద పెద్ద ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవడానికి ఇబ్బంది పడే నిరుపేదల కోసం ప్రభుత్వం సీఎం సహాయ నిధిని పెద్ద ఎత్తున అందజేస్తుందని వెల్లడించారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా 83 చెక్కులు ఈ సందర్భంగా ఆయన అందజేశారు. ఫరూక్ నగర్ మండల లబ్ధిదారులకు 24, కొత్తూరు మండలానికి 14, కొందరుకు మండలానికి 10, కేశంపేట మండలానికి 14, నందిగామ మండలానికి నాలుగు, జిల్లేడు కూడా మండలానికి నాలుగు చెక్కులతో పాటు, షాద్నగర్ మున్సిపాలిటీ కి సంబంధించి 13 చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు..

## నేడు చేగూర్ లో హరీష్ రావు పర్యటన



**షాద్ నగర్ ,మే 12**
**(ఉదయం ప్రతినిధి)**

నందిగామ మండలం చేగూర్ గ్రామంలోని వీరాంజనేయ స్వామి దేవాలయ విగ్రహ ప్రాణః ప్రతిష్ట మరియు నూతన దేవాలయ ప్రారంభోత్సవంలో రేపు తేది 13.05 2026 బుధవారం రోజున శాసనసభ ఉప పక్ష నేత, మాజీ మంత్రి హరీష్ రావు గారు మరియు పలువురు మాజీ మంత్రులు పాల్గొంటారని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారు తెలిపారు.కావున నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు మరియు మీడియా మిత్రులు హాజరుకాగలరు. ఉదయం 9:30 గంటలకు బీఆర్ఎస్ శ్రేణులు తిమ్మాపూర్ చౌరస్తా వద్దకు రాగలరు.



“హిందూ మతాన్ని నిర్మూలించడమే ఉదయనిధి స్టాలిన్, డీఎంకేల విధానమైతే, దానిని వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు ప్రస్తావించలేదు? ఎన్నికల ప్రచార సమయంలో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం నిర్మూలన గురించి ఎందుకు మాట్లాడలేదు. ఎన్నికల ప్రచారం చివరి రోజున మేం హిందువులకు వ్యతిరేకం కాదు అని స్టాలిన్ ఎందుకు చెప్పుకున్నారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆయన మారలేదు.”

– తమిళనాడు బీజేపీ నేత శ్రీనివాసన్

## వే'మన'పద్యం

ఆశకోసివేసి యనలంబు చల్లార్చి
గోచిబిగియకట్టి గుట్టుదెలిసి
నిలిచినట్టివాడె నెరయోగి యెందైన
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# అసమర్థతే వ్యవస్థగా మారితే?

ఈ ఏడాది మే 3న, భారత దేశంలో వైద్య వృత్తిలోకి ప్రవేశించడానికి ఏకైక మార్గమైన నీట్ యుజి పరీక్షకు 23 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. కేవలం కొద్ది రోజుల్లోనే, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) ఈ పరీక్షను రద్దు చేసింది. ఆరోపిత పరీక్షా పత్రాల లీకేజీ దర్యాప్తును సిబిఐకి అప్పగించింది, అలాగే పారదర్శకత, విశ్వాసనీయత గురించి తనకు అలవాటైన ప్రకటనను విడుదల చేసింది. భారతదేశం సరిగ్గా రెండేళ్ల క్రితం కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంది. అప్పుడు వాడిన భాష అదే. అప్పుడు చెప్పిన క్షమాపణ అదే. అప్పుడు ఇచ్చిన హామీ అదే. కేవలం సంవత్సరం మాత్రమే మారింది.ఇది అసమర్థత కాదు. పదేపదే జరిగే అసమర్థతను సరిదిద్దకుండా వదిలేస్తే, అది ఒక వ్యవస్థగా మారుతుంది. దేశంలో పరీక్షల నిర్వహణ అనేది తరచుగా భారీ అంతరాయాలను ఎదుర్కొని, తీవ్ర వ్యతిరేకతను తట్టుకుని, ఆపై పునఃప్రారంభమయ్యే ఒక వ్యవస్థగా తయారైంది. మే 5, 2024న, నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ అయిందన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. బీహార్‌లోని పాట్నాలో, పరీక్షకు ముందే ప్రశ్నపత్రాన్ని పొందడానికి రూ. 30-50 లక్షలు చెల్లించారన్న ఆరోపణలపై, నలుగురు పరీక్షార్థులతో సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. దీనితో వెంటనే వివాదం రేకెత్తింది. నాటి ఎన్‌టిఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ సింగ్‌ను ప్రభుత్వం పదవి నుండి తొలగించి, నీట్ యుజి అక్రమాల కేసును సిబిఐకి అప్పగించింది. దీనిని ఒక నిర్ణయాత్మక చర్యగా చిత్రీకరించారు. కానీ, సంస్థాగత జాప్యం అనే సుదీర్ఘ క్రీడలో ఇది కేవలం మొదటి అడుగు మాత్రమే. నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి సీబీఐ అంతిమంగా 36 మందిని అరెస్టు చేసింది. ఆ ఏడాది 155 మంది విద్యార్థులు నేరుగా లబ్ధి పొందిన పేపర్ లీక్ నిస్సందేహంగా జరిగినప్పటికీ, అది మొత్తం పరీక్షను ప్రభావితం చేసేంత విస్తృతంగా జరిగినట్లు ఎటువంటి సూచన లేదని సుప్రీం కోర్టు నిర్ధారించింది. ఈ పరిమిత కారణంతో పరీక్షను రద్దు చేయలేదు. కౌన్సెలింగ్ కొనసాగింది. ఈ సంక్షోభం అదుపులోకి వచ్చినట్లు ప్రకటించారు. అరెస్టులు అంటే శిక్షలు కాదు. దర్యాప్తులు అంటే సంస్కరణలు కాదు. బ్రోకర్లు, సెంటర్ సూపరింటెండెంట్లు, స్థానిక మధ్యవర్తుల వంటి వివిధ స్థాయిల ద్వారా పనిచేసే సిండికేట్ నమూనా నిర్మాణాత్మకంగా చెక్కుచెదరకుండా ఉంది. అరెస్టు అయిన వ్యక్తులు, ఒక యంత్రపు సాధనాలు మాత్రమే. ఇప్పుడు కూడా రద్దు, సిబిఐకి సిఫార్సు, సహకరిస్తామన్న వాగ్దానాలు. ఆ చక్రం తిరుగుతూనే ఉంటుంది. దాని కింద ఉన్నదేమీ మారదు. పబ్లిక్ పరీక్షల (అక్రమ మార్గాల నివారణ) చట్టం, 2024ను పార్లమెంటు ఫిబ్రవరి 9న ఆమోదించింది, ఫిబ్రవరి 12, 2024న దీనికి రాష్ట్రపతి ఆమోదం లభించింది. సిద్ధాంతపరంగా చూస్తే, భారతదేశానికి సరిగ్గా అవసరమైన చట్టం ఇది. కాగితంపై, ఇది అత్యంత శక్తివంతమైన చట్టం. కానీ ఆచరణలో మాత్రం కాదు. ఎందుకంటే, దీనిని అమలు చేయడానికి అవసరమైన సంస్థాగత యంత్రాంగం లేదు.ఈ చట్టం అమల్లోకి వచ్చిన రెండేళ్ల తర్వాత, పేపర్ లీక్ కారణంగా నీట్ 2026 రద్దయ్యింది. చట్టం ఉంది, కానీ దాని అమలు మాత్రం లేదు. భారతదేశ అగ్రశ్రేణి, స్వతంత్ర పరీక్షా సంస్థగా ఉండేందుకు ఎన్‌టిఏను 2017లో స్థాపించారు. కానీ, స్వతంత్ర ఆడిట్ లేకుండా, సరైన పర్యవేక్షణ లేకుండా, పదవీకాల పరిమితి గల నాయకత్వం లేకుండా, అత్యంత కీలకమైన పరీక్షలన్నింటినీ ఒకే ఏజెన్సీలో కేంద్రీకరించడం అన్నది వ్యవస్థాగత వైఫల్యానికి ఒకే కేంద్రాన్ని సృష్టిస్తుంది. ఆ వ్యవస్థ విఫలమైనప్పుడు, అది ఒకేసారి లక్షలాది మందికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. ప్రపంచ స్థాయి పరీక్షా వ్యవస్థలు ఎన్‌క్రిప్టెడ్ ప్రశ్నపత్రాల, వికేంద్రీకృత పంపిణీని, అభ్యర్థుల బయోమెట్రిక్ ప్రామాణీకరణను, కేంద్ర పర్యవేక్షణతో కూడిన వాస్తవ సమయ సీసీటీవీ నిఘాను, ప్రశ్నపత్రాల లాజిస్టిక్స్ కోసం బ్లాక్‌చెయిన్ ఆధారిత చైన్ ఆఫ్ కస్టడీని ఉపయోగిస్తాయి. ఎన్‌టిఏ వీటిలోని కొన్ని భాగాలను అమలు చేసింది. కానీ సమగ్రత లేకుండా, అన్ని కేంద్రాలకు పూర్తి కవరేజీని అందించకుండా, ప్యానెల్‌లో ఉన్న పరీక్షా కేంద్రాలకు కనీస సాంకేతిక ప్రమాణాలను అమలు చేయకుండా ఈ చర్యలు చేపట్టింది. ఇది పదే పదే పునరావృతమవుతోందంటే, సమస్య వ్యవస్థాగతం కావడమే. వైద్య విద్యలో డిమాండ్– సరఫరా మధ్య అంతరం అత్యంత లోతైంది. 23లక్షలమంది అభ్యర్థులకు అందుబాటులో ఉన్నది సుమారు 1.1 లక్షల ఎంబిబిఎస్ సీట్లు మాత్రమే. ఇది, లీకైన ప్రశ్నపత్రాల కోసం లక్షలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్న కుటుంబాలకు, వాటిని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్న సిండికేట్‌లకు భారీ ఆర్థిక ప్రయోజనాలున్న పరీక్షను సృష్టిస్తుంది. ఈ నిష్పత్తి ఇలాగే కొనసాగినంత కాలం, చట్టాలతో సంబంధం లేకుండా ప్రశ్నపత్రాల లీకుల మార్కెట్ బలంగానే ఉంటుంది. మరో కారణం, పరీక్షల పరిశ్రమకు – అంటే కోచింగ్ సెంటర్లు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు, ప్రశ్నపత్రాల సరఫరా విక్రేతలకు – ఈ వ్యవస్థను కొనసాగించడంలో ప్రగాఢమైన ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయి. పరిష్కారాలు తెలిసినవే. అయితే, పాతుకుపోయిన ప్రయోజనాల నుండి ఎదురయ్యే ప్రతిఘటనను అధిగమించి, వాటిని అమలు చేసే రాజకీయ సంకల్పమే లోపించింది. దశాబ్ద కాలంలోగా భారతదేశం తన ఎంబిబిఎస్ సీట్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలి. పరీక్షల సంక్షోభానికి మూల కారణం సరఫరా కొరతే. ప్రభుత్వ వైద్య కళాశాలలో కొత్తగా సృష్టించే ప్రతి సీటు, అవినీతికి ఆజ్యం పోసే ఒక్కో ప్రైవేటు సీటుపై ఉండే అదనపు రుసుమును తగ్గిస్తుంది. ఆ సీట్లను అందుబాటులోకి తెచ్చే వ్యవస్థను విస్తరించడానికి, ఎంతటి పరీక్షా సంస్కరణలు కూడా పూర్తి ప్రత్యామ్నాయం కాలేవు.మంగళవారం ఎన్‌టిఏ విడుదల చేసిన ప్రకటన, జాతీయ పరీక్షా విధానంలో పారదర్శకతను పాటించడం, విశ్వాసాన్ని పరిరక్షించడం గురించి మాట్లాడింది. కానీ విశ్వాసం కేవలం ప్రకటనల ద్వారా పరిరక్షితం కాదు. కాలక్రమేణా, నిరూపితమైన, నిలకడైన పారదర్శకమైన చర్యల ద్వారానే దాన్ని ఆర్జించగలరు.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# విభజన రాజకీయాలు, ప్రజాస్వామ్య సవాళ్లు

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు భారత రాజకీయ ముఖచిత్రంలో అనేక మార్పులను సూచించినప్పటికీ, పశ్చిమ బెంగాల్ ఫలితాలు మాత్రం అత్యంత లోతైన చర్చకు దారితీశాయి. ఇవి కేవలం గెలుపోటముల గణాంకాలు మాత్రమే కాదు; కుటిల రాజకీయ వ్యూహాలు, సామాజిక చీలికలు, భావోద్వేగాల ప్రచారాలు, ప్రజల మనోభావాల కలయికతో జరిగిన ఒక సంక్లిష్ట ప్రక్రియ. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అనుసరించిన 'మతోన్మాద' రాజకీయం బెంగాల్ సంస్కృతిని తీవ్రంగా దెబ్బ తీసింది.

ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం వెనుక కేవలం సంస్థాగత విస్తరణ మాత్రమే లేదు, దాని వెనుక బలమైన మత విభజన రాజకీయాలు ఉన్నాయి. అభివృద్ధి కంటే మతపరమైన అంశాలకే ఆ పార్టీ పెద్దపీట వేసింది. ప్రచార పర్వంలో హిందూ, ముస్లింల మధ్య అగాధాన్ని పెంచేలా ప్రసంగాలు సాగాయి. చారిత్రక ప్రతీకలను, మతపరమైన సెంటిమెంట్లను వాడుకుని ఓటర్లను గుర్తింపు ప్రాతిపదికన విడదీయడంలో బీజేపీ తన శక్తినంతా ధార పోసింది.

ఈ క్రమంలో హుమయూన్ కబీర్ పాత్ర అత్యంత వివాదాస్పదంగా మారింది. వాస్తవానికి బీజేపీ వ్యూహాలకు అనుగుణంగా పావులు కదిపిన ఆయన తీరు చర్చనీయాంశమైంది. బాబ్రీ మసీదు తరహాలో మరో మసీదు నిర్మాణం, ఇటుకల సేకరణ, శంకుస్థాపన వంటి అంశాలను తెరపైకి తెచ్చి, వాటిని బీజేపీ తన ప్రచారానికి ప్రధాన అస్త్రంగా మార్చుకుంది. హుమయూన్ కబీర్ చేసిన కొన్ని వ్యాఖ్యలను లేదా చర్యలను భూతద్దంలో చూపిస్తూ, సాధారణ హిందూ ఓటర్లలో 'ముప్పు పొంచి ఉందనే' అభద్రతా భావాన్ని, భయాన్ని ఆ పార్టీ పకడ్బందీగా నూరిపోసింది. 'మతం ప్రమాదంలో ఉంది' అనే తప్పుడు కథనాన్ని సృష్టించి, హిందూ ఓట్లను గంపగుత్తగా తనవైపు తిప్పుకునేందుకు పోలరైజేషన్ రాజకీయాలను పరాకాష్టకు తీసుకెళ్లింది.




పశ్చిమ బెంగాల్‌లో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ తన పట్టును కోల్పోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. మమతా బెనర్జీ వ్యక్తిగత ఇమేజ్ బలంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పార్టీ పట్ల వ్యతిరేకత (యాంటీ ఇంకంబెన్సీ) స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా గ్రామ స్థాయి నాయకత్వంలో పేరుకుపోయిన అవినీతి, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుండి వసూలు చేసే 'కట్ మనీ' ఆరోపణలు సామాన్య ప్రజలను పార్టీకి దూరం చేశాయి.

మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ తన పట్టును కోల్పోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. మమతా బెనర్జీ వ్యక్తిగత ఇమేజ్ బలంగా ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో పార్టీ పట్ల వ్యతిరేకత (యాంటీ ఇంకంబెన్సీ) స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా గ్రామ స్థాయి నాయకత్వంలో పేరుకుపోయిన అవినీతి, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుండి వసూలు చేసే 'కట్ మనీ' ఆరోపణలు సామాన్య ప్రజలను పార్టీకి దూరం చేశాయి. దశాబ్ద కాలానికి పైగా సాగిన పాలనలో సహజంగానే వచ్చే వ్యవస్థాగత అలసటను, ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని మమత సరిగ్గా అంచనా వేయలేకపోయారు. దీనికి తోడు పరిపాలనలో రాజకీయ జోక్యం మితిమీరడం, ప్రత్యర్థి వర్గాలపై దాడులు వంటి అంశాలు ప్రజాస్వామ్యవాదుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. అధికార యంత్రాంగం నిష్పాక్షికంగా వ్యవహరించడం లేదనే విమర్శలు కూడా మమత వైఫల్యానికి కారణమయ్యాయి. ఈ గందరగోళంలో ఓటర్ల జాబితా వివాదం కూడా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించడం ఎన్నికల పారదర్శకతపై నీలి నీడలు కమ్మేలా చేశాయి. ఇది ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన ఓటర్లను లక్ష్యంగా చేసుకుని, వారిని ప్రభావితం చేసేందుకు పన్నిన కుట్రగా పరిణమించి ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించింది. ఎన్నికల సంఘం పర్యవేక్షణపై అనుమానాలు రేకెత్తించిన ఈ పరిణామాలు, పోటీ తీవ్రంగా ఉన్న సమయంలో ఓటర్లలో అనిశ్చితిని, ఆందోళనను పెంచాయి. వాస్తవానికి ఈ అక్రమాలు ఎన్నికల న్యాయసమ్మతతపై చర్చకు దారితీసి, ఓటర్ల మనోభావాలను ప్రభావితం చేశాయి. ఎన్నికల క్షేత్రంలో వాస్తవ సంఘటనల కంటే వాటి చుట్టూ నిర్మించబడే కథనాలే ఎక్కువ ప్రభావం చూపాయి. హుమయూన్ కబీర్ వంటి వ్యక్తుల ద్వారా సృష్టించబడిన మతపరమైన వేడి, ఓటర్ల జాబితాలో అక్రమాల గోల – ఇవన్నీ ఒక పద్ధతి ప్రకారం రూపొందించిన ప్రచార యుద్ధంలో భాగమే. హిందూ సమాజాన్ని భయపెట్టడం ద్వారా బీజేపీ తన బలాన్ని పెంచుకోగా, మమతా బెనర్జీ తన పాలనలోని లోపాలను సరిదిద్దుకోలేక వెనుకబడ్డారు. మతోన్మాద ప్రచారం ద్వారా ఓటర్లలో ఏర్పడిన భావోద్వేగం, ఇప్పటికే ఉన్న ప్రజల్లో ఉన్న అసంతృప్తితో కలిసిపోయి ఫలితాలను ప్రభావితం చేసింది.

మొత్తంగా చూస్తే, బెంగాల్ ఎన్నికలు భారత ప్రజాస్వామ్యానికి ఒక హెచ్చరిక లాంటివి. ఎన్నికలు అనేవి ప్రజల జీవన ప్రమాణాలు, అభివృద్ధి ఆధారంగా జరగాల్సినవి. కానీ, నేడు అవి గుర్తింపు, మతం, విభజన రాజకీయాల చుట్టూ తిరుగుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలను కూడా అనుమానాల్లోకి నెట్టి, ప్రజలను మతం పేరుతో విడదీసి ఓట్లు పొందే సంస్కృతి పెరిగిపోతోంది. బెంగాల్ తీర్పు కేవలం ఒక పార్టీ గెలుపును మాత్రమే కాదు, మతోన్మాద రాజకీయాలు ప్రజాస్వామ్య పునాదులను ఎలా దెబ్బతీస్తున్నాయో కూడా స్పష్టం చేస్తోంది. అధికార దాహం కోసం సమాజాన్ని చీల్చడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు.



యండి. ఉస్మాన్ ఖాన్
సీనియర్ జర్నలిస్టు

## గెలుపు సరే..

# విజయ్ ముందున్న ఆర్థిక పరీక్ష

తమిళనాడు రాజకీయాల్లో కొత్త శక్తిగా ఎదిగిన విజయ్ ప్రజలకు ఇచ్చిన హామీలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. మహిళలు, యువత, రైతులు—ప్రతి వర్గాన్నీ కవర్ చేసేలా రూపొందిన ఈ మానిఫెస్టో ప్రజల్లో ఆశలు పెంచింది. కానీ ఎన్నికల ఉత్సాహం తగ్గిన తర్వాత ఇప్పుడు ముందుకు వచ్చిన అసలు ప్రశ్న—ఈ హామీలను అమలు చేయడానికి అవసరమైన ఆర్థిక వనరులు ఎక్కడి నుంచి వస్తాయి?

ఈ ప్రశ్నకు సమాధానం వెతకడానికి ముందుగా తమిళనాడు ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. రాష్ట్ర వార్షిక బడ్జెట్ సుమారు ₹3.5 లక్షల కోట్ల వరకు ఉంటుంది. ఇదే సమయంలో మొత్తం అప్పులు ₹8 నుంచి ₹9 లక్షల కోట్ల మధ్యలో ఉన్నాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం వడ్డీ చెల్లింపులకే ₹50,000 నుంచి ₹60,000 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఫిస్కల్ డెఫిసిట్ కూడా ఇప్పటికే జిఎస్ డిపిలో 3 నుంచి 3.5 శాతం మధ్యలో ఉంది. అంటే ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిలోనే ఉంది. ఇలాంటి పరిస్థితిలో కొత్తగా ప్రకటించిన హామీల ఖర్చు గణాంకాలు చూస్తే విషయం మరింత స్పష్టమవుతుంది. మహిళలకు నెలకు ₹2,500 చొప్పున నగదు సహాయం ఇవ్వాలంటే, సుమారు 1.5 నుంచి 2 కోట్ల మంది లబ్ధిదారులను పరిగణనలోకి తీసుకుంటే, సంవత్సరానికి దాదాపు ₹50,000 కోట్లకు పైగా ఖర్చు అవుతుంది. రైతు రుణమాఫీ వంటి ఒకే సారి అమలు చేసే హామీకి ₹1.5 నుంచి ₹2 లక్షల కోట్ల వరకు భారమొస్తుంది. ఉచిత గ్యాస్, విద్యుత్ సబ్సిడీల కోసం సంవత్సరానికి మరో ₹25,000 నుంచి ₹30,000 కోట్లు అవసరం అవుతాయి. దీంతో పాటు నిరుద్యోగ భృతి, యువతకు స్టైపెండ్లు కలిపి సంవత్సరానికి ₹15,000 నుంచి ₹20,000 కోట్లు ఖర్చవుతాయి. ఆరోగ్య బీమా పథకాన్ని విస్తరించడానికి మరో ₹10,000 నుంచి ₹15,000 కోట్ల వరకు అవసరం ఉంటుంది. ఈ లెక్కలన్నింటిని కలిపి చూస్తే, కేవలం వెల్ఫేర్ పథకాలకే సంవత్సరానికి ₹1.2 నుంచి ₹1.5 లక్షల కోట్ల వరకు ఖర్చు అవుతుంది.



*ఈ ప్రశ్నకు సమాధానం వెతకడానికి ముందుగా తమిళనాడు ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. రాష్ట్ర వార్షిక బడ్జెట్ సుమారు ₹3.5 లక్షల కోట్ల వరకు ఉంటుంది. ఇదే సమయంలో మొత్తం అప్పులు ₹8 నుంచి ₹9 లక్షల కోట్ల మధ్యలో ఉన్నాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం వడ్డీ చెల్లింపులకే ₹50,000 నుంచి ₹60,000 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఫిస్కల్ డెఫిసిట్ కూడా ఇప్పటికే జిఎస్ డిపిలో 3 నుంచి 3.5 శాతం మధ్యలో ఉంది. అంటే ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిలోనే ఉంది.*

మౌలిక సదుపాయాలు, ఇతర హామీలు కలిపితే ఈ మొత్తం ₹2 లక్షల కోట్లకు మించి వెళ్లే అవకాశం ఉంది. ఈ గణాంకాల అర్థం చాలా స్పష్టంగా ఉంది. రాష్ట్ర బడ్జెట్‌లో సగానికి పైగా భాగం కొత్త హామీలకే కేటాయించాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికే ఉన్న ఖర్చులు—ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, తగ్గించలేము. కాబట్టి ప్రభుత్వం కొత్తగా భారీ అప్పులు తీసుకోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు. ప్రస్తుతం ఉన్న ₹8.5 లక్షల కోట్ల అప్పు, ప్రతి సంవత్సరం ₹1 నుంచి ₹2 లక్షల కోట్ల అదనపు అప్పుతో ఐదేళ్లలో ₹13 నుంచి ₹15 లక్షల కోట్లకు చేరే ప్రమాదం ఉంది. ఇది కేవలం ఖర్చు సమస్య కాదు, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన ప్రశ్న. ఆదాయం పెరగకపోతే ఈ వెల్ఫేర్ మోడల్ నిలబడదు. అప్పులు పెరిగితే వడ్డీ భారం పెరుగుతుంది, దాంతో అభివృద్ధి పనులకు నిధులు తగ్గిపోతాయి. రోడ్లు, నీటి ప్రాజెక్టులు, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో పెట్టుబడులు తగ్గే ప్రమాదం ఉంటుంది. దీనినే ఆర్థిక నిపుణులు “డెబ్ట్ ట్రాప్”గా పేర్కొంటారు. అయితే ఈ హామీలన్నీ అసాధ్యమని చెప్పడం సరైంది కాదు. కానీ అవి అమలు కావాలంటే దశలవారీ ప్రణాళిక అవసరం. అత్యవసర వర్గాలకే ముందుగా ప్రయోజనం అందించడం, సబ్సిడీలను పునర్వ్యవస్థీకరించడం, పరిశ్రమలను ఆకర్షించి ఆదాయం పెంచడం వంటి చర్యలు కీలకం అవుతాయి. అంటే రాజకీయ సంకల్పంతో పాటు ఆర్థిక క్రమశిక్షణ కూడా అవసరం. చివరగా చెప్పాలంటే, విజయ్ ఇచ్చిన హామీలు ప్రజల్లో ఆశను పెంచినా, అవి ఒక పెద్ద ఆర్థిక పరీక్షను కూడా ముందుకు తెచ్చాయి. పాలనలో నిజమైన విజయం అంటే ప్రజాదరణ కాదు—సంఖ్యలను సమర్థంగా నిర్వహించడం. ఈ కఠిన సమీకరణాన్ని విజయ్ ఎలా పరిష్కరిస్తాడో, అదే ఆయన నాయకత్వానికి అసలు ప్రమాణంగా నిలుస్తుంది.



శ్యాంమోహన్
9440595858

# జాగ్రత్తలతో అస్తమా రుగ్మత దూరం

దీర్ఘకాలిక అసాంక్రమిక లేదా అంటువ్యాధి కాని (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) వ్యాధుల్లో అస్తమా లేదా ఉబ్బసం అతి ప్రధానమైనది. ప్రపంచ్యాప్తంగా సాలీనా 260 మిలియన్ల ప్రజలు ఈ వ్యాధితో బాధపడడం, అందులో 4.5 లక్షల వరకు మరణాలు కూడా సంభవిస్తున్నాయని అంచనా. పిల్లలు, యువతలో కూడా 15 శాతం వరకు నమోదు అవుతున్న అస్తమా వ్యాధి తగు జాగ్రత్తలతో ప్రాణాలను కాపాడుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అస్తమా దాడి లేదా అస్తమా అటాక్ జరగడం వల్ల రోగుల్లో నిరాశ, కుటుంబ సభ్యుల్లో ఆందోళనలు పెరగడం, ఆసుపత్రి పాలు కావడం, చివరకు ప్రాణాలు కూడా పోవడం జరగవచ్చు. అల్ప-మధ్య ఆదాయ దేశాల్లో వైద్య సదుపాయాలు కొరవడడం, కార్టికోస్టిరాయిడ్ ఇన్‌హేలర్ ఔషధాల ధరలు అధికంగా ఉండడంతో అస్తమా కారణ మరణాలు 96 శాతం వరకు నమోదు కావడం విచారకరం. భారత్‌లో అత్యధిక ఉబ్బస రోగులు ఉన్నట్లు, మరణాలు కూడా 3.4 కోట్ల వరకు నమోదు అవుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

1998లో “గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ అస్తమా” చొరవతో మే మాసపు తొలి మంగళవారం (అనగా 05 మే 2026) రోజున ప్రారంభమైన “ప్రపంచ అస్తమా దినం” ద్వారా ఉబ్బస వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రచారం చేయడం, అస్తమా రోగులకు ఆత్మవిశ్వాసం పెంచడం, కుటుంబాలకు ధైర్యాన్ని అందించడం, ఆధునిక పరిశోధనలతో ఉత్తమ చికిత్స విధానాలను రూపొందించడం లాంటి అంశాల ఎజెండాగా ప్రపంచ ఉబ్బస దినం వేదికలను వాడుకుంటున్నారు. 2026 ప్రపంచ అస్తమా దినం ఇతివృత్తంగా “అస్తమా రోగులు అందరికీ ఆంటీ-ఇన్‌ఫ్లమేటరీ ఇన్‌హేలర్స్ లభ్యత – నేటికీ తక్షణావసరం” అనబడే అంశాన్ని తీసుకొని విస్తృత అవగాహన కలిపించడం కొనసాగుతున్నది. సరైన ఔషధాలను వాడుతూ ఉబ్బసాన్ని, ఉబ్బస దాడిని అదుపు చేసుకోవచ్చనే ధైర్యాన్ని కల్పించడం ప్రధాన ఉద్దేశంగా తోస్తున్నది. అస్తమాను తగు జాగ్రత్తలతో నిరోధించవచ్చు. కలుషిత గాలి, శీతల గాలులు, పూల సుగంధ పరిమళాలు, దుమ్ము ధూళి, సిగరెట్టు పొగలు, బాణాసంచా కాల్చడం, అగరు వత్తులు పొగలు, ఫేస్ పౌడర్ పీల్చడం, ఎలర్జీకి కారణమయ్యే వాటికి దూరంగా ఉండడం వల్ల ఉబ్బసం వ్యాధి నివారించబడుతుంది లేదా వ్యాధిగ్రస్థుల్లో ఉపశమనం కల్పించబడుతుంది. వీటితో పాటు రోగులకు దూరంగా ఉండడం, శీతల వాతావరణాలకు దూరంగా ఉండడం, ఇల్లు/ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, అందుబాటులో ఉన్న అన్ని వ్యాధుల కట్టడికి టీకాలను తీసుకోవడం, వైద్యుల సూచనలతో తగు ఔషధాలను విధిగా వాడడం తప్పనిసరిగాచేయడానికి ప్రయత్నించాలి. అస్తమా మరణాలను తగ్గించడం, అస్తమా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రచారం చేయడం తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వాలు, పౌర సమాజం భావించాలి. పేదరికం, అవగాహనలేమి, అపరిశుభ్ర వాతావరణం, పోషకాహారం కొరవడడం, ఔషధాలు తీసుకోకపోవడం, వైద్య సదుపాయాల కొరత లాంటివి అస్తమాను ప్రాణాంతక వ్యాధిగా మార్చుతున్నాయి. మన ఊరు వాడల్లో అస్తమా రోగులు ఉన్నట్లయితే తగు జాగ్రత్త సూచించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యాన్ని వివరించడం మనందరి కనీస బాధ్యత.



మధుసూదన్ రెడ్డి
9949700037

## మనసుల పలకరింపు.. అహాల విముక్తి

# వైవాహిక బంధం ఒక ప్రయాణం

**పెళ్లి అనేది కేవలం ఇద్దరి వ్యక్తుల కలయికే కాదు, రెండు భిన్నమైన ప్రపంచాల మేళవింపు. ఇక్కడ 'న్యూరోప్లాస్టిసిటీ' కీలక పాత్ర పోషిస్తుంది. ఇద్దరు వ్యక్తులు కలిసి జీవిస్తున్నప్పుడు, వారి ఆలోచనా తీరు ఒకరినొకరు ప్రభావితం చేస్తూ మారుతుంటాయి. అయితే ఇక్కడ పెళ్లి బంధంలో 'నేను' అనే వ్యక్తిగత అహం క్రమంగా కరిగిపోయి 'మనం' అనే సామూహిక చైతన్యం రావాలి. అప్పుడే ఆ బంధం భారంగా కాకుండా బాధ్యతగా మారుతుంది. మనస్సు, ప్రేమ, పెళ్లిని ఒక మహా వృక్షంతో పోల్చి చూడవచ్చు. మనస్సును నేల అనుకున్నట్లైతే, నేల సారవంతంగా, స్వచ్ఛంగా ఉంటేనే మొక్క ఆరోగ్యంగా ఎదుగుతుంది. మన ఆలోచనలు సానుకూలంగా ఉంటేనే బంధం సుస్థిరమవుతుంది. ప్రేమ విత్తనం అనుకునట్లైతే ఇది అనుబంధానికి జీవం పోసే శక్తి.**

మానవ ఉనికి అన్వేషణలో 'నేను' నుండి 'మనం' వైపు సాగే ప్రయాణమే జీవితం. ఈ ప్రయాణంలో అత్యంత సంక్లిష్టమైన, అర్థవంతమైన మైలురాళ్లు.. మనస్సు – ప్రేమ – పెళ్లి. ఇవి కేవలం సామాజిక అవసరాలు కావు. మనిషి జీవశాస్త్ర పరిణామం, మానసిక వికాసం, ఆధ్యాత్మిక పరిణతికి పునాదులు. మనస్సు ఆలోచిస్తుంది, ప్రేమ స్పందిస్తుంది, పెళ్లి బాధ్యతను గుర్తుచేస్తుంది. నేటి ఆధునిక ప్రపంచంలో విచ్ఛిన్నమవుతున్న బంధాలను కాపాడుకోవాలంటే, ఈ మూడింటి మధ్య ఉన్న సమతుల్యతను తాత్విక లోతుతో, శాస్త్రీయ విశ్లేషణతో అర్థం చేసుకోవడం అనివార్యం, అవసరం కూడా.

ఏ బంధానికైనా పునాది ఒక వ్యక్తి గురించి మనస్సులో ఏర్పడే 'బింబం'. మనస్సు ఒక అద్భుతమైన సృజనాత్మక యంత్రం. మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం, మనం ఎవరిని ప్రేమిస్తామనేది మన చిన్ననాటి అనుభవాలు, ఉపచేతన మనస్సులో దాగి ఉన్న సంస్కారాలపై ఆధారపడి ఉంటుంది. దీనినే 'అటాచ్‌మెంట్ థియరీ' అంటారు. మనస్సు ఎప్పుడూ తనను తాను భర్తీ చేసుకునే వ్యక్తి కోసం నిరంతరం అన్వేషిస్తుంది. ఎవరైనా ఒక వ్యక్తి మనల్ని, మన భావాలను నిశ్శబ్దంగా అర్థం చేసుకుంటున్నారని మనస్సు భావిస్తే, మెదడులో తక్షణమే ఒక రకమైన భద్రతా భావం ఏర్పడుతుంది. ఈ భావమే అనుబంధానికి తొలి అడుగు. ప్రేమను కవులు అక్షరబద్ధం చేస్తే, శాస్త్రవేత్తలు దానిని రసాయనాల సమ్మేళనంగా విశ్లేషిస్తారు. ప్రేమలో పడినప్పుడు మెదడులో డోపమైన్, ఆక్సిటోసిన్ వంటి హార్మోన్లు వెల్లువలా కురుస్తాయి. అందుకే ప్రారంభంలో ప్రేమ ఒక 'మత్తు'లా, ఒకరకంగా సూటిగా చెప్పాలంటే ఉన్మాదంలా అనిపిస్తుంది. అయితే, కేవలం రసాయనాలకు లోబడితే అది ఆకర్షణే అవుతుంది. కానీ నిజమైన ప్రేమ అంటే శారీరక ఆకర్షణను మించిన ఒక 'త్యాగం'. అవతలి వ్యక్తి ఎదుగుదలలో, వారి ఆనందంలో మన అస్తిత్వాన్ని వెతుక్కోవడమే అసలైన ప్రేమ. స్వార్థం అంతమైన చోట మాత్రమే నిస్వార్థమైన ప్రేమ ఉదయిస్తుంది. ఇక ప్రేమ ఒక అనియంత్రిత ప్రవాహం అయితే, పెళ్లి ఆ ప్రవాహాన్ని ఒక క్రమపద్ధతిలో నడిపించే 'ఆనకట్ట'. పెళ్లి అనేది కేవలం ఇద్దరి వ్యక్తుల కలయికే కాదు, రెండు భిన్నమైన ప్రపంచాల మేళవింపు. ఇక్కడ 'న్యూరోప్లాస్టిసిటీ' కీలక పాత్ర పోషిస్తుంది. ఇద్దరు వ్యక్తులు కలిసి జీవిస్తున్నప్పుడు, వారి ఆలోచనా తీరు ఒకరినొకరు ప్రభావితం చేస్తూ మారుతుంటాయి. అయితే ఇక్కడ పెళ్లి బంధంలో 'నేను' అనే వ్యక్తిగత అహం క్రమంగా కరిగిపోయి 'మనం' అనే సామూహిక చైతన్యం రావాలి. అప్పుడే ఆ బంధం భారంగా కాకుండా బాధ్యతగా మారుతుంది. మనస్సు, ప్రేమ, పెళ్లిని ఒక మహా వృక్షంతో పోల్చి చూడవచ్చు. మనస్సును నేల అనుకున్నట్లైతే, నేల సారవంతంగా, స్వచ్ఛంగా ఉంటేనే మొక్క ఆరోగ్యంగా ఎదుగుతుంది. మన ఆలోచనలు సానుకూలంగా ఉంటేనే బంధం సుస్థిరమవుతుంది. ప్రేమ విత్తనం అనుకునట్లైతే ఇది అనుబంధానికి జీవం పోసే శక్తి. ఇది మొలకెత్తడానికి ఆకర్షణ అనే నీరు, అవగాహన అనే సూర్యరశ్మి నిరంతరం అవసరం. పెళ్లి కంచెతో పోల్చవచ్చు ఎదుగుతున్న మొక్కను బయటి ఒత్తిళ్లు, ఆకర్షణల నుండి కాపాడే ఒక రక్షణ కవచం. ఈ కంచె రక్షణలోనే మొక్క మహావృక్షమై, ఫలాలను అందిస్తుంది. ఇందులోని లోతైన అవగాహనను అర్థం చేసుకున్నప్పుడే సత్యం బోధపడుతుంది. బంధం కూడా బలపడుతుంది.



అయితే నేటి కాలంలో వైవాహిక బంధాలు బీటలు వారుతున్నాయి అంటే దానికి ప్రధాన కారణం 'మనస్సు' మీద నియంత్రణ కోల్పోవడమే. క్షణికమైన ఆకర్షణను శాశ్వతమైన ప్రేమగా భ్రమపడటం, ఉపచేతన మనస్సులో ఉన్న అసహనాన్ని భాగస్వామిపై రుద్దడం వల్ల అనర్థాలు జరుగుతున్నాయి. అందుకే ప్రేమలో ఉన్నప్పుడు ఇచ్చే ఉత్సాహం అవసరమే కానీ, పెళ్లిలో ఉండే స్థిరత్వం, నమ్మకం అంతకంటే ముఖ్యం అనేది గుర్తించాలి. తాత్విక పరిణతి అంటే అవతలి వ్యక్తిలోని లోపాలను కూడా ప్రేమించగలగడం, వారి వ్యక్తిత్వాన్ని గౌరవించడం. మనస్సును సంస్కరించుకోవడం, ప్రేమను దైవత్వంగా భావించడం, పెళ్లిని ఒక ఉన్నతమైన బాధ్యతగా స్వీకరించడం.. ఈ మూడింటి కలయికే సంపూర్ణ మానవ జీవితం. శాస్త్రీయంగా మన మెదడు పనితీరును గమనిస్తూ, తాత్వికంగా మన అహాన్ని తగ్గించుకున్నప్పుడు మాత్రమే ప్రేమ బంధం కాలపరీక్షకు నిలబడుతుంది. అప్పుడే పెళ్లి అనేది ఒక బంధనంలా కాకుండా, ఆత్మల పలకరింపుగా, మోక్ష మార్గంగా మారుతుంది.



కస్తూరిదారా

# జాతీయం-అంతర్జాతీయం

## మే 22 లోపే నీట్ పునఃపరీక్ష




**ఉదయం డెస్క్, మే 12:**

ప్రశ్నపత్రం లీక్ ఆరోపణల కారణంగా నీట్‌యూజీ 2026ను రద్దు చేయాలన్న జాతీయ పరీక్షల ఏజెన్సీ నిర్ణయం లక్షలాది వైద్య విద్యార్థులలో కొత్త అనిశ్చితిని రేకెత్తించింది. అయినప్పటికీ, రాబోయే ఏడు నుంచి పది రోజుల్లోగా పునఃపరీక్ష షెడ్యూల్‌ను ప్రకటిస్తామని ఏజెన్సీ విద్యార్థులకు హామీ ఇచ్చింది. ఈ కాలపరిమితిని బట్టి చూస్తే, సవరించిన పరీక్ష మే 22 లోపు జరిగే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. పరీక్షకు ముందే ప్రశ్నపత్రంలోని కొన్ని భాగాలు బయటకు వచ్చాయని ఆధారాలు లభించడంతో, ఏజెన్సీ జీరో టాలరెన్స్ పాలసీని అవలంబించిందని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ తెలిపారు.

ముమ్మరమైన లీక్ దర్యాప్తు

ఈ విషయాన్ని ఇప్పుడు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు అప్పగించామని, ఇందులో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అభిషేక్ సింగ్ హామీ ఇచ్చారు.ఎన్‌టీఏ చీఫ్ ప్రకారం, పరీక్షకు ముందు నీట్‌యూజీ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలే ప్రశ్నలు ఉన్న ఒక వాట్సాప్ సందేశం ప్రచారంలోకి వచ్చిందని మే 7వ తేదీ రాత్రి ఒక విజిల్‌బ్లోయర్ ద్వారా తమ ఏజెన్సీకి సమాచారం అందిందన్నారు. అంతర్గత తనిఖీలో, అధికారిక పేపర్‌లోని పలు ప్రశ్నలు అందులో వాటితో సరిపోలినట్లు, మే 3వ తేదీ పరీక్షకు ముందు మే 1, 2 తేదీలలో ఆ మెటీరియల్ ఉన్న పీడీఎఫ్ ఫైల్స్ కొన్ని మొబైల్ ఫోన్‌లలో ఉన్నట్లు తేలినట్లు సమాచారం. ఈ పరిశోధనల ఫలితాలు ఏజెన్సీ జీరో టాలరెన్స్ విధానాన్ని ఉల్లంఘించాయని, అలాగే పరీక్షకు నిజాయితీగా సిద్ధమైన విద్యార్థులకు న్యాయం జరుగుతుందా అనే ఆందోళనలను రేకెత్తిస్తున్నాయని సింగ్ అన్నారు.విద్యార్థుల భవిష్యత్తు ప్రతికూలంగా ప్రభావితం కాకుండా ఉండేందుకు, నిందితులందరినీ పట్టుకుని జైలుకు పంపుతాం, అని ఆయన అన్నారు.

మే 22 లోపు పునఃపరీక్ష జరిగే అవకాశం నీట్ యుజి 2026 పరీక్షను తిరిగి నిర్వహిస్తామని ఎన్‌టిఎ ధృవీకరించింది. ఈ కొత్త పరీక్షా ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉంటుందని స్పష్టం చేసింది. ఈ పునఃపరీక్ష కోసం అభ్యర్థులు ఎటువంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని కూడా ఆ సంస్థ ప్రకటించింది. రద్దయిన పరీక్ష కోసం అభ్యర్థులు ఇప్పటికే చెల్లించిన రుసుమును తిరిగి చెల్లిస్తారు.

రద్దు తర్వాత నెలకొన్న విస్తృత ఆందోళనల నడుమ, ఈ ప్రకటన విద్యార్థులకు, తల్లిదండ్రులకు కొంత ఉపశమనాన్ని కలిగించింది. అయినప్పటికీ, సవరించిన షెడ్యూల్, ప్రవేశాల కాలపరిమితులు, విస్తృత వైద్య కౌన్సెలింగ్ ప్రక్రియపై దాని ప్రభావం గురించి అనిశ్చితి కొనసాగుతోంది.కొత్త షెడ్యూల్‌ను ఏడు నుండి పది రోజుల్లోగా ప్రకటిస్తామని ఎన్‌టిఎ సూచించడంతో, ఈ పునఃపరీక్ష మే 22లోపే జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అభ్యర్థులకు రాబోయే రోజులు అత్యంత కీలకంగా మారాయి.

## బాంబు పేలుడులో 9మంది మృతి, 23మందికి గాయాలు

**ఉదయం డెస్క్, మే 12:**



పాకిస్తాన్‌లోని అస్థిరమైన ఖైబర్ పఖ్తూన్ఖ్వా ప్రావిన్స్‌లో మంగళవారం మరో ఘోరమైన బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కనీసం తొమ్మిది మంది మరణించగా, మరో 23 మంది గాయపడ్డారు. లక్కీ మార్వత్ జిల్లాలో రద్దీగా ఉండే మార్కెట్‌లో, వ్యాపారాలు ఉధృతంగా సాగే వేళల్లో ఈ పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటన ఆ ప్రాంతంలో క్షీణిస్తున్న భద్రతపై కొత్త ఆందోళనలను రేకెత్తించింది. గాయపడిన వారిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భయపడుతున్నారు. దేశ వాయువ్య ప్రాంతంలో ఉగ్రవాదం మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో, ఈ తాజా దాడి పాకిస్తాన్ సైన్యాధిపతి అసిమ్ మునీర్, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌లపై ఒత్తిడిని మరోసారి తీవ్రతరం చేసింది.

మార్కెట్‌లో ఘోరమైన పేలుడు

పాకిస్తానీ మీడియా నివేదికల ప్రకారం, లక్కీ మార్వత్‌లోని ఒక రద్దీ మార్కెట్‌లో పేలుడు పదార్థాలతో నిండిన ఒక లోడర్ రిక్షా పేలిపోవడంతో ఈ ఘటన సంభవించింది. ఈ ఘటనలో మరణించిన తొమ్మిది మందిలో ఇద్దరు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఉండగా, కనీసం మరో 23 మంది గాయపడ్డారు.

పేలుడు జరిగిన వెంటనే సహాయక 1122 అత్యవసర సేవల బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని, మృతులను చికిత్స, గుర్తింపు కోసం నౌరంగ్ ఆసుపత్రికి తరలించారు. పలువురు బాధితుల పరిస్థితి విషమంగా ఉన్నందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

అనంతరం భద్రతా దళాలు, బాంబు డిస్పోజల్ బృందాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి, ఫోరెన్సిక్ ఆధారాలు సేకరించేందుకు దర్యాప్తు ప్రారంభించాయి. స్థానిక నివాసితులు కూడా సహాయక చర్యలలో పాలుపంచుకుని, గాయపడిన వారికి రక్తదానం చేసేందుకు ఆసుపత్రుల వద్దకు చేరుకున్నారు.ఆఫ్ఘన్ మిలిటెంట్లే కారణమని పాక్ ఆరోపణలుబన్నూ జిల్లాలో ఫతే ఖేల్ పోలీస్ చెక్‌పాయింట్‌ను లక్ష్యంగా చేసుకుని జరిగిన కారు బాంబు దాడిలో కనీసం 15 మంది పోలీసు సిబ్బంది మరణించగా, ఒక పౌరుడితో సహా మరో నలుగురు గాయపడిన కొద్ది రోజులకే ఈ పేలుడు సంభవించింది.బన్నూ దాడి అనంతరం, పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయం సోమవారం ఆఫ్ఘన్ ఛార్జ్ డి అఫైర్స్‌ను పిలిపించి, కాబూల్‌లోని తాలిబన్ నేతృత్వంలోని ప్రభుత్వానికి తీవ్ర నిరసన తెలిపింది.ఆఫ్ఘన్ భూభాగం నుంచి పని చేస్తున్న మిలిటెంట్లు ఈ దాడిని ప్లాన్ చేశారని ప్రాథమిక ఆధారాలు, సాంకేతిక నిఘా సూచిస్తున్నాయని పాకిస్థాన్ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది.తీవ్రవాద గ్రూపులు ఆఫ్ఘన్ భూభాగాన్ని ఉపయోగించుకుంటున్నాయనే ఆరోపణలపై ఇస్లామాబాద్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడులకు బాధ్యులైన వారిపై "నిర్ణయాత్మక ప్రతిచర్యలు" తీసుకునే హక్కు పాకిస్థాన్‌కు ఉందని హెచ్చరించింది.

## ఈ నెల 14, 15న బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం

**న్యూఢిల్లీ, మే 12 (ఉదయం):**



మే 14, 15 తేదీలలో జరగనున్న బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడానికి సన్నద్ధమవుతున్న భారతదేశం, ప్రపంచ దౌత్య వేదికపై తన ఆధిపత్యాన్ని చాటడానికి సిద్ధంగా ఉంది. ఈ కూటమికి ఒక కీలక ఘట్టంగాఈ సమావేశం నిలవనుంది. ప్రతిష్ఠాత్మక అధ్యక్ష బాధ్యతలను నిర్వర్తిస్తున్న సమయంలో న్యూఢిల్లీ , విస్తృతమైన ఈ బహుపాక్షిక కూటమి భవిష్యత్తును నడిపించడంలో పోషిస్తున్న పాత్రను మరింత సుస్థిరం చేయనుంది.

ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ప్రసంగిస్తూ, ఈ చర్చల ఉన్నత స్థాయి స్వభావాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ధృవీకరించారు. ఈ సమావేశానికి విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్న ఆయన, ఇందులో అంతర్జాతీయ ప్రతినిధుల భారీగా పాల్గొంటుందని తెలిపారు. ఈ భేటీ ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, ఈ సమావేశంలో బ్రిక్స్ విదేశాంగ మంత్రులు, అలాగే సభ్య, భాగస్వామ్య దేశాల ప్రతినిధి బృందాల అధిపతులు పాల్గొంటారు. వారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కూడా కలుస్తారని జైస్వాల్ అన్నారు. జయశంకర్ ఈ ఏడాది ప్రారంభంలో 2026 లోగోను, వెబ్‌సైట్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ అధ్యక్ష పదవికి ఒక నిర్దిష్టమైన, దూరదృష్టితో కూడిన ఇతివృత్తం మార్గనిర్దేశం చేస్తుంది, స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం.రియో డి జెనీరోలో జరిగిన 2025 సదస్సులో ప్రధానమంత్రి మోడీ సమర్థించిన భారతదేశపు మానవత్వమే ప్రథమం, ప్రజలే కేంద్రం అనే విధానాన్ని ఈ ఇతివృత్తం బలంగా ప్రతిబింబిస్తుంది.ఈ సదస్సుకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వడం ఇది నాలుగోసారి, ఇప్పటికే దౌత్య యంత్రాంగం పూర్తి వేగంతో పనిచేస్తోంది. ఈ ఏడాది చివర్లో జరగనున్న నాయకుల సదస్సు ఎజెండాను రూపొందించడంలో ఈ సమావేశం ప్రధాన చోదక శక్తిగా వ్యవహరిస్తుంది.ఈ శిఖరాగ్ర సమావేశం ఒక కీలకమైన వేదికను అందిస్తుంది. ఇక్కడ" బ్రిక్స్ సభ్య దేశాల విదేశాంగ మంత్రులు పరస్పర ఆసక్తి ఉన్న ప్రపంచ, ప్రాంతీయ సమస్యలపై తమ అభిప్రాయాలను పంచుకుంటారు. ఈ రెండు రోజుల కార్యక్రమం, కూటమి వారసత్వం, భవిష్యత్ గమనాన్ని రెండింటినీ చర్చించే విధంగా పకడ్బందీగా రూపొందించారు. రెండవ రోజున, బ్రిక్స్ 20 ఏళ్లు: స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం అనే ఇతివృత్తంతో జరిగే ఒక సమావేశంలో బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాలు పాల్గొంటాయి.అంతర్జాతీయ అధికార వ్యవస్థ మౌలిక స్వరూపం వైపు కూడా ఈ అజెండా మళ్లే అవకాశం ఉంది. దీని తర్వాత, ప్రపంచ పాలన, బహుపాక్షిక వ్యవస్థలో సంస్కరణలపై ఒక సమావేశం జరుగుతుంది అని జైస్వాల్ పేర్కొన్నారు. ఈ వ్యూహాత్మక దృష్టి, గతంలో జరిగిన దౌత్యపరమైన ప్రయత్నాలకు ఒక గణనీయమైన కొనసాగింపుగా నిలుస్తుంది. ఎందుకంటే, బ్రిక్స్ విదేశాంగ మంత్రులు తమ చివరి సమావేశాన్ని 2025 సెప్టెంబర్ 26న, ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 80వ సమావేశం సందర్భంగా నిర్వహించారు.భారతదేశ నాయకత్వంలో ఉన్న నిరంతరత్వాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, 2026 బ్రిక్స్ కూటమికి కాబోయే అధ్యక్ష దేశంగా భారతదేశం ఈ సమావేశానికి అధ్యక్షత వహించిందని జైస్వాల్ గుర్తుచేశారు. దేశ రాజధాని ఈ కూటమికి సంబంధించిన దౌత్యపరమైన కేంద్ర బిందువుగా రూపుదిద్దుకుంటున్న తరుణంలో, ఈ శిఖరాగ్ర సమావేశం కోసం ఉన్నత స్థాయి ప్రముఖుల రాక ఇప్పటికే ప్రారంభమైందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది.ఈ శిఖరాగ్ర సమావేశం గణనీయమైన భౌగోళిక రాజకీయ మార్పుల నేపథ్యంలో జరుగుతోంది, ఇది ముఖ్యంగా న్యూఢిల్లీ, టెహ్రాన్ మధ్య బలపడుతున్న సంబంధాలను నొక్కి చెబుతోంది. మాస్కో ఇప్పటికే తన ఉనికిని ధృవీకరిస్తూ, విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ సమావేశం కోసం మే 1415 తేదీలలో భారతదేశానికి వస్తారని ప్రకటించింది.విస్తరించిన ఈ కూటమిలో ఇప్పుడు బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండియా, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉన్నాయి. ఇవన్నీ స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం అన్న భారత నినాదం మార్గదర్శకత్వంలో పనిచేస్తున్నాయి.18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా, గ్లోబల్ సౌత్, పాశ్చాత్య దేశాల మధ్య వారధిగా వ్యవహరించే ఒక విశిష్ట స్థానంలో భారతదేశం నిలిచింది. ఈ కూటమి విస్తరణ ఇప్పుడు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, రాజకీయంగా మరింత వైవిధ్యభరితమైన, విస్తృత దేశాల సమూహం మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడమే భారతదేశం ముందున్న ప్రధాన సవాలు కానుంది.

## పళనిస్వామికి మద్దతు ఇస్తున్న ఎఐఎడిఎంకె వర్గం

- **బలపరీక్షలో టివికెకి వ్యతిరేకంగా ఓటు వేయాలనే ఆదేశంతో విప్ జారీ**



**చెన్నై, మే 12 (ఉదయం):**

బుధవారం జరగనున్న విశ్వాస పరీక్ష సందర్భంగా టివికెప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని పార్టీ ఎమ్మెల్యేలందరికీ అధికారిక విప్ జారీ చేసినట్లు ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి నేతృత్వంలోని వర్గం ద్వారా పార్టీ విప్‌గా నియమితులైన మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కృష్ణమూర్తి, మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసే ఏ ఎమ్మెల్యే అయినా తక్షణమే చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కృష్ణమూర్తి స్పష్టం చేశారు.పళనిస్వామి వర్గం తరపున విలేకరులతో మాట్లాడుతూ, పళనిస్వామిని శాసనసభాపక్ష నాయకుడిగా సమర్థిస్తూ 47 మంది ఎమ్మెల్యేలు సంతకం చేసిన లేఖలను స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్‌కు సమర్పించినట్లు మాజీ మంత్రి ఓ.ఎస్. మణియన్ తెలిపారు.పళనిస్వామి డిఎంకెతో పొత్తు పెట్టుకోవడానికి ప్రయత్నించారని, వారికి మరింత మద్దతు కూడగట్టే ఉద్దేశంతో కొన్ని వ్యాఖ్యలు చేశారని సివి షణ్ముగం ఆరోపించినట్లు మణియన్ తెలిపారు.

పళనిస్వామే శాసనసభాపక్ష నాయకుడని పేర్కొంటూ మొత్తం 47 మంది ఎమ్మెల్యేలు ఒక లేఖపై సంతకం చేశారు. శివసేనకు సంబంధించి గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులోని ఒక సారూప్య అంశాన్ని మేం స్పీకర్ దృష్టికి తీసుకువచ్చాం," అని ఆయన పేర్కొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జె. జయలలిత మరణానంతరం, ఇపిఎస్ అనేక న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంటూనే, నాలుగున్నర సంవత్సరాల పాటు సుపరిపాలన అందించారు. ఎన్నికలకు ముందు ఆయన రాష్ట్రవ్యాప్త పర్యటన చేపట్టి, ఎఐఎడిఎంకె నేతృత్వంలోని కూటమి తరపున విస్తృతంగా ప్రచారం చేశారు. ఫలితంగా ఎఐఎడిఎంకెకు 47 మంది ఎమ్మెల్యేల స్థానాలను, 1.34 కోట్ల ఓట్లను సాధించిపెట్టారు, అని మణియన్ వివరించారు.ఇలా ఉండగా, టివికె ప్రభుత్వానికి తమ మద్దతును ప్రకటించిన సివి షణ్ముగం, ఎస్పీ వేలుమణి నేతృత్వంలోని వర్గం, మాజీ ముఖ్యమంత్రి జె. జయలలిత స్మారక మందిరాన్ని సందర్శించి నివాళులర్పించింది.

## బలపరీక్షకు ముందు ఎఐఎడిఎంకె రెబెల్స్‌ను కలిసిన విజయ్

**చెన్నై, మే 12 (ఉదయం):**



ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఎంత ఉత్కంఠ నెలకొందో, ఇప్పుడు తమిళనాడు శాసనసభలో విజయ్ బలపరీక్షకు సిద్ధమవుతున్న తరుణంలో అంతే ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు సినిమా స్థాయి సస్పెన్స్‌తో కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఎఐఎడిఎంకెలో చీలిక ఏర్పడిన విషయం తెలిసిందే. విశేషమేమిటంటే, ఈ పార్టీకి చెందిన రెబెల్ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి విజయ్ భేటీ కావడం సంచలనం సృష్టిస్తోంది.

అసెంబ్లీలో బుధవారం బలపరీక్ష జరగనున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకె పార్టీ 47 స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఫలితాలు వెలువడిన తర్వాత ఈ పార్టీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తీరును సీనియర్ నేతలు సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి, సి.విజయభాస్కర్ తదితరులు బహిరంగంగానే విమర్శించారు. ఈ క్రమంలోనే గత శనివారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు మద్దతు తెలపటం, శాసనసభా కమిటీ నాయకత్వ బాధ్యతలపై వాడివేడి చర్చ జరిగింది. ఇందులో ఈపీఎస్ నిర్ణయాలతో విభేదించిన సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి సమావేశాన్ని బహిష్కరించారు. ఈ నేపథ్యంలోనే పార్టీలో చీలిక ఏర్పడింది. తాము అన్నాడీఎంకే నుంచి బయటకు వచ్చి విజయ్‌కు మద్దతిస్తామని షణ్ముగం నేతృత్వంలోని రెబల్ ఎమ్మెల్యేలు ఈ ఉదయం ప్రకటించారు. దీంతో షణ్ముగం వర్గం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను తాజాగా విజయ్ కలిశారు.

## విజయ్ వ్యక్తిగత జ్యోతిష్యుడికి ఒసిడి పదవి



**చెన్నై, మే 12 (ఉదయం):**

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మంగళవారం తన వ్యక్తిగత జ్యోతిష్యుడు రికీ రాధన్ పండిట్ వెట్రివెల్‌ను ఒఎస్‌డి (రాజకీయ)గా నియమించడం తీవ్ర విమర్శలకు దారితీసింది.ఈ చర్య, తన నిర్ణయాలలో జ్యోతిష్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చిన మాజీ ముఖ్యమంత్రి జె. జయలలితతో విజయ్‌ను పోల్చడానికి సోషల్ మీడియాలో ప్రజలను ప్రేరేపించింది. గతంలో వెట్రివేల్ జయలలితతో అనుబంధం కలిగి ఉండేవారని, అక్రమాస్తుల కేసులో మాజీ ముఖ్యమంత్రి జైలు శిక్షకు సంబంధించి ఒక జోస్యం తప్పిన కారణంగా, 2014లో జయలలిత అతడిని దూరంగా ఉంచారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక పేర్కొంది.వెట్రివేల్‌ను ఒఎస్‌డిగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును పంచుకుంటూ, నాకు అర్థం కావడం లేదు. ఒక జ్యోతిష్యుడికి ఓఎస్‌డికి పదవి ఎందుకు అవసరం?? ఎవరైనా వివరించగలరా? అని ఎక్స్‌పై చేసిన ఒక పోస్ట్‌లో, కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్, అన్నారు.

ఆదివారం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే, విజయ్ కీలకమైన అధికార యంత్రాంగ పదవుల్లో భారీ మార్పులు చేశారు. ఇందులో భాగంగా ఐఎఎస్ అధికారులు పి. సెంథిల్‌కుమార్ మరియు జి. లక్ష్మీప్రియలను ముఖ్యమంత్రికి ప్రధాన కార్యదర్శులుగా నియమించారు.ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న పి. సెంథిల్‌కుమార్ ముఖ్యమంత్రికి అదనపు ప్రధాన కార్యదర్శి, కార్యదర్శిI గా నియమితులయ్యారు. ఇంతకుముందు ఆది ద్రవిడ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న జి. లక్ష్మీ ప్రియ బదిలీపై ముఖ్యమంత్రికి కార్యదర్శిII గా నియమితులయ్యారు.

## లంచం కేసులో మొహాలీలోని బ్యూరో ఆఫీసుపై సీబీఐ దాడులు

**ఉదయం డెస్క్, మే 12:**




సుమారు రూ. 20 లక్షల లంచం లావాదేవీకి సంబంధించిన ఆరోపణలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) మొహాలీలోని పంజాబ్ విజిలెన్స్ బ్యూరో కార్యాలయంలో అర్ధరాత్రి దాడులు నిర్వహించింది. పలువురు అనుమానిత మధ్యవర్తులను అరెస్టు చేసి, ఆపరేషన్‌లో సుమారు రూ. 13 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఎఫ్ ఐఆర్ నెం.12/26, అవినీతి నిరోధక చట్టం నిబంధనల కింద నమోదు చేసిన ఒక కేసు దర్యాప్తులో భాగంగా, డీఎస్పీ పవిత్ర సింగ్ నేతృత్వంలోని చండీగఢ్ కేంద్రంగా పనిచేసే సిబిఐ బృందం ఈ దాడిని నిర్వహించింది.అధికారుల ప్రకారం, అరెస్టయిన వ్యక్తులు విజిలెన్స్ శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి తరపున లంచాలు వసూలు చేస్తున్నారని సదరు ఏజెన్సీ అనుమానిస్తోంది.

దర్యాప్తు సమయంలో విజిలెన్స్ బ్యూరోకు చెందిన ఒక సీనియర్ అధికారి పేరు వెలుగులోకి వచ్చిందని, ప్రస్తుతం ఆయన్ను విస్తృతంగా విచారిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఆపరేషన్ సందర్భంగా, ఆ శాఖకు చెందిన మరికొందరు ఉద్యోగులను కూడా వివిధ దశల్లో విచారించినట్లు అధికారులు పేర్కొన్నారు.

సందేహాల పరిధిలో ఉన్న అధికారి పరారీలో ఉన్నారని, ఫోన్ కాల్స్‌కు స్పందించడం లేదని అధికారులు తెలిపారు.

పత్రాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు స్వాధీనం

ఈ దాడుల సందర్భంగా, విజిలెన్స్ బ్యూరో కార్యాలయం నుంచి సీబీఐ పలు పత్రాలు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకుంది.

ఒక ఫైవ్‌స్టార్ హోటల్, సంబంధిత ఆస్తి వ్యవహారాలకు సంబంధించిన ఒక ఆరోపిత ఒప్పందంపై జరుపుతున్న దర్యాప్తులో భాగంగా, స్వాధీనం చేసుకున్న ఈ సామాగ్రిని ఏజెన్సీ ఇప్పుడు పరిశీలిస్తోందని అధికారులు తెలిపారు. ఈ లావాదేవీకి సంబంధించి లంచాలు డిమాండ్ చేసినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు.

ఈ ఆపరేషన్ సమయంలో అరెస్టు చేసిన, ఆరోపణలు ఎదుర్కొంటున్న మధ్యవర్తులకు పంజాబ్ ప్రభుత్వం పోలీసు భద్రత కల్పించిందని అధికారులు పేర్కొన్నారు.

**ఆప్ ప్రభుత్వంపై మజీతియా దాడి**

సీబీఐ చర్యపై స్పందిస్తూ, శిరోమణి అకాలీ దళ్ సీనియర్ నాయకుడు బిక్రమ్ సింగ్ మజీతియా పంజాబ్‌లోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పంజాబ్‌లోని అవినీతి పై నుండి క్రింది వరకు పొరలు పొరలుగా బయటపడుతోందని ఎక్స్‌పై చేసిన ఒక పోస్టులో మజీతియా ఆరోపించారు. రూ. 20 లక్షల లంచం వ్యవహారంపై విచారణ జరుగుతుండగా, ఆపరేషన్‌లో కేంద్ర ఏజెన్సీ రూ. 13 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం, అని ఆయన అన్నారు.

ఆరోపిత రూ. 20 లక్షల లంచం ఒప్పందం పరిశీలనలో ఉంది, ఆపరేషన్‌లో కేంద్ర ఏజెన్సీ రూ. 13 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం, అని ఆయన అన్నారు.

ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో పంజాబ్ విజిలెన్స్ కార్యాలయం అవినీతి కేంద్రంగా మారిందని మజీతియా ఆరోపించారు. ముఖ్యమంత్రిగా, హోం మంత్రిగా కొనసాగడానికి భగవంత్ మాన్‌కు నైతిక హక్కు లేదని, ఆయన రాజీనామా చేయాలని మజీతియా డిమాండ్ చేశారు.

పంజాబ్‌కు పారదర్శక పాలన కావాలి, భయం, బెదిరింపులు, అవినీతితో నడిచే పరిపాలన కాదు అని కూడా ఆయన పేర్కొన్నారు.

తెలియని సీనియర్ అధికారి ఆచూకీ

ఆపరేషన్ అనంతరం విజిలెన్స్ డీజీపీ కార్యాలయాన్ని సీల్ చేశారన్న వార్తలు సోషల్ మీడియాలో రావడంతో, ఈ దాడి రాజకీయ, పరిపాలనాపరమైన ఊహాగానాలకు దారితీసింది.

విజిలెన్స్ చీఫ్ కనిపించడం లేదని, ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉందని మజీతియా ఆన్‌లైన్‌లో పేర్కొన్నారు. అయితే, దీనికి సంబంధించి దర్యాప్తు సంస్థల నుండి ఎటువంటి అధికారిక నిర్ధారణ లభించలేదు.

ఈ ఆపరేషన్‌పై సీబీఐ ఇంకా ఎటువంటి అధికారిక, వివరణాత్మక ప్రకటన విడుదల చేయలేదు, ఈ విషయానికి సంబంధించి దర్యాప్తు కొనసాగుతోంది.

## నువ్వా, నేనా అంటూ అమెజాన్, ఫ్లిప్ కార్ట్ ధరల యుద్ధం

భారత ఈకామర్స్ మార్కెట్లో మరోసారి ఆఫర్ల మోత మోగుతోంది. దిగ్గజ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తమ సమ్మర్ సేల్స్‌తో వినియోగదారులను ఆకర్షించేందుకు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ల విభాగంలో ఈ పోటీ ధరల యుద్ధాన్ని తలపిస్తోంది. భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్చేంజ్ ప్రయోజనాలతో ఫ్లాగ్‌షిప్, బడ్జెట్ ఫోన్ల ధరలు గణనీయంగా తగ్గాయి. కొత్త ఫోన్ కొనాలనుకునే వారికి ఇది సువర్ణావకాశంగా మారింది.అమెజాన్ తన 'గ్రేట్ సమ్మర్ సేల్'ను మే 8న ప్రారంభించింది. ఈ సేల్‌లో స్మార్ట్‌ఫోన్లపై 40% వరకు డిస్కౌంట్లను అందిస్తోంది. పాత ఫోన్ ఎక్స్చేంజ్‌పై రూ.66,000 వరకు ప్రయోజనాలు పొందవచ్చు. ముఖ్యంగా, అత్యంత ప్రజాదరణ పొందిన సామ్‌సంగ్ గెలాక్సీ S25 అల్ట్రా మోడల్‌పై బ్యాంక్, కూపన్ ఆఫర్లను కలుపుకొని రూ.94,999కే సొంతం చేసుకునే అవకాశం కల్పించింది. అమెజాన్‌కు గట్టి పోటీనిస్తూ ఫ్లిప్‌కార్ట్ 'సాసా లెలే సేల్'ను మే 9 నుంచి 15 వరకు నిర్వహిస్తోంది. ప్లస్ సభ్యులకు మే 8 నుంచే ఎర్లీ యాక్సెస్ లభించింది. స్మార్ట్‌ఫోన్లతో పాటు ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్స్‌పై కూడా ఫ్లిప్‌కార్ట్ భారీ ఆఫర్లను ప్రకటించింది. ఈ రెండు సంస్థల మధ్య నెలకొన్న ఈ పోటీ వాతావరణం చివరికి వినియోగదారులకే లాభం చేకూరుస్తోంది. తాము కోరుకున్న స్మార్ట్‌ఫోన్‌ను అత్యుత్తమ ధరకు దక్కించుకునేందుకు వారికి మంచి అవకాశం లభిస్తోంది. ఫ్లాగ్‌షిప్ మోడల్స్‌తో పాటు రూ.10,000 నుంచి రూ.30,000 మధ్య ధరలో లభించే బడ్జెట్ ఫోన్లపై కూడా ఆకర్షణీయమైన డీల్స్ ఉన్నాయి.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



**జాయింట్ డైరెక్టర్ సుబ్బారాజు**

**వరంగల్ టౌన్, మే 12 (వుదయం ప్రతినిధి) :**

జనగణన-2027 ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని హైదరాబాద్ జనగణన శాఖ జాయింట్ డైరెక్టర్ డి.సుబ్బారాజు అధికారులకు సూచించారు. మంగళవారం రోజున హనుమకొండలోని 28వ డివిజన్ పరిధిలో గోవిందరాజుల గుట్ట, సత్యం లేన్, స్టేషన్ రోడ్ ప్రాంతాల్లో జరుగుతున్న జనగణన ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహణ, వివరాల నమోదు విధానం, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు.

ప్రతి కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జనగణన దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని,

ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జనగణన శాఖ సెక్షన్ ఆఫీసర్ సతీష్, రెవెన్యూ అధికారి బి. శ్రీనివాస్, ఆర్ఐ అశోక్ కుమార్, వార్డ్ ఆఫీసర్, బిల్ కలెక్టర్ కుమారస్వామి, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు హాజరయ్యారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో మొక్కజొన్న కోనుగోలు, వరి దాన్య సేకరణ పై వీడియో కాన్ఫరెన్స్.






**వరంగల్ జిల్లా**

**వుదయం ప్రతినిధి మే 12.**

జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్స్ తో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పార్టీస్థితిగతులపై సమాచారాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు కార్యక్రమాన్ని నిర్వహించగా ఇటు వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వివిధ జిల్లాల కలెక్టర్లు అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి




**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హనుమకొండ, మే 12 (వుదయం ప్రతినిధి ) :**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను మరింత వేగవంతం చేయడంపై జిల్లా అధికారులు, తహసిల్దార్లతో సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వారిగా ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయడంపై అవగాహన కల్పించారు. 34 పోలింగ్ కేంద్రాలకు మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా పర్యవేక్షించేందుకు 46మంది జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులతో ఇంటింటికి తిరుగుతూ 2002 ఓటర్ల జాబితా వివరాలను సేకరించి 2025 ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ 70శాతం వరకు పూర్తి చేయాలన్నారు. అధికారులు తమ కార్యాలయ పరిధిలో ఉన్న ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులతో ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేయించాలన్నారు. బుధవారం నుండి వారం రోజుల్లోగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 70శాతం కంటే పైగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. సోమవారం ఎస్ఐఆర్ పురోగతిపై అధికారులతో తిరిగి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయడంపై అధికారులు పూర్తిస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, డిఆర్డీవో మేన శ్రీను, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, పలు శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, పాల్గొన్నారు.

## కాళేశ్వరం పుష్కరాలకు 25 బ్యారికేడ్లు అందజేసిన ఎంఫీఎల్ కంపెనీ ప్రతినిధులు

**జయశంకర్ భూపాలపల్లి మే 12(వుదయం జిల్లా ప్రతినిధి)**

కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మహాలక్ష్మి ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీసులకు 25 బ్యారికేడ్లు అందజేశారు. సుమారు రూ.2 లక్షల విలువైన ఈ బ్యారికేడ్లను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, కు కంపెనీ ప్రతినిధులు అందించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్టీల్ పైప్స్ సంస్థ కంపెనీ తమ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా ఈ సహకారం అందించింది. కంపెనీ బ్రాండింగ్ మేనేజర్ కార్తిక్ గౌడ్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు అధికారులకు బ్యారికేడ్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మాట్లాడుతూ, కాళేశ్వరం పుష్కరాల నిర్వహణలో ప్రజల భద్రతకు ఉపయోగపడే విధంగా సహకారం అందించిన కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్, ఎంటిఓ ఆర్ఐ పూర్ణచందర్, కంపెనీ ప్రతినిధులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ పనులను పరిశీలించిన సీఎండీ వరుణ్ రెడ్డి



**ములుగు, మే 12 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ములుగు జిల్లాలో పలు విద్యుత్ అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. ములుగులో కొత్తగా నిర్మిస్తున్న డిపార్ట్‌మెంటల్ ఎస్పీఎం షెడ్ పనులను పరిశీలించిన సీఎండీ జూన్ నెలాఖరు నాటికి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రైవేట్ ఎస్పీఎం షెడ్ ను సందర్శించి, ఫెయిల్యూర్ ట్రాన్స్‌ఫార్మర్ల రికార్డులు, నిర్వహణ విధానం, పనితీరును పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల ప్రక్రియను మరింత వేగవంతం చేసి రోలింగ్ స్టాక్ పెంచుకోవాలని సూచించారు . ట్రాన్స్ఫార్మర్ల ను రిపేర్లు చేసి త్వరితగతిన అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం 33 కెవి కొత్త లైన్ పనులను సీఎండీ పరిశీలించారు. ఈ లైన్ సుమారు 27 కిలోమీటర్ల అటవీ ప్రాంతం గుండా కర్లపల్లి సబ్ స్టేషన్ నుండి వస్తూ లింగాల కొత్త సబ్ స్టేషన్ కు కలుస్తుందని అధికారులు వివరించారు. అదేవిధంగా పస్రా సెక్షన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సెక్షన్ ఆఫీస్ పనులను పరిశీలించి, ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ 33/11కెవి లింగాలనూతన సబ్ స్టేషన్ ఏర్పాటుతో గుండాల, కొడిశెల లింగాల పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగ్గా అందుతుందని సీఎండీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ నాణ్యత మెరుగుపడటంతో పాటు అంతరాయాలు తగ్గుతాయని పేర్కొన్నారు. లో వోల్టేజ్ సమస్య ఉండదని వివరించారు . వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎండీ వెంట సిఈ రాజు చౌహన్ , ఎస్ ఈ ములుగు బేతి బిక్షపతి , ములుగు డీఈ ఆపరేషన్ నాగేశ్వర్ రావు, డీఈ ఎటూరునాగారం పురుషోత్తం డీఈ (ఎంఆర్టీ, సి) సదానందం, ఈఈ సివిల్ వెంకట్రాం , ఏ.డి.ఈ సివిల్ ప్రణయ్ , సందీప్ పాటిల్ తాడ్వాయి ఏ.డి.ఈ రాజేష్ , ములుగు ఏ.డి.ఈ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు .

## రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



**రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్గొండ జిల్లా**

**వుదయం ప్రతినిధి మే 13**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా కీలక ఆదేశాలు జారీ చేయడం జరిగింది

ధాన్యం సేకరణ ప్రక్రియను మిషన్ మోడ్ అమలు ద్వారా వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి.

గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షించాలి.

లారీల కొరత ఉన్న చోట ప్రత్యామ్నాయ వాహనాలను వినియోగించాలి. నిబంధనలు ఉల్లంఘించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. అకాల వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించేందుకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలి. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. ప్రతి ఐకేపీ సెంటర్ మరియు రైస్ మిల్లు వద్ద ప్రత్యేక అధికారులను నియమించి పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలి. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధమ ప్రాధాన్యతని,

విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేయడం జరిగింది.

## గ్రామాల్లో కుల వివక్ష రూపుమాపుటకు చర్యలు తీసుకోండి



**- సూరారంలో గ్రామ దేవత పండుగలో దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి**

**- కలెక్టర్ కు దళిత సంఘాల వినతి**

**యాదాద్రి భువనగిరి / మే వుదయం జిల్లా ప్రతినిధి :**

దేశంలో స్వాతంత్ర అమృతోత్సవాలు జరుపుకుంటున్న ఇంకాకూడా గ్రామాలలో కుల వివక్ష పూర్తిగా పోలేదని, కుల వివక్షను రూపుమాపుటకు చర్యలు తీసుకోవాలని దళిత బహుజన శ్రామిక యూనియన్, పార మరియు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అనురాగ్ జయంతి ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల ఏడవ తేదీన రామన్నపేట మండలంలోని సూరారం గ్రామంలో గ్రామ దేవత కోట మైసమ్మ పండుగ సందర్భంగా దళితులపై జరిగిన దాడి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. పండుగలో దళితులను బోనాలు పెట్టకుండా అడ్డుకోవడంతో పాటు మాదిగ కులానికి చెందిన బందేల వెంకటయ్య పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చేసేలా చర్యలు తీసుకోవాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి. నర్సింహ కోరారు. ఇటీవల గ్రామాల్లో పండుగలు జరుగుతున్న సందర్భాల్లో దళితుల పట్ల వివక్ష, దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని నివారించడంలో సంబంధిత వ్యవస్థల యొక్క కృషి చాలా అవసరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, రెవిన్యూ, పంచాయతీ అధికారులను అప్రమత్తం చేసేలా తగు చర్యలు తీసుకోవాని వినతి పత్రంలో కోరారు. కలెక్టర్ అనురాగ్ జయంతి సానుకూలంగా స్పందిస్తూ కుల వివక్ష రూపుమాపుటకు చర్యలు తీసుకుంటామని ఈ నెల నుండి అన్ని మండలల్లో సివిల్ రైట్స్ డే తప్పనిసరిగా జరిపేలా సర్క్యులర్ విడుదల చేస్తామని ఈ సమావేశాల్లో సంబంధిత అధికారులను తప్పనిసరిగా హాజరయ్యేలా చేస్తామని అన్నారు అని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిబిఎస్ యు రాష్ట్ర కార్యదర్శి కే. అమృత, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, డి బి ఎస్ యు జిల్లా కార్యదర్శి, పార కో ఆర్డినేటర్ సురుపంగ శివలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



**యువత మత్తుకు బానిస కావొద్దు..**

**ఉజ్వల భవిష్యత్తును పాడుచేసుకోవద్దు**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మే 12 (వుదయం ప్రతినిధి) :**

మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా *1 అధికారులను ఆదేశించారు. మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మత్తు పదార్థాల నియంత్రణపై ఎక్సైజ్, పోలీసు, వైద్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఇలాంటి అవగాహన కార్యక్రమాల ఏర్పాటుతో సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, దాబాల వద్ద ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. యువత మత్తుకు బానిస కావొద్దని, ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. గుట్కా విక్రయాలను చేసే దుకాణాల మీద చర్యలు తీసుకోవాలన్నారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అక్రమ రవాణా, విక్రయాలపై పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎక్సైజ్ ఎస్పీ అనిత, ఆర్డీఓ శ్రీనివాస్ గౌడ్, డీఎంహెచ్ఓ మల్లిఖార్జున రావు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

**మహబూబాబాద్ జిల్లా మే 12**

**వూదయం జిల్లా ప్రతినిధి**

రాష్ట్రంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు.వీడియో కాల్ కాన్ఫరెన్స్ అంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా ఇకముందు ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారులను నియమించి తగిన చర్యలు తీసుకోవాలని. గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా వాహనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు,

## మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

**కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి వెంటనే రశీదులు ఇవ్వాలి**

**హమాలీలను వంద శాతం వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చూడాలి**

**ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను రవాణాకు వినియోగించాలి**

**మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి**




**ఖమ్మంవుదయం బ్యూరో, మే-12:**

మొక్కజొన్న,ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.

మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు లతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు 3 వేల 873 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని, రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాకలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 2 లక్షల 22 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 2 లక్షల 78 వేల టన్నుల మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు చేరినట్లు తెలిపారు. గత వారం రోజుల్లోనే లక్షా యాభై వేల టన్నుల అదనపు నిల్వ సామర్థ్యాన్ని సృష్టించి కొనుగోళ్లు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిఎస్ఓ చందన్ కుమార్, డిఆర్డిఓ శ్రీరామ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిసిఓ గంగాధర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీం, ఇంచార్జ్ డిఎం సివిల్ సప్లై సునీల్ రెడ్డి, ఆర్టీఓ, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## సాంస్కృతిక వైభవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



**– జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**ములుగు, మే 12(వుదయం ప్రతినిధి) :**

ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, మూడు రోజుల పాటు ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.

మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఉత్సవాల షెడ్యూల్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలను, ప్రతిబింబించేలా ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో, జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల, జడ్.పి.హెచ్.ఎస్. బాలికల పాఠశాలలో మే 20,21,22వ తేదీలలో మూడు రోజుల పాటు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్, గిరిజన నృత్యాలు, కవి సమ్మేళనం పలు అంశాలలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు నిర్వహించే వేదికలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చూడాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వంటి అంశాలలో ఎలాంటి లోటుపాట్లు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతుకు నో ఇబ్బంది కొనుగోలు కేంద్రంలోనే రశీదు: సీఎం రేవంత్ ఆదేశాలు





**వుదయం సూర్యాపేట మే:12**

మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి"అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్ పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ....కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి వెంటనే రైతులకు రశీదులు ఇవ్వాలి

జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిల్వ సదుపాయాలు పెంచాలి కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలి స్థానిక హమాలీలను 100% వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చూడాలి. అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే లైసెన్సులు రద్దు చేయాలి రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదు ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను రవాణాకు వినియోగించాలి తడిసిన ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి, టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం 3 వేల 873 కోట్లు విడుదల చేశాం. 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయి" అని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ "భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చింది. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి"అని ఆదేశించారు. కార్యక్రమంలో పి.డి. డిఆర్డిఓ సన్యాసయ, డిఎస్ఓ మోహన్ బాబు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఎమ్ఓ నాగేశ్వర్ శర్మ, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిపి ఆఫీసులో వాహనాల పాత విడిభాగాల వేలం




**హనుమకొండ క్రైం, మే 12 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పాత విడిభాగాలను ఈ నెల 15 తారీకు, శుక్రవారం రోజున వేలం వేయనున్నట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రభుత్వ పోలీస్ వాహనాలకు సంబంధించి రిపేర్ చేయబడిన బ్యాటరీలు, టైర్లు, విడిభాగాలను వేలంలో అందుబాటులో ఉంచుతామని, ఆసక్తి గల వ్యక్తులు శుక్రవారం ఉదయం 10 గంటలకు కమిషరేట్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ (యంటీవో)లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 87126 85158, 9440242895, 9949568320 నంబర్లకు సంప్రదించగలరని సీపీ తెలిపారు

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## జిల్లాలో డీజేలు పూర్తిగా నిషేధం

**జిల్లా ఎస్పీ శ్రీమతి నితిక పంత్**



**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో డీజే సిస్టమ్‌ల వినియోగం పూర్తిగా నిషేధించబడిందని జిల్లా ఎస్పీ శ్రీమతి నితిక పంత్ తెలిపారు. మైక్ బాక్సులు, సౌండ్ సిస్టం ల అనుమతి కొరకు స్థానిక ఎస్.డి.పి.ఓ కార్యాలయం నుండి ముందస్తుగా అనుమతి పొందాలని, అదేవిధంగా రాత్రి 10 గంటల తర్వాత శబ్ద కాలుష్యం కలిగించే మైక్ బాక్సులు, లౌడ్ స్పీకర్లు, భారీ సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి కూడా అనుమతి లేదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు మరియు శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనల ప్రకారం ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లు వినియోగించడం నిషేధించబడిందని తెలిపారు. వివాహాలు, శుభకార్యాలు, ఊరేగింపులు, ఇతర కార్యక్రమాల సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పరికరాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘించే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు లేదా అధిక శబ్దంతో మైక్ బాక్సులు వినియోగిస్తున్నట్లు గమనిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

## రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై సీఎం సమీక్ష





- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి
- నిర్లక్ష్యం సహించేది లేదు
- కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**నిజామాబాద్, మే 12 : (వుదయం ప్రతినిధి):**

రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లు, వరి ధాన్యం సేకరణ ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులు వీసీలో పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ నుండి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీ.ఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోలు కేంద్రాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను ఒప్పందం మేరకు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వెనకాడవద్దని స్పష్టం చేశారు. వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ కమిషనర్ ను ఆదేశించారు.

సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సీఎం సూచించారు. గోదాముల కొరత ఉన్న ప్రాంతాల్లో రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని అన్నారు. మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. కొనుగోళ్ల పురోగతిపై ఎప్పటికప్పుడు సీఎంఓకు నివేదికలు పంపాలని ఆదేశించారు. స్థానిక హమాలీలను గుర్తించి వినియోగించుకోవాలని, ధాన్యం లోడింగ్‌లో జాప్యం లేకుండా చేసిన వెంటనే రైతులకు రశీదులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీల కొరత ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని తెలిపారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ఆధారంగా రైతులను ముందస్తుగానే అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లు వద్ద ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షణ చేయాలని, మిషన్ మోడ్‌లో పని చేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా మొదటి స్థానంలో ఉందని, మొక్కజొన్న కొనుగోళ్లు సైతం 88శాతం పూర్తయ్యాయని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నామని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరిస్తున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, పౌర సరఫరాల శాఖ అధికారులు శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్, అరవింద్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, మార్క్‌ఫెడ్ డీఎం క్రాంతి, మార్కెటింగ్ శాఖ ఏ.డీ గంగూబాయి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, రవాణా శాఖ డీటీసీ దుర్గా ప్రమీల, ఎంవీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ ఏర్పాటు చేయాలని

### మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నేతలు



**కామారెడ్డి, మే 12 (వుదయం ప్రతినిధి):-**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైవే & ఎక్స్ ప్రెస్ ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మంగళవారం రాష్ట్ర రవాణా & బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కామారెడ్డి కాంగ్రెస్ నేతల బృందం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ ఏర్పాటు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా టిఎస్ఆర్టీసీ ఎండి, కామారెడ్డి జిల్లా కలెక్టర్ బస్టాండ్ ఏర్పాటు సాధ్యసాధ్యాలు, స్థలం కేటాయించాలని మంత్రి ఆదేశించారు. కామారెడ్డి జిల్లా కేంద్రం ఉత్తర తెలంగాణలో ప్రముఖ పట్టణంగా విస్తరిస్తుందని పలు విషయాలు మంత్రి పొన్నం దృష్టికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి తీసుకొచ్చారు. ప్రస్తుతం కామారెడ్డి పట్టణం లక్ష జనాభాకు పైగా ఉందని, ప్రస్తుతం పట్టణం నలువైపులా విస్తరిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కొత్త బస్టాండ్ విస్తీర్ణం తక్కువగా ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు 44వ జాతీయ రహదారి విస్తరణ జరగడంతో ఆర్మూర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నాగ్ పూర్, కోరుట్ల, మెట్ పల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కామారెడ్డి పట్టణంలోకి రావడం లేదు. నాన్ స్టాఫ్ బస్సుల కారణంగా కామారెడ్డికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి 44వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ పరంగా, ఆర్టీసీకి అనుకూలంగా భూమి ఉన్నందున అ స్థలంను కేటాయించి నాన్ స్టాఫ్ బస్టాండ్ కానీ హైవే బస్టాండ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోగలరని కోరుచున్నాము. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో కీలకమైన కామారెడ్డి నుంచి రాకపోకలు కొనసాగించేలా హైవే బస్టాండ్ ఏర్పాటు చేయాలనీ కోరుచున్నాము. దీని కారణంగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు రాకపోకలు సాఫీగా జరిగే అవకాశం ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. మంత్రిని కలిసిన వారిలో అడ్లూర్ కౌన్సిలర్ గడ్డమిది మహేష్, డీసీసీ ఉపాధ్యక్షులు నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, క్రైడా అధ్యక్షులు గణగోన లక్ష్మి నర్సాగౌడ్, కాంగ్రెస్ నేతలు శ్రీధర్ రావు ఉన్నారు.

## పాలీసెట్ పరీక్షకు సర్వం సిద్ధం

**డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. విజయ్ కుమార్**




**కామారెడ్డి, మే 12 (వుదయం ప్రతినిధి):-**

ఈ నెల 13వ తేదీ (బుధవారం) నిర్వహించనున్న పాలీసెట్ 2026 ప్రవేశ పరీక్షకు కామారెడ్డి పట్టణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలీసెట్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు. కామారెడ్డి పట్టణంలో మొత్తం 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కేంద్రాల్లో మొత్తం 2,643 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 11 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేయబడతాయి. 'నిమిషం నిబంధన' అమలులో ఉన్నందున, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని కోఆర్డినేటర్ స్పష్టం చేశారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్, బ్లూ బాల్ పాయింట్ పెన్, హెచ్.బి పెన్సిల్, ఎరేజర్ మాత్రమే తెచ్చుకోవాలి. మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్ష రాయాలని డాక్టర్ కె. విజయ్ కుమార్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## ఏబీ స్విచ్‌లతో విద్యుత్ అంతరాయాలకు చెక్

### ఎస్ఈ ఉత్తమ్ జాడే.



**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

సర్కిల్ పరిధిలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపర్చేందుకు ఏబీ స్విచ్‌ల ఏర్పాటును వేగవంతం చేస్తున్నామని సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. గ్రామాలు, త్రిఫేజ్ లైన్లలో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడైనా లైన్ ఫాల్ట్ ఏర్పడితే మొత్తం గ్రామానికి విద్యుత్ నిలిపివేయకుండా, సమస్య ఉన్న ప్రాంతానికే పరిమితం చేయగలుగుతున్నామని చెప్పారు. భారీ వర్షాలు, ఈదురు గాలులు, చెట్ల కొమ్మలు తగలడం వంటి కారణాలతో ఏర్పడే అంతరాయాలను త్వరగా గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతోందన్నారు. ఏబీ స్విచ్‌లతో ట్రిప్పింగ్ సమస్యలు తగ్గి, వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందుతోందని వివరించారు. మరమ్మతు పనుల సమయంలో సిబ్బంది భద్రత కూడా మెరుగుపడుతోందన్నారు. అత్యవసర విద్యుత్ సమస్యల కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని సూచించారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

### అన్నదాత అవగాహన కార్యక్రమం



**బెజ్జూర్ ( వుదయం ప్రతినిధి )**

బెజ్జూరు మండలంలోని బెజ్జూరు గ్రామంలో గ్రామంలో రైతులకు అవగాహన కల్పించడం జరిగింది.తక్కువ యూరియా వాడండి సాగు ఖర్చులను తగ్గించండి నేల ఆరోగ్యాన్ని కాపాడండి. అవసరం మేరకు రసాయనాలను వినియోగించండి ప్రకృతిని రక్షించండి. పంట మార్పిడి పాటించండి సుస్థిర ఆదాయాన్ని పొందండి.మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలనే సాగు చేయండి అధిక ఆదాయాన్ని పొందండి సాగునీటినీ ఆదాయాన్ని భావితరాలకు అందించండి సేంద్రీయ పద్ధతులను పాటించండి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఆస్వాదించండి అని ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు Dr సిహెచ్ అనురాధ,Dr కే సౌజన్య, ఏవో నాగరాజు ఏఈఓ శ్రీధర్, కార్యదర్శి వైకుంఠం గ్రామ సర్పంచ్ సరోజ ఉప సర్పంచ్ ఆదర్శ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటీఐ అడ్మిషన్లు ప్రారంభం.



**జన్నారం, మే 12(వుదయం విలేకరి)**

2026 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బండి రాములు తెలిపారు.మంగళవారం రోజున ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీవీటీ విధానం కింద ఏటీసీ, ఐటీఐ ట్రేడుల్లో ప్రవేశాలకు మే 14 నుంచి జూన్ 8 వరకు వెబ్‌సైట్ :https://iti.telangana.gov.in లో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని, 10వ తరగతి లేదా 8వ తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలని, 01 082026 నాటికి 14 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు.ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రింట్ కాపీని, రూ.100/ రిజిస్ట్రేషన్ ఫీజుతో సమీప ఏటీసీ లేదా ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

## రైతులకు ఇబ్బంది కలిగితే సహించం

### కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి కఠిన హెచ్చరిక




**ఆదిలాబాద్ ( వుదయం ప్రతినిధి ) :**

మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొనుగోళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరీక్ష పూర్తి చేసి వెంటనే రశీదులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని తెలిపారు.రవాణా సమస్యలు రాకుండా ఖాళీ ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను వినియోగించాలని, స్థానిక హమాలీలను పూర్తిస్థాయిలో ఉపయోగించాలని సూచించారు. అధిక చార్జీలు డిమాండ్ చేసే హమాలీలపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోళ్లపై వచ్చే ప్రతికూల వార్తలకు అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్లపై పూర్తి బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం




**ఆసిఫాబాద్,( వుదయం ప్రతినిధి ):**

రైతు సంక్షేమాభివృద్ధి, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు ప్రక్రియ వేగంగా చేపట్టాలని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అధికారులు సమన్వయంతో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్క్ ఫెడ్ ద్వారా జిల్లాలోని జైనూర్, కాగజ్ నగర్, కౌటాల మండలాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటివరకు 900 కుంటల మొక్కజొన్నలు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలు కొరకు 40 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని, 9 కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రధానంగా దహేగాం, లగ్గాం, ఒడ్డుగూడ, గిరవెల్లి, చంద్రపెల్లి, సాండ్ గాం, దుబ్బగూడ, వీరవెల్లి, గుడ్లబోరి, సిర్పూర్ టి, సీతానగర్, రవీంద్ర నగర్ కొనుగోలు కేంద్రాలకు ఎక్కువ వరి ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సంఖ్య, తూకం యంత్రాలను అదనంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లాలో గోనె సంచుల కొరత లేదని, స్థానికంగా రైతుల వద్ద ఉంటే డబ్బులు చెల్లించి కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల హమాలీల కొరకు ఆధారపడకుండా స్థానికంగా ఉన్న హమాలీలను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను ప్రతిరోజు సందర్శించి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించి ఉదయం, సాయంత్రం నివేదికలు అందించాలని తెలిపారు. జిల్లాలో గోదాముల కొరత లేదని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించి రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత లేదని, అవసరమైతే స్థానికంగా ఉన్న వాహనాలను వినియోగించుకోవాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియలు రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, సహకార శాఖ అధికారి మోహన్, జిల్లా రవాణా అధికారి రామ్ చందర్, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు

- సమన్వయంతో పని చేస్తూ సమస్యలు తలెత్తకుండా
- చూడాలి బక్రీద్ సందర్భంగా సమన్వయ కమిటీ
- సమావేశంలో కలెక్టర్, సీ.పీ




**నిజామాబాద్, మే 12 : (వుదయం ప్రతినిధి):-**

పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకుని కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీ.పీ సమీక్షించారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలని అన్నారు. గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులను వధించడంపై నిషేధం ఉందని, తెలంగాణాలో ఒంటెలను కూడా వధించకుండా నిషేధం అమలులో ఉందని సూచించారు. ఈ విషయాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవులు, ఒంటెలను వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులను స్లాటర్ హౌజ్ లలోనే వధించాలని, రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వధించరాదని సూచించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అన్ని చోట్ల సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాలూర, పోతంగల్, ఖండ్ గావ్ అంతర్రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు, సాటాపూర్, యంచ, ఇందల్వాయి, ఉమ్మెడ, జన్నెపల్లి, మామిడిపల్లి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని సీ.పీ తెలిపారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ జరపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సంయమనంతో వ్యవహరిస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు హితవు పలికారు. సీజ్ చేసిన పశువులకు తగిన షెల్టర్ కల్పిస్తూ, వాటికి పశుగ్రాసం, నీటి వసతి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాటాపూర్, ఇందల్వాయి తదితర చోట్ల కొనసాగే పశువుల వారాంతపు సంతలలో నిబంధనలకు అనుగుణంగా, పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా చూడాలని, వ్యర్థాలను వెంటదివెంట జనావాసాలకు దూరంగా తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుక జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ శుభం ప్రకాష్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, నిజామాబాద్, ఆర్మూర్ ఏసీపీ లు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ దుర్గా ప్రమీల, ఎంవీఐ లు శ్రీనివాస్, కిరణ్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గంగాధరయ్య, పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక, పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు




**కామారెడ్డి, మే 12 (వుదయం ప్రతినిధి):-**

కామారెడ్డి పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేస్తూ కాంగ్రెస్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్నీ పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల కాంగ్రెస్ పార్టీ తోపులాటల మధ్యలో బండి సంజయ్ దిష్టిబొమ్మ, దహనం చేశారు. బండి సంజయ్ తన పదవిని అడ్డుపెట్టుకుని కేసులను ప్రభావితం చేయాలని చూస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహావేశాలతో నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని సందీప్ మాట్లాడుతూ, కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వెంటనే అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న అధికారాన్ని ఉపయోగించి పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు.

హనీట్రాప్ కేసుల పేరు తో అసలు అంశాన్ని మళ్లించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అందరికీ ఒకే న్యాయం ఉండాలని, కానీ బీజేపీ పాలనలో అధికారంలో ఉన్న వారికి ఒక న్యాయం, సామాన్య ప్రజలకు మరో న్యాయం జరుగుతోందని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర మంత్రిగా ఉండి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ బాధితులపైనే కేసులు పెట్టించే పరిస్థితి తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. బండి సంజయ్ మంత్రి పదవిలో ఉన్నంత వరకు ఈ కేసులో నిష్పక్షపాత దర్యాప్తు జరగదని, వెంటనే ఆయనను పదవి నుండి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, కామారెడ్డి రూరల్ అధ్యక్షులు రాజాగౌడ్, రామాగౌడ్, గుడుగుల శ్రీనివాస్, రామ్మోహన్, కాళ్ల గణేష్, అజ్మత్, ఆనందరావు, గ్యార సాయిలు, అంజద్, లడ్డు, కళ్లెం సత్యం, భూమణి బాలరాజు, వల్పిశెట్టి భాస్కర్, అన్వర్ అహ్మద్, జావిద్, గీరెడ్డి మహేందర్ రెడ్డి, మీసాల రమేష్, సాయిలు, ప్రభాకర్, హనుమాన్ల రాము, భరత్ టింకు, సుఫియాన్, వడ్ల సురేష్, దువల నరేష్, శేఖర్, పటేల్ కుమార్, ఫణీంద్ర, హనుమాన్ల రవి, శంకర్, ప్రవీణ్, అద్నాన్, అర్ఫాత్, లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయ కార్యదర్శి లక్కపత్తిని గంగాధర్, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## 3వ వార్డులో ప్రజా పాలన సమస్యలు విన్నవించిన కౌన్సిలర్ కాకర్ల

నారాయణపేట మే 12 (వుదయం ప్రతినిధి)

మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్,అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య అధికారులకు వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు.ప్రధానంగా శ్రీనగర్ కాలనీలో డ్రైనేజీ,రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని అలాగే చెత్త బండ్లు 15 రోజులుగా రావడం లేదని తెలిపారు.డ్రైనేజీలు నిర్మించి,సీసీ రోడ్లు వేసి ఇబ్బందులు తీర్చాలని కోరారు.అలాగే చెత్త బండ్లు రోజు విడిచి రోజు అయినా పంపించి చెత్త తీసుకెళ్లాలని కోరారు.అందుకు సంబంధించిన కమిషనర్ శంకర్ త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్,ఇంజనీర్ మహేష్,పర్యావరణ ఇంజనీర్ భారత్ ,వాటర్ మెన్ ,ఎలక్ట్రీషియన్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్చెరు ( వుదయం )

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పటాన్చెరు పట్టణంలోని పంచముఖి హనుమాన్ దేవాలయం, చైతన్య నగర్ హనుమాన్ దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియచేశారు. స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కంకర శ్రీనివాస్, ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ భూములపై కన్నేసిన కబ్జాదారులు

**మెయిన్ రోడ్డు ఫేసింగ్ కోసం ప్రభుత్వ ప్రహరీ గోడ తొలగింపు?**
**గద్వాలలో కలకలం.. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు**





గద్వాల మే 12 (వుదయం ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్ భూములపై ఆక్రమణ యత్నాలు కలకలం రేపుతున్నాయి. రైల్వే స్టేషన్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని లక్ష్యంగా చేసుకున్న కొందరు వ్యక్తులు, మెయిన్ రోడ్డు ఫేసింగ్ కోసం ప్రభుత్వ ప్రహరీ గోడను తొలగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.స్థానికుల కథనం ప్రకారం.. గతంలో మార్కెట్ యార్డ్ వెనుక భాగంలో తక్కువ ధరకే స్థలాలు కొనుగోలు చేసిన కొందరు, ఇప్పుడు తమ స్థలాలకు నేరుగా ప్రధాన రహదారి కనెక్టివిటీ కల్పించుకునేందుకు ప్రభుత్వ గోడను కూల్చివేసినట్లు చెబుతున్నారు. గోడ తొలగిపోవడంతో లోపల ఉన్న ప్రైవేటు స్థలం నేరుగా రైల్వే స్టేషన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న కమర్షియల్ స్థలంగా మారిందని సమాచారం.కోట్ల విలువ పెంచుకునే యత్నమా?గద్వాల రైల్వే స్టేషన్ రోడ్డులో భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో, మెయిన్ రోడ్డు ఫేసింగ్ ఉన్న స్థలాలకు అధిక డిమాండ్ నెలకొంది. ఈ పరిస్థితిని అవకాశంగా మార్చుకుని కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ తమ ఆస్తుల విలువను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.డ్రైనేజీ నుంచి గోడ కూల్చివేత వరకు..ఈ వ్యవహారం ఒక్కరోజులో జరిగినది కాదని స్థానికులు అంటున్నారు. గతంలో అనుమతులు లేకుండా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టినా అధికారులు పట్టించుకోలేదని,అదే నిర్లక్ష్యం ఇప్పుడు ప్రభుత్వ ప్రహరీ గోడ తొలగింపుకు దారి తీసిందని ఆరోపిస్తున్నారు. అధికారులపై అనుమానాలుఅత్యంత రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై ప్రభుత్వ గోడ తొలగించినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మార్కెట్ కమిటీ అధికారులు, రెవెన్యూ యంత్రాంగం ఈ వ్యవహారంపై ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.తక్షణ చర్యలు తీసుకోవాలిప్రభుత్వ భూములను కాపాడేందుకు జిల్లా అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. కూల్చివేసిన ప్రహరీ గోడను పునర్నిర్మించడంతో పాటు, ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ ఆస్తులను రక్షించడంలో అధికారులు విఫలమైతే భవిష్యత్తులో మరిన్ని ఆక్రమణలకు అవకాశం ఉంటుందని గద్వాల పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి



**అదనపు కలెక్టర్ మధుమోహన్**

గద్వాల మే 12 (వుదయం ప్రతినిధి)

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు లేకుండా మిల్లర్లు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ (రెవిన్యూ)అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ రైస్ మిల్లర్లతో సమావేశమై మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడకుండా సకాలంలో మిల్లులకు ధాన్యం తరలిస్తామని, ఇందుకు మిల్లర్లు సహకరించాలన్నారు. ప్రతి మిల్లు వద్ద ధాన్యం దించేటప్పుడు పర్యవేక్షణ సిబ్బందిని నియస్తామన్నారు. తప్పులు చేసినప్పుడు మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాంటి పరిస్థితులు రానివద్దన్నారు. నిబద్ధతతో వ్యవహరిస్తే మిల్లర్లకు ఎలాంటి సమస్యలు రావన్నారు. మిల్లర్లు తెలియజేసిన సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు రామలింగేశ్వర్ కామ్లే, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

## ప్రతి గింజ కొనాలిరైతులకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా

- ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చూడాలి
- జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు



నాగర్ కర్నూల్ మే 12 (వుదయం ప్రతినిధి)

రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా కొనుగోలు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ సీఎం క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వరి, మొక్కజొన్న ధాన్యం సేకరణపై ముఖ్యమంత్రి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నాగర్కర్నూల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అదనపు కలెక్టర్ అమరేందర్, సంబంధిత శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. కొల్లాపూర్ నుంచి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై నాగర్కర్నూల్, వనపర్తి జిల్లాల్లో కొనుగోలు ప్రక్రియపై జరిగిన సమీక్ష వివరాలను సీఎంకు తెలియజేశారు. హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసినట్లు, సమస్యలు తలెత్తిన వెంటనే ఆ గ్రూపుల ద్వారా స్పందించి పరిష్కరించేలా వ్యవస్థను సిద్ధం చేసినట్లు మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సీఎంకు తెలిపారు గత పది రోజులుగా జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో విస్తృత తనిఖీలు ప్రతి కేంద్రానికి ప్రత్యేక అధికారి నియామకం.

సమస్యల పరిష్కార బాధ్యత పూర్తిగా ఆయనదే అని అన్నారు నాగర్కర్నూల్ మార్కెట్ యార్డును ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన. రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుని తక్షణ పరిష్కారం హమాలీలు, లారీల కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక. ధాన్యం తరలింపులో జాప్యం లేదు తేమ పరీక్షలు, తూకం, చెల్లింపుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం రైతులకు 48 గంటల్లోనే బ్యాంకు ఖాతాల్లోనేరుగా నగదు జమ.ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ పౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

రైతులకు మద్దతు ధర సకాలంలో అందేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## వైభవంగా సైన్స్ బ్లాక్ ప్రారంభోత్సవం!

**...పాల్గొన్న కార్పొరేషన్ చైర్మెన్ లు కాల్వ సుజాత, మెట్టు సాయి కుమార్**



సంగారెడ్డి వుదయం

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (TGIIC) చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం(కోటి ఉమెన్స్ కళాశాల) లో నూతనంగా నిర్మించిన సైన్స్ బ్లాక్ ను ప్రారంభించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి తో పాటు కార్పొరేషన్ చైర్మెన్ లు కాల్వ సుజాత, మెట్టు సాయి కుమార్ లు పాల్గొన్నారు. హైదరాబాద్లోని చారిత్రాత్మక కోటి మహిళా విశ్వవిద్యాలయంలో నూతన సైన్స్ బ్లాక్ను TGIIC చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. మహిళా విద్యార్థినులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించే లక్ష్యంతో, ఈ నూతన బ్లాక్లో ఆధునిక ల్యాబ్ సదుపాయాలు ఏర్పాటు చేశారు.కోటి ఉమెన్స్ కాలేజీని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మారుస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఈ మార్పులో భాగంగానే కళాశాలలో విద్యా ప్రమాణాలను పెంచడానికి కొత్త భవనాల నిర్మాణాలను చేపడుతున్నారుఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినుల అభివృద్ధికి మరియు మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రాముఖ్యతను వివరించారు.

మహిళా విద్యలో కోటి ఉమెన్స్ కళాశాలకున్న విశిష్ట చరిత్రను గుర్తుచేశారు.

ప్రభుత్వం మహిళా విశ్వవిద్యాలయంగా దీనిని అప్గ్రేడ్ చేయడం ద్వారా మరిన్ని నిధులు, మౌలిక వసతులు సమకూరుస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మెన్ లను వైస్ ఛాన్సలర్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, రిజిస్ట్రార్ మరియు ఇతర బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



## వైభవంగా త్రిదేవ మూర్తుల బ్రహ్మోత్సవాలు!

వికారాబాద్: మే 12 (వుదయం బొంరాస్ పేట):

బొంరాస్ పేట్ మండలం బోట్లవాని తండా గ్రామ పంచాయతీ లోని శ్రీ మాత మారెమ్మ, సేవాలాల్ మహారాజ్, ఆంజనేయస్వామి వారి 18వ బ్రహ్మోత్సవాలు నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా మూడవరోజు స్వామి వారికి ఆలయ ధర్మ కర్తలు మరియు అర్చకులు భక్తి శ్రద్ధలతో మంగళ హారతి, నేవిద్యం, పల్లకి సేవ ,ఊరేగింపు, తదితర కైంకర్యాలు జరిపారు.భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు .

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చందర్ నాయక్, శంకర్ నాయక్, ఆలయ పూజారి సత్యనారాయణ జోషి, తాండ ఆలయం పూజారి రవి నాయక్ , దేశ్యా నాయక్, మరియు తండా సర్పంచ్ బాలు నాయక్, ఉప సర్పంచ్ రవి నాయక్, మరియు ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు పార్టీ అధ్యక్షులు కోట్ల యాదగిరి, రైతు సమన్వయ కమిటీ మహేందర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, శ్రావణ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ తిరుపతయ్య,మల్లేష్ గౌడ్, ఉపాధ్యక్షులు నెహ్రూ నాయక్, మరియు తండావాసులు కాలు నాయక్, కిషన్ నాయక్, సూర్య,రాజు, ఫుల్ సింగ్, రమేష్, గోపాల్,నాని, రాహుల్ ,శంకర్, విజయ్ , హనుమంతు, నరేష్, తండావాసులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు*

## విద్యార్థులకు నగరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సన్మానం



మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి

నిజాంపేట మండలం నగరం గ్రామ పంచాయతీ కార్యాలయం యందు గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల సురేష్ బాబు మరియు గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో పదవ తరగతిలో 500 పైన మార్కులు సాధించిన14 మంది విద్యార్థులకు మెమెంటో మరియు శాలువలతో సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, ఉప సర్పంచ్ గుగ్లోత్ నాజం, వార్డు మెంబెర్స్ లక్ష్మణ్, లావణ్య,విజయ, కనకవ్వ మరియు సుభాష్ మరియు విద్యార్థులు మరియు తల్లి తండ్రులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది నర్సింలు,తులసీరాం లుపాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

* భక్తిశ్రద్ధలతో అమ్మవారి కల్యాణ మహోత్సవం
* కుకునూర్ పల్లిలో గత ఇరవై రోజులుగా వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
* కుకునూర్ పల్లి, 12 మే 2026 : నేటి శుభోదయ



సిద్దిపేట జిల్లా (వుదయం ప్రతినిధి)

కుకునూర్ పల్లి గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. గత మంగళవారం ప్రారంభమైన ఈ వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వార్షికోత్సవాల్లో భాగంగా వారం రోజులుగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మహర్షిల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు భూరమైన నర్సింలు గౌడ్, సర్పంచ్ మల్లం కనుకవ్వ ఐలయ్య, మాజీ సర్పంచ్ జయంతి నరేందర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరి సహకారంతో వార్షికోత్సవ వేడుకలు దిగ్విజయంగా జరిగాయని తెలిపారు. అమ్మవారి కృపతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. గత ఇరవై రోజులుగా కుకునూర్ పల్లి గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. కురుమల కులదైవం శ్రీ బీరప్ప కామరతి దేవతల కల్యాణం, అలాగే బొడ్రాయి పండగ, ఇలా వరుస పండగలతో గ్రామం కోలాహలంగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పాల శేఖర్ గౌడ్, కోశాధికారి శివలింగ ప్రభాకర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు పాల సంతోష్ గౌడ్, మాందాల మహేష్ గౌడ్, సాదిపల్లి రాజు గౌడ్, కుకునూర్ పల్లి గౌడ సంఘం సభ్యులు, యువకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి



**అదనపు కలెక్టర్ మధుమోహన్**

గద్వాల మే 12 (వుదయం ప్రతినిధి)

వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా సజావుగా కొనుగోలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు విషయంపై మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులతో, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచుల కొరత లేకుండా, రవాణా, హమాలీల, తదితర సమస్యలను పరిష్కరించా లన్నారు. కొనుగోళ్ల విషయంలో ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు బాధ్యత వహించాలన్నారు. కొనుగోలు కేంద్రాలవద్దరైతులు వేచి ఉండే పరిస్థితి లేకుండా త్వరితగతిన ధాన్యమును కొనుగోలు చేయాలన్నారు. తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకుండా ఇబ్బంది పెట్టే మిల్లర్స్, కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ వీసీ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ గోదాములు సరిపోకుంటే ప్రైవేట్ గోదాములను కూడా అద్దెకు తీసుకొని ధాన్యాన్ని భద్రపరచాలన్నారు. అవసరమైతే రైతు వేదికలు,ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా సంబంధిత జిల్లా అధికారులు ధాన్యం కొనుగోలు విషయంలో బాధ్యత వహించాలని, నిబద్ధతతో పనిచేసి రైతులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా చూడాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, డిఏఓ వీరప్ప, సక్రియ నాయక్, మార్క్ఫెడ్ డీఎం చంద్రమౌళి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నర్సింగ్ దినోత్సవం

**ఆరోగ్య సేవలో ఆసుపత్రికి వెన్నుముక లాంటివారు నర్సులే.... సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్...**



నాగర్ కర్నూల్ మే 12 (వుదయం ప్రతినిధి)

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం పురస్కరించుకొని ఆసుపత్రి ఆవరణలో తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని సమావేశపు హాల్ లో వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

ప్రతి ఆసుపత్రిలో వైద్యులు సూచించిన ఆరోగ్య సేవలు అందించుటలో ప్రధాన పాత్ర పోషిస్తున్న నర్సులే ఆసుపత్రికి వెన్నుముక లాంటి వారని ఆయన అభివర్ణించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినోత్సవాన్ని నర్సింగ్ దినోత్సవంగా జరుపుకోవాలని ఆనవాయితీగా వస్తుందని అన్నారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రారంభమై 4 సంవత్సరాలలో రోగి సేవలో గణనీయమైన ప్రగతి సాధించుటలో నర్సుల పాత్ర కీలకమని అన్నారు.క్లాస్మేట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నర్సింగ్ అధికారులనుశలువాలతో ఘనంగా సన్మానించారు. క్లాస్మేట్ క్లబ్ ద్వారా 365 రోజులు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని విద్య, వైద్య,వైజ్ఞానిక.

సామాజిక,ఆధ్యాత్మిక సేవలో ముందుంటున్నామని క్లాస్మెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు వాస రాఘవేందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ అజీమ్,నర్సింగ్ సూపర్డెంట్ మంజుల ,పేర్సి సుమన్,నాగవేణి,పద్మ, సునీత, తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు జానకి దేవి కార్యదర్శి ఎం.ఆనంద్, జోనల్ అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి,కెశవ్, రాజు,హరి,సాయి, హరికృష్ణ, మరియమ్మ. పుష్పలత, సరస్వతి, రూప, నిర్మల, సునిత, సువేద,పద్మ,కవిత క్లాస్మేట్ క్లబ్ సభ్యులు పోలా శ్రీనివాసులు, కే.పి.ప్రసాద్, చిగుళ్లపల్లి రమణ కుమార్,మల్లేష్, రామచంద్రయ్య,యాదగిరి, నర్సింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉదండాపూర్ ఆర్ అండ్ ఆర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా నిర్వాసితులను వెంటనే పునరావాస కాలనీలోకి తరలించాలి ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి**



మహబూబ్ నగర్ మే12 (వుదయం ప్రతినిధి)

ఉదండాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితుల పునరావాసం (ఆర్అండ్ఆర్) పనులను వేగంగా పూర్తి చేసి నిర్వాసిత కుటుంబాలను వీలైనంత త్వరగా పునరావాస కాలనీలోకి తరలించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు చిన్నగుట్ట తండా, రేగడిపట్టె, తండా తుమ్మలకుంట తండా, శామగడ్డ తండా, పోలేపల్లి హామ్లెట్ల నిర్వాసితులకు సంబంధించిన పునరావాస పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ పునరావాస కాలనీలో పెండింగ్లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ నిర్మాణ పనులకు ఎండోమెంట్స్ శాఖ నుంచి అవసరమైన డిజైన్ అనుమతులు తీసుకుని పనులను ప్రారంభించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం, అంతర్గత రహదారులు, విద్యుత్ సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పునరావాస కాలనీలో అన్ని సౌకర్యాలు సిద్ధం చేసి నిర్వాసితులు తమకు కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం అధికారులు తరచూ గ్రామాలను సందర్శించి నిర్వాసిత కుటుంబాలతో మాట్లాడి చిన్నచిన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని ఆదేశించారు.ఇండ్ల నిర్మాణ అనుమతులు, నిర్వాసితులతో అవసరమైన వారికి బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం ఏర్పాటు చేసే విధంగా సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందే వీలుగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఉదండపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో దేవాలయ నిర్మాణ పనులను దేవాదాయ ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి నిర్వాసితులను కాలనీలోకి తరలించాల్సిన అవసరం ఉందన్నారు.మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితుల తరహాలో ప్లాట్లను లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేస్తే వారు ఇళ్ల నిర్మాణానికి ముందుకు వస్తారని సూచించారు.

రోడ్లు, ఆలయాలు, అంగన్వాడీ భవనాలు, పాఠశాలలు, మిషన్ భగీరథ పైప్లైన్లు, విద్యుత్ సదుపాయాలు వంటి పెండింగ్ మౌలిక వసతుల పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు.ప్లాట్ల కేటాయింపులు,పరిహార చెల్లింపుల విషయంలో వివాదాల కారణంగా పెండింగ్లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ను కోరారు. పునరావాస కాలనీ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ను నాగసాలకు తరలిస్తే నిర్వాసితులు కాలనీలోకి రావడానికి ఆసక్తి చూపుతారని సూచించారు. జడ్చర్ల మండలం,మున్సిపాలిటీ లో తాగునీటి సమస్యపై మాట్లాడుతూ, వేసవిలో ప్రస్తుత సరఫరా సరిపోవడం లేదని పేర్కొన్నారు. మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులు నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలు, వాటిపై రియల్ ఎస్టేట్ లేఅవుట్లు వేస్తున్నారనే ఫిర్యాదులపై విచారణ జరపాలని కోరారు. బాలానగర్ మండలంలో వాగు ఆక్రమణ చేసి మళ్లించిన ఘటనపై కూడా విచారణ జరపాలని సూచించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, డి . ఆర్.ఓ రామ్రెడ్డి, ఆర్ .డి.ఓ నవీన్, భూ రికార్డుల సర్వే ఎ . డి అశోక్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్,విద్యుత్ శాఖల ఈఈలు, డీఈలు, ఉదండపూర్, వల్లూరు సర్పంచులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల ఆత్మీయ సభను విజయవంతం చేయండి



**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

**ఖమ్మం వుదయం బ్యూరో మే 12**

జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షు లు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రి పదవి చేపట్టి 40 ఏళ్ళు పూర్తవుతున్న సందర్భం గా రేపు ది 13052026 న సాయంత్రం 05.00 గంటలకు ఖమ్మం నగరం లోని ఎస్ ఆర్ అండ్ బీ జీ ఎన్ ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారి ఆత్మీయ సభను విజయవంతం చేయాలని జిల్లా శ్రే ణులనుకోరారు.అదే విధంగా వారు అభి వృద్ధికి మారు పేరు అని కొనియాడారు. అనంతరం నగర కాంగ్రెస్ కమిటి అధ్య క్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడు తూ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ జీవితంలో ప్రజాసేవ,అభివృద్ధి , రైతు సంక్షేమం కోసం కృషి చేశారని వారి ఆత్మీయ సభను విజయవంతం చేయాలని నగర కాంగ్రెస్ శ్రేణులను కోరారు.

అనంతరం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ తుమ్మల నాగేశ్వర రావు రాజకీయ దురంధరుడని,40 ఏళ్ళ రాజకీయ ప్రస్థానంలో అనేక ఒడిదుడుకు లు ఎదుర్కొని అభివృద్దే ధ్యేయంగా పనిచే సిన అలుపెరుగని యోధుడని కావున ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయ వంతం చేయాలని కోరారు.అనంతరం జిల్లా రైతు కన్వీనర్ నల్లమల వేంకటేశ్వ రరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా లు మాట్లాడుతూ రేపటి తుమ్మల నాగేశ్వరరావు ఆత్మీయ సభను విజయ వంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఏ ఐ సి సి సేవాదళ్ కో ఆర్డినేటర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాపై ఉక్కుపాదం. చెక్‌పోస్ట్ తనిఖీలు ఎస్పీ నరసిం ఐపీఎస్



**వుదయం సూర్యాపేట మే: 12**

"పశువుల అక్రమ రవాణా, ఇసుక, వరి ధాన్యం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా పోలీసు శాఖ పటిష్ట నిఘా ఉంచింది" అని సూర్యా పేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. సోమవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి జాతీయ రహదారి 65పై టేకుమట్ల వద్ద గల అంతర్ జిల్లా చెక్ పోస్ట్‌ను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి వాహనాల తనిఖీలను, చెక్ పోస్ట్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "అక్రమ రవాణా నిర్మూలన లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాలలో అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం.

ఈ చెక్ పోస్టుల ద్వారా 24 గంటలు విస్తృతంగా తనిఖీలు ని ర్వహిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. అసాంఘిక కార్య కలాపాలు, అనుమానిత వ్యక్తుల కద లికలపై పూర్తిస్థాయి నిఘా ఉంచాం" అని అన్నారు.

"ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడి తే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు వ్యవ సాయ అవసరాల నిమిత్తం సంతలో కొనుగోలు చేసిన పశువుల రవాణా చేస్తే సంత అధికారులు, పశువుల వైద్యుల అనుమతి పత్రాలు వెంట తీ సుకువెళ్ళాలి" అని సూచించారు.

సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు పాటించా లని, తనిఖీల సమయంలో సిబ్బంది స్వీయ రక్షణ జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు.

ఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై బాలు నాయక్, చెక్ పోస్ట్ విధులు నిర్వ హణ సిబ్బంది, జాతీయ రహదారుల సిబ్బంది ఉన్నారు.

# ఆంజనేయుడి సేవలో అరటి పండ్ల వితరణ.. శ్రీ వాసవి సేవాసమితి ఆధ్యాత్మిక సేవ




**వుదయం సూర్యాపేట మే: 12**

హనుమజ్జయంతి సందర్భంగా సూ ర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ రోడ్డులో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దే వాలయంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుండే పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తుల కు అరటి పండ్లు పంపిణీ చేశారు. శ్రీ వాసవి సేవాసమితి అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ "శ్రీ వాసవి సేవా సమితి స్థాపించిన కొద్ది రోజుల్లోనే ఎన్నో సేవలు అందించాం.

అందులో భాగంగానే హనుమజ్జ యంతి సందర్భంగా భక్తులకు అరటి పండ్లు పంపిణీ చేశాం"అని తెలిపారు. "సమాజ, ఆధ్యాత్మిక సేవలో భాగస్వా మ్యం కావాలని అనుకునే భక్తులు శ్రీ వాసవి సేవాసమితిలో సభ్యులుగా చేర వచ్చు"అని పిలుపునిచ్చారు.

# జిల్లా రైతులు, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు



**నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

**నల్గొండ జిల్లా**

**వుదయం ప్రతినిధి మే 13**

నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో రైతులకు జరుగుతున్న అన్యాయాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించిన నకిరేకల్ మాజీ ఎమ్మె ల్యే చిరుమర్తి లింగయ్య , జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, బిఆ ర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తు న్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా నిర్వహించి, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు జరుగుతున్న అన్యాయాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత నెల రోజులుగా జిల్లాలోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంద ర్శిస్తూ రైతులు ఎదుర్కొంటున్న సమ స్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నాను.. రైతులు తీవ్ర ఇబ్బందులు, ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నారుప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లలో అనేక సమస్యలు చోటుచేసు కుంటున్నాయిధాన్యం తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేక పోవడంతో కొనుగోలు కేంద్రాల్లో వద్దు రోజుల తరబడి పేరుకుపోతున్నాయిరైతు లు తీసుకొచ్చిన వడ్లలో అధికంగా తేమ, నాణ్యత పేరుతో అనవసర కోతలు విధి స్తున్నారుదళారులు రైతులను భయపెట్టి తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసి అధికంగా డబ్బులు దండుకుంటున్నారు కాంటాలు సకాలంలో జరగక రైతులు ఎండలో, వర్షంలో రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది మార్కెట్ యార్డుల్లో కాంగ్రెస్ నాయకులు మరియు వారి అనుచరులు పెత్తనం చెలాయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలిదే శానికి అన్నం పెట్టే రైతన్నను ఇబ్బందుల కు గురిచేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నాముసానుకూలంగా స్పందిం చిన జాయింట్ కలెక్టర్ 15 రోజుల్లోపు ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు




**డిసిహెచ్ మాతృనాయక్**

**నల్గొండ జిల్లా**

**వుదయం ప్రతినిధి మే 13**

నల్గొండ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్స్ ది నోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు స్థానిక జిజిహెచ్ లోని అంతర్జా తీయ నర్సింగ్ వేడుకలను నర్సింగ్ సూపరింటెంట్ నీలి భాయ్ సుజాత రేణుక దేవి ఆధ్వర్యంలో ఒకరోజు నర్సుల దినోత్సవం పునస్కరించుకొని ప్ర భుత్వ ఆసుపత్రిలో చేస్తున్న నర్సులు అందర్నీ ఒక వేదికపై పరిచయం చేసి ఇన్ని రోజులు వాళ్ళు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆటపా టలతోకేక్ కటింగ్ చేస్తూ నిత్యం చేస్తూ సంతోషంతో ఒకరోజు నర్సింగ్ రోజు ఉందని గుర్తు చేస్తూఉత్తమ నర్సులకు బహుమతులు శాలువాలతో సత్క రించి రాబోయే రోజులలో రోగులకు మంచి సేవలు అందించాలని సమ యపాలనలతో ఉద్యోగరీత్యా విధులు నిర్వహించి మంచి పేరు ప్రఖ్యాతలు తె చ్చుకోవాలని సమాజంలో నర్సులకు ఒక ప్రత్యేకమైన రోజు ఉందని గుర్తు చేస్తూ రోగి సదుపాయాలు అందిస్తూ ప్రతిరోజు వాళ్లు కూడా రోగులకు కావలసిన సేవలందిస్తూ మంచి మనసుతో వాళ్ల కుటుంబ సభ్యులు ఒకరిగా చూసుకుంటూ మంచి పలక రింపుతో సేవాభావంతో నర్సింగ్ అనే వృత్తిని చేపడుతున్నందుకు డి సి హెచ్ మాతృనాయక్ కొనియాడారు ఈ కా ర్యక్రమంలో పాల్గొన్న వారు సి ఎస్ ఆర్ ఎం చంద్రశేఖర్ స్టాఫ్ నర్స్ లు నర్సులు తోటి ఉద్యోగస్తులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సాయి భగీరథ్ ని వెంటనే అరెస్టు చెయ్యాలి



**చర్ల మే 12. వుదయం ప్రతినిధి**

బిఆర్ఎస్ పార్టీ చర్ల కమిటీ ఆధ్వర్యం లో మెయిన్ రోడ్డు సెంటర్ లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. బండి. సంజయ్ కుమార్ ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవి నుండి తొల గించాలని. అతని కుమారుడు సాయి భగీరథ్ వెంటనే అరెస్టు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు

ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మా ట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి బండి. సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనా చర్యలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండల కన్వీనర్ దొడ్డి తాతారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు..

ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు ఎస్ డి అజీజ్, కాకి అనిల్, తడికల బుల్లబ్బాయి, కొం బత్తిని రాంబాబు, అంబోజి సతీష్ తదితరులు పాల్గొన్నారు

# బండి సంజయ్ తనయుడు సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలి




**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌ను భర్తరఫ్ చేయాలి**

**ఎస్ఎఫ్ఐ డిమాండ్**

**బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**భద్రాచలం 12/05/**

**వుదయం ప్రతినిధి**

భద్రాచలం పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై నమోదైన ఆరోపణల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎ ఫ్ఐ టౌన్ సెక్రటరీ కొప్పుల రవీందర్ మాట్లాడుతూ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ ను తక్షణమే అరెస్టు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ పదవులు మరియు అధికార ప్రభావంతో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరిగితే ప్రజా స్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కోల్పోయే పరిస్థితి వస్తుందని అన్నారు .ఈ ఘటనపై పోలీసులు రాజ్యాంగబ ద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిం చాలని రవీందర్ కోరారు. బాధిత కు టుంబాన్ని ఒత్తిళ్లకు గురి చేస్తున్నారనే సమాచారం వెలుగులోకి వస్తోందని, వారికి తక్షణమే రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిం దితుడిని కాపాడేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తూ కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నా యని ఆరోపించారు. బాధిత యువతి తన భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసిందని, ఆమెకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.బండి సాయి భగీరథ తన తండ్రి కేంద్రంలో ఉన్న ఉన్నత పదవిని అడ్డంగా పెట్టుకొని విద్యాసంస్థల్లో ర్యాగింగ్, భౌతిక దాడులు, మద్యం మత్తులో విద్యార్థులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని ఎస్ఎఫ్ఐ నాయ కులుఆరోపించారు. . కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, కిషోర్, సాయికుమార్, హేమంత్, కిరణ్ కుమార్, నరసింహ, వివేక్‌వర్ధన్, సూ ర్యకుమార్ పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ భక్తాంజనేయ హనుమాన్ జయంతి



**బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ అధ్యక్షులు గోలి మధుసూదన్ రెడ్డి 48 వ కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్ గౌడ్**

**నల్గొండ జిల్లా**

**వుదయం ప్రతినిధి మే 13**

నల్గొండ పట్టణ కేంద్రంలో శ్రీశ్రీశ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థా నం సతీష్‌నగర్ కాలనీ బస్టాండ్ పక్కన నల్గొండశ్రీ హనుమాన్ జయంతి సం దర్భంగా సతీష్ నగర్ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై తెల్లవారుజాము నుంచి అభిషేకాలు హోమాలు భక్తిశ్రద్ధ లతో నిర్వహించడం జరిగింది అదేవి ధంగా వచ్చిన భక్తులందరికీ అన్నదా నం చేపట్టడం జరిగింది ఇట్టి కార్యక్ర మానికి బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ అధ్యక్షులు గోలి మధుసూదన్ రెడ్డి గారు టూ టౌన్ పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకటేష్‌గారు పబ్బు మౌనిక నరేందర్ గౌడ్ గారు గుడి కమిటీ సభ్యులు అక్కె నపల్లి శ్రీనివాసులు చెదల రమణ గౌడ్ గారు బండారు శంకర్ గౌడ్ చోళ్ళేటి వెంకటాచారి గారు రవీంద్ర చారి, స్వామి మరియు చెదల నిఖిల్ గౌడ్, పండు, బంటి నగర ప్రజలు మరియు భక్తులు పాల్గొన్నారు

# ఏజన్సీ లో ఇసుకాసుర రాజ్యమేలు తుంది



**చర్ల మే 12.05.వుదయం ప్రతినిధి**

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇసుకాసురులు రాజ్యమేలుతున్నారని ఆదివాసి హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇర్ప. రాజు దొర ప్రభుత్వాన్ని విమర్శించారు. మంగళవారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. చర్ల మండలం కలివేరు గ్రామపంచాయతీలో ఇసుక రీచ్ కోసం ఎంపీ, ఎమ్మెల్యేల వర్గాలు తీవ్రంగా పోటీ పడుతున్నారన్నారు. ఇసుక రీచ్ పొంద డానికి గ్రామస్తులు మధ్య తగాదాలు సృ ష్టిస్తున్నారని ఆరోపించారు. ఇసుక రీచ్ వస్తే గ్రామంలోని ఆదివాసీ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్న దన్నారు. గిరిజనులు రెండు గ్రూపులుగా ఏర్పడి పరస్పరం తగాదాలు పడే పరిస్థితి కలివేరులో నెలకొన్నదని దీనికి కారణం ఎంపీ, ఎమ్మెల్యే ల అనుచర గణమేనన్నా రు. ఇసుక సంపదపై కన్నేసిన బడాబా బులు ఆదివాసీ ప్రజలను అమాయకు లను చేసి ఆడిస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సొసైటీలు ఏర్పాటు చేసి ఇసుక రీచ్ లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత పాలకులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని, అవినీతిపరులకు కొమ్ముకాస్తూ నిజమైన ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఆదివాసీలకు అన్యాయం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సీతారామ భూ నిర్వాసితులకు సబ్ కలెక్టర్ హామీ




**చర్ల మే 12.05.వుదయం ప్రతినిధి**

సత్యనారాయణపురం రైతు వేదిక లో సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆధ్వర్యంలో సీతా రామ ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో మాట్లాడుతూ ప్రాజెక్టు లో భూములు కోల్పోయిన నిర్వాసితుల ప్రభుత్వం నిభంధనల ప్రకారం ఎకరా నికి 11.80 లక్షల రూపాయల వరకు ఇవ్వడం జరుగుతుంది అని రైతులకు తెలిపారు. దీనిపై ఏమైనా రైతులకు వ్యక్తిగత సమస్యలు ఉంటే నేరుగా తహసీ ల్దార్ ని సంప్రదించాలని సూచించారు. భూములు కోల్పోయిన రైతులు మాట్లా డుతూ చర్ల ప్రాంతంలో ఉన్న భూములు చాలా సారవంతమైన భూములని అలాంటి భూముల ధర ఎకరాకు సుమారుగా 25 లక్షల నుంచి 30 లక్షల రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని సబ్ కలెక్టర్ ని కోరిన రైతులు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ తన పరిధిలో ఉన్న విషయం చెప్తానని ఈ విషయమై పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు

## అనుమతి లేని హాస్పిటళ్లు, స్కానింగ్

# సెంటర్లపై ఉక్కుపాదం... సీల్ చేస్తాం




**వుదయం సూర్యాపేట: 12**

"జిల్లాలోని అన్ని అల్లోపతి, ఆయుర్వేద, యునానీ, హోమియో ప్రైవేట్ ఆసుపత్రు లు జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ అనుమతి పొందిన తర్వాత మాత్రమే సేవలు అందించే అవకాశమున్నది" అని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా. పెండెం వెంకట రమణ, ఎండిడిపి డిసి హెచ్ఓ స్పష్టం చేశారు. అనుమతి కోరకు దర ఖాస్తు చేసుకున్న వారికి దరఖాస్తు పరిశీలన అనంతరం తాత్కాలిక అనుమతి ఇవ్వడం జరుగుతుంది రెన్యువల్ కొరకు దరఖాస్తు చేసిన వారికి సి ఈ ఏ పూర్తి సర్టిఫికెట్ మరియు జిల్లా ప్రైవేట్ ప్రాక్టీసు ఆమోదం పొందిన తర్వాత మాత్రమే రిజిస్ట్రేషన్ ఇవ్వబడుతుంది అనుమతి లేని ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలు, స్కానింగ్ కేంద్రాలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి జీ.ఓ నంబర్ 119, తేదీ 13.04.2006 ప్రకారం ప్రభు త్వ వైద్యులు, ప్రభుత్వ విదుల అనంతరం ప్రైవేట్ ప్రాక్టీస్ చెయ్యడానికి అనుమ తుల ఉత్తర్వులు జారీ చేయబడ్డాయని, జీ.ఓ నంబర్ 465, తేదీ 16.10.1998 ప్రకారం వైద్య సేవలలో లోపం వలన అంగవైకల్యం కాని, మరణం కాని సం భవించిన ఎడల బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ కమిటీ ద్వారా విచారణ చేయుటకు ఉత్తర్వులు జారీ చేయబడ్డాయ ని తెలిపారు. "రిజిస్ట్రేషన్ పొందిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ లు ప్రభుత్వ నిబంధనలు మరియు సూచనలను పాటిస్తూ తమ సేవలను అందించాలి" అని డి ఎం హెచ్ ఓ ఆదేశించారు.

# నిభందనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

**చర్ల మే 12.05.2026 వుదయం ప్రతినిధి**

పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చర్ల సీఐ ఏ రాజు వర్మ హెచ్చరించారు. మం గళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, ఈవో, వెటర్నరీ డాక్టర్, పశువుల వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బక్రీద్ పండుగ వరకు పశువుల రవాణా చేయవద్దని ఈ సందర్భంగా సిఐ సూచించారు. తర్వాత వేలంపాట నిబంధనలను పాటించి సరైన పత్రాలతో పశువుల రవాణా చేసుకోవచ్చని అన్నారు. పశువుల అక్రమ రవాణా చేసే వారి పట్ల గ్రామపంచాయతీ, సంవ ర్ధక శాఖ అధికారులు దృష్టిసారించి పోలీస్ శాఖకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహ రించి ఎవరైనా బక్రీద్ పండుగ వరకు పశువుల అక్రమ రవాణా జరిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. . ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఆర్ నర్సిరెడ్డి, పి కేశవ్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, సెక్రటరీ తోకల సురేష్, వెటర్నరీ డాక్టర్ కే సుధారాణి, అసిస్టెంట్ హరికాంత్ పలువురు పశువుల వ్యాపారులు పాల్గొన్నారు.

# భక్తిప్రపత్తులతో మారుతీ నామస్మరణ

## ఘనంగా హనుమాన్ జయంతి



**చండూరు,మే 12 (వుదయం):**

మండల కేంద్రంతో పాటు మున్సి పాలిటీ పరిధిలోని అంగడిపేటలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం కన్నుల పండువగా జరిగాయి. ముఖ్యంగా అంగడిపేటలో ని శ్రీ చింతాల ఆంజనేయ స్వామి దే వాలయాన్ని పూలమాలలు, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జయంతిని పురస్క రించుకుని ఆలయ అర్చకులు, కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభి షేకాలు, ఆకుపూజ, పుష్పార్చనలు ని ర్వహించారు. భక్తుల 'జై హనుమాన్' నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అదేవిధంగా పెరు మాళ్ల అభయ ఆంజనేయ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. దర్శనానికి వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్ర సాదాలు అందజేయగా, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భారీగా అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద చల్లని మజ్జిగ పంపిణీ చేసి దాహార్తిని తీర్చారు. ఈ వేడుకల్లో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నా రు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కమిటీ సభ్యులు చేసిన ఏర్పాట్లపై అందరూ హర్షం వ్యక్తం చేశారు.

## అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకొని ట్రస్టు చే సన్మానం




**వరంగల్,మే12(వుదయం):**

రామన్నపేటలోని డాక్టర్ ఏ రాజేంద్ర ప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకు రాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పు రస్కరించుకొని ,ఈరోజు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరుపుకో వడం జరుగుతున్నది. ఈ సందర్భంగా ట్రస్ట్ చే ఘనంగా శాలువాతో మరియు బొకేతో సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా మేనేజ ఇంట్రెస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మన నర్సులు, మన భవిష్యత్తు, సంరక్షణ యొక్క ఆర్థిక శక్తి మానవతా సేవలో మార్గదర్శకులైన నర్సులకు వందనం. ప్రజా ఆరోగ్య సంరక్షణలో వారి సేవలు అద్భుతం. ప్రాణం పోసేది డాక్టర్ అయినా ఆ ప్రాణాన్ని కంటికి రెప్పలా కాపాడేది వీరే. నిస్వార్థ సేవకు, అంకిత భావానికి శిరస్సు వంచి నమస్కరిస్తు న్నాం. ప్రపంచ అందరికీ వందనం. నర్సులను ఘనంగా శాలువా మరియు బొకేతో సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ రాజేంద్రప్రసా ద్, సీనియర్ జర్నలిస్ట్ క్రాంతి కుమార్ , ఆర్గనైజర్ శ్రావణ్ ,చిలకపల్లి భవాని, ఉప్పాల శారద లను వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యా వైద్యం ప్రభుత్వ ఉద్యోగులకు నూతన బస్ సర్వీస్ ప్రారంభం






**దమ్మపేట మే 12**

**(వుదయం ప్రతినిధి):**

కాంగ్రెస్ ప్రభుత్వం లోనే పల్లె రవాణా మెరుగుపడుతుంది ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక కృషితో అశ్వారావుపేట మండల గ్రామీణ ప్రజలకు మరింత రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది మంగళ వారం అశ్వారావుపేట బస్ డిపోలో కొత్తగూడెం అశ్వారావుపేట నూతన బస్ సర్వీస్‌ను ప్రారంభించారు ఈ సర్వీస్ ములకలపల్లి, జగన్నాధపురం, గండిముత్యాలమ్మ ఆలయ ప్రాంతం మీదుగా రెడ్డిగూడెం, తిరుమలకుంట, వినాయకపురం వైపుగా ప్రయాణిస్తూ మండలంలోని పలు గ్రామపంచాయ తీల ప్రజలకు జిల్లా కేంద్రానికి చేరు కోవడంలో ఎంతో ఉపయోగకరంగా మారనుందిఈ బస్ ఉదయం 7:30 గంటలకు అశ్వారావుపేట నుంచి బయలుదేరి 9:40 గంటలకు కొత్త గూడెం చేరుకోనుంది తిరుగు ప్రయా ణంలో సాయంత్రం 4:30 గంటలకు కొత్తగూడెం నుంచి బయలుదేరి 6:20 గంటలకు అశ్వారావుపేట చే రుకుంటుంది అదేవిధంగా సత్తుపల్లి డిపో నుంచి భద్రాచలం వరకు మరో నూతన పల్లెవెలుగు సర్వీస్‌ను కూడా ప్రారంభించారు ఈ సర్వీస్ ములకల పల్లి, పొగళ్లపల్లి, తిమ్మంపేట మీదుగా భద్రాచలం చేరుకుని తిరిగి సత్తుపల్లికి ప్రయాణించనుంది గ్రామీణ ప్రాంత ప్రజలు విద్య, వైద్యం, ఉద్యోగాలు, ప్రభుత్వ కార్యాలయాల అవసరాల కోసం సులభంగా కార్యక్రమంలో రెండు డిపోల మేనేజర్లు రాజ్యలక్ష్మి, అభిమానులు పాల్గొన్నారు

## ఏకాగ్రతకు యోగా వారధి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాల సందడి




**చండూరు,మే 12 (వుదయం):**

విద్యా వారోత్సవాలలో భాగంగా చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ రోజు యోగా అభ్యాసన తరగతు లు ఉత్సాహంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్ శ్యామ్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ ఆసనాలను అభ్యసించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో యోగా ఎంతో కీలకమ ని, ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా జ్ఞాపకశక్తిని, ఏకాగ్రతను పెంపొందిస్తుందని స్పష్టం చేశారు. ప్రతిరోజూ యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ప్రశాంతమైన మనస్సు లభిస్తుందని ఆయన విద్యార్థు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివా స్‌తో పాటు అధ్యాపకులు బాల సైదులు, పద్మజ, జ్యోతి, ప్రమీల, సంధ్య, సునీత, వెంకన్న తదితరులు పాల్గొని విద్యార్థుల కు యోగా ప్రాముఖ్యతను వివరించారు.

# చక్కని ఆరోగ్యం

## ఈ పండ్లతో ఆరోగ్యం!



మనకేం కావాలో.. మనకంటే బాగా ప్రకృతికే తెలుసంటారు..! అందుకే మన శరీరానికి ఏ కాలంలో ఏ పదార్థాలైతే మేలు చేస్తాయో వాటిని ప్రకృతి మనకు అందిస్తుంటుంది. ఈ క్రమంలో వేసవిలో లభించే రకరకాల పండ్లు కూడా మనకెంతో మేలు చేస్తాయి అంటున్నారు నిపుణులు. వాతావరణంలోని అధిక ఉష్ణోగ్రతలకు శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించడం, జీర్ణ సంబంధిత సమస్యల్ని దూరం చేయడం.. ఇలా పలు రకాలుగా ఇవి మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి అని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవిలో లభించే పండ్లు.. వాటివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం రండి..! నీటి శాతం అధికంగా ఉండే పండ్లలో తర్బూజా ముఖ్యమైంది. దీన్ని తినడం వల్ల ఇందులో ఎక్కువగా ఉండే నీరు శరీరంలోకి చేరి.. చెమట రూపంలో కోల్పోయిన నీటి శాతాన్ని తిరిగి భర్తీ చేస్తుంది. అలాగే ఈ పండు రక్తపోటు వంటి సమస్యలు దరిచేరకుండా కాపాడడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది అంటున్నారు నిపుణులు. పుచ్చకాయలో అధికంగా ఉండే నీటి శాతం వల్ల దాహార్తి తీరడమే కాకుండా.. ఇందులో ఉండే ఇతర పోషకాలు కూడా మనకు అందుతాయి. పొటాషియం, ఐరన్.. వంటి ఖనిజాలతో పాటు విటమిన్ సి.. కూడా ఈ పండులో సమృద్ధిగా ఉంటుంది అంటున్నారు నిపుణులు. ఇందులో అధికంగా ఉండే సి, ఇ విటమిన్లు, పొటాషియం, ఫైబర్.. వంటివి శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. పొటాషియం, ఐరన్, బీటా కెరోటిన్, ఫైబర్‌తో పాటు విటమిన్ సి.. వంటి పోషకాలు అధికంగా లభించే మరో పండు ఆప్రికాట్. ఎండు ఆప్రికాట్ శరీరంలో ద్రవాల స్థాయులు తగ్గకుండా చేయడంతో పాటు మలబద్ధకం.. వంటి పలు జీర్ణ సంబంధిత సమస్యల్ని తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది అని చెబుతున్నారు నిపుణులు. వేసవి కాలంలో లభించే పండ్లలో అతి ముఖ్యమైనవి మామిడి పండ్లు. ఇందులో ఎక్కువగా ఉండే విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి చాలా మంచిది. అలాగే మామిడి పండ్లలో ఎక్కువగా ఉండే ఫైబర్, బీటా కెరోటిన్, విటమిన్ సి.. వంటి పోషకాలు ఆరోగ్యానికి చాలా అవసరం. జీర్ణశక్తిని పెంచడానికి ఉపయోగపడే అద్భుతమైన పండు అనాస. ఈ పండులో ఎన్నో రకాల ఖనిజాలు, విటమిన్లు దాగి ఉన్నాయి. అలాగే ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరం పలు వ్యాధుల బారిన పడకుండా కాపాడతాయి అంటున్నారు నిపుణులు.

## రుచీ ఆరోగ్యాల వెజిటబుల్ సూప్

టీ, కాఫీల బదులు సూప్ తాగటం అలవాటు చేసుకుంటే ఎంతో మంచిది. అందులోనూ మిక్స్‌డ్ వెజిటబుల్ సూప్ మరీ శ్రేష్ఠం. ఒకసారి ఇలా చేసి చూడండి.. ఇది రుచే కాదు, ఆరోగ్యం కూడా. ఉల్లి, టొమాటో, క్యారెట్ – ఒక్కొకటి, బీన్స్ – 6, గుమ్మడి, బ్రోకలీ – అర కప్పు చొప్పున, బఠాణీలు – 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి తగినంత, వెల్లుల్లి – 3 రెబ్బలు, మిరియాల పొడి – అర స్పూన్, నూనె – స్పూన్, కొత్తిమీర – చారెడు



తయారీ: కూరగాయలన్నింటినీ సన్నగా తరగాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో నూనె వేడి చేసి ఉల్లి, వెల్లుల్లి వేయాలి. అవి కాస్త వేగాక.. అన్ని కూరగాయ ముక్కలూ, ఉప్పు జతచేసి కలియ తిప్పుతూ రెండు నిమిషాలు వేయించాలి. అందులో 3 కప్పుల నీళ్లు పోసి మూత పెట్టి ముక్కలు మెత్తబడే వరకూ ఉడికించి, దించేయాలి. చల్లారాక పప్పుగుత్తితో మెదపాలి. ఈ మిశ్రమానికి మిరియాల పొడి చేర్చి మళ్లీ వేడిచేయాలి. చివర్లో కొత్తిమీర జోడించి సెగ తీసేయాలి.

ఈ సూప్ తాగటం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. ఉల్లాసం, ఉత్సాహం చేకూరతాయి. రోగనిరోధకశక్తి పెరుగుతుంది. పీచు అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ సజావుగా సాగు తుంది. ఊబకాయం రాదు. బరువు తగ్గాలనుకునేవారికి ఇదెంతో ఉపయుక్తం.

గుండె ఆరోగ్యానికి మంచిది. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తుంది. కొవ్వు తక్కువగా ఉండటం వల్ల కొలెస్ట్రాల్ నియంత్రణకు తోడ్పడుతుంది.

మధుమేహం నుంచి ఉపశమనం లభిస్తుంది.

సులభంగా జీర్ణమై, పోషకాలు అందుతాయి కాబట్టి పిల్లలకు, వృద్ధులకు మరీ మంచిది.

దీన్ని నూనె లేకుండా కూడా చేసుకోవచ్చు. మిరియాలు సరిపడవనుకుంటే.. జీలకర్ర పొడి వేసుకోవచ్చు.

## తరిగిపోని అందానికి..!

సౌందర్య పోషణపై శ్రద్ధ పెట్టాలని ఉన్నా.. అంత సమయం ఉండదు చాలామందికి.. కానీ తైవాన్ మహిళలు కేవలం నాలుగే నాలుగు దశల్లో.. తక్కువ సమయంలోనే తమ అందాన్ని ద్విగుణీకృతం చేసుకుంటారంటున్నారు నిపుణులు.



ఇందులో భాగంగా.. చర్మంపై పేరుకున్న దుమ్ము–ధూళి, చెమట, జిడ్డుదనాన్ని తొలగించుకోవడానికి సహజసిద్ధమైన క్లెన్సర్లను ఉపయోగిస్తారట. సోయా పాలు, వైట్ టీ, వెదురు ఎక్స్‌ట్రాక్ట్స్‌తో ముందు తమ చర్మాన్ని శుభ్రం చేసుకుంటారట.

ఇక రెండో దశలో.. టీట్రీ ఆయిల్, హైఅల్యురోనికామ్లం, మొక్కల ఎక్స్‌ట్రాక్ట్స్.. వంటి వాటితో టోనింగ్ చేసుకుంటారట. ఇది పిగ్మెంటేషన్ సమస్యకు చెక్ పెట్టడంతో పాటు చర్మంలో సీబమ్ ఉత్పత్తిని క్రమబద్ధీకరిస్తుంది. తద్వారా చర్మం తాజాగా మారుతుంది అంటున్నారు నిపుణులు. చర్మం ఎంత తేమగా ఉంటే అందం అంతగా ఇనుమడిస్తుంది. ఈ క్రమంలో చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయడం చాలా ముఖ్యం. తైవాన్ మహిళల తరిగిపోని అందానికీ ఇదే కారణమంటున్నారు నిపుణులు. మూలికలు, వృక్ష సంబంధిత పదార్థాలతో తయారుచేసిన మాయిశ్చరైజర్‌ని వారు రోజూ ఉపయోగిస్తుంటారట. దీంతో పాటు నీళ్లు ఎక్కువగా తాగడం, నీటి శాతం ఎక్కువగా ఉన్న పదార్థాల్ని తినడం.. ఇవన్నీ అక్కడి మహిళలు క్రమం తప్పకుండా పాటిస్తుంటారట. తైవాన్ మహిళల బ్యూటీ రొటీన్ షీట్ మాస్క్‌తోనే పూర్తవుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మొక్కల ఆధారిత పదార్థాలతో తయారుచేసిన షీట్‌మాస్క్‌లను పావుగంట పాటు ముఖంపై వేసుకొని సేదదీరుతారట. ఆపై వాటిని తొలగించుకొని తక్షణ మెరుపును సొంతం చేసుకుంటారట.

## వీటితో... కూల్‌గా!

వేసవిలో ఒంటికి హాయి, చల్లదనాన్ని ఇస్తుందని కాటన్‌ని ఎంచుకుంటాం. కానీ దాని నిర్వహణ అంత సులువేమీ కాదు. అందుకే దానిలానే మేనికి హాయిని ఇచ్చే మరికొన్ని రకాలు ఉన్నాయి. వాటిని ప్రయత్నించండి. లినెన్... మనం నిర్లక్ష్యం చేస్తాం కానీ... గాలి ప్రసరణకు ఇవీ అనుకూలంగా ఉంటాయి. చెమట పోసినా త్వరగా ఆరిపోతుంది. ముఖ్యంగా ఇది చర్మానికి అతుక్కోదు. దానికి మించిన హాయి ఈ కాలంలో వేరే ఏముంటుంది చెప్పండి. కాకపోతే కాస్త త్వరగా ముడతలు పడుతుంది. అయితేనేం, ఆ లుక్ కూడా స్టైల్‌గానే ఉంటుంది. రేయాన్... చాలా తేలికగా ఉండే వస్త్రం. మెత్తగా, గాలి ప్రసరణ జరిగేలా ఉంటుంది. స్కర్ట్‌లు, గౌన్లు, వదులు టాప్‌లు... ఎలా వేసుకున్నా స్టైల్‌గా కనిపించడం ఖాయం. చెమట కూడా త్వరగా ఆరిపోయేలా చేస్తుంది. అయితే నాణ్యమైన రకాల్ని ఎంచుకోవాలి. స్టైల్‌గా కనిపించాలంటే ముందు మనకి గుర్తొచ్చేది డెనిమ్ కదూ! కానీ ఈ వేసవిలో వేశామో... చెమటతో ఉక్కిరిబిక్కిరి అవ్వాల్సిందే. అందుకే అయిష్టంగానే దానికి దూరంగా ఉంటాం. అయితే చాంబ్రే ఎంచుకోండి. చూడటానికి డెనిమ్‌లానే ఉంటుంది కానీ... తేలికగా ఉంటుంది. చాలావరకూ ఇదీ కాటన్‌తోనే తయారవుతుంది. దీంతో స్టైలుకి స్టైలూ... సౌకర్యానికి సౌకర్యమన్నమాట. ఖాదీని ఎంచుకోండి. వేసవిలో హాయిని ఇవ్వడమే కాదు... మేనికీ సౌకర్యం. అంతేనా హుందాగానూ కనిపించేలా చేయగలదు. పైగా నేతకారులకు సాయం చేసినట్లూ అవుతుంది.



## తీపీ ఘాటుల పుదీనా పానీయం

శీతల పానీయం తియ్యగా ఉండటంలో విశేషం లేదు. అది కాస్తంత ఘాటుగా కూడా ఉంటే చిత్రమైన రుచితో బాగుంటుంది కదా! అలాంటి చక్కటి పానీయాన్ని ఇంట్లోనే చేసుకోవచ్చు. తీపీ కారాల మేలు కలయికలాంటి కమ్మటి పానీయం కోసం.. పుదీనా ఆకులు 75 గ్రాములు, అల్లం రెండంగుళాల ముక్క, పంచదార రెండు కప్పులు, ఆకుపచ్చని ఫుడ్ కలర్ కొద్దిగా, సాధారణ ఉప్పు, బ్లాక్ సాల్ట్, వేయించిన జీలకర్ర పొడి చెంచా చొప్పున, నిమ్మరసం అర కప్పు తీసుకోవాలి. పుదీనాను శుభ్రంగా కడిగి గ్రైండ్ చేసి.. రెండు కప్పుల నీళ్లు పోయాలి. అల్లం చెక్కు తీసి.. రెండు టేబుల్‌స్పూన్ల నీళ్లు జోడించి మెత్తగా నూరి.. వడకట్టాలి. పిప్పి తీసేసి రెండు కప్పుల నీళ్లు జోడించాలి. ప్యాన్‌లో పంచదార, అల్లం నీళ్లు పోసి కలియతిప్పుతూ వేడిచేయాలి. పంచదార కరిగిపోయాక.. నూరిన పుదీనా, ఫుడ్ కలర్ జతచేసి ఉడికించాలి. అందులో పావు వంతు నీళ్లు ఇంకిపోయాక ఉప్పు, బ్లాక్ సాల్ట్, జీలకర్ర పొడి కూడా వేసి ఇంకో రెండు నిమిషాలు ఉడికించి సెగ తీసేయాలి. ఈ పానీయాన్ని తడి లేని సీసాలో భద్రం చేసుకోవాలి. తాగదలచినప్పుడు మూడు చెంచాల చిక్కటి ద్రవాన్ని నీళ్లలో కలిపితే సరిపోతుంది. ఇది రుచిగానూ ఉంటుంది, ఆరోగ్యానికీ మంచిది. చల్లగా ఉండాలనుకుంటే రెండు ఐస్‌క్యూబ్స్ వేసుకోవచ్చు.



## ఫుట్ రోలింగ్ చేద్దామా!

వ్యాయామం చేసే మహిళలూ, రోజంతా హై–హీల్స్ ధరించే వారూ, ఎక్కువ సేపు వంటగదిలో నిలబడి వంటలు చేసేవారూ... పాదాల నొప్పులతో ఇబ్బంది పడటం సహజం. మరి ఈ నొప్పిని తగ్గించి కాళ్లకు తగిన వ్యాయామాన్ని అందించే మార్గాలివి.

ఫుట్ రోలింగ్ అనేది ఒక రకమైన 'సెల్ఫ్–మయోఫాసియల్ రిలీజ్' టెక్నిక్. అంటే, ఒక బంతిని లేదా రోలర్‌ను ఉపయోగించి మన పాదాల అడుగు భాగంలో ఉండే కండరాలు, ఫాసియా (కండరాలను కప్పి ఉంచే పొర) పై ఒత్తిడి కలిగించి, అక్కడ ఉన్న బిగుతుదనాన్ని తొలగించడమే. దీన్ని చేయడానికి టెన్నిస్ బాల్, లాక్రోస్ బాల్ లేదా గడ్డ కట్టిన నీటి సీసా ఉంటే సరిపోతుంది.

ఆర్చ్ రోలింగ్: నిలబడ్డా, కుర్చీలో కూర్చున్నా మీ పాదం కింద బంతిని ఉంచి... కాలి వేళ్ల నుంచి మడమ వరకూ నెమ్మదిగా బంతిని అటు ఇటు దొర్లించండి. మధ్యస్థంగా ఒత్తిడిని కలిగిస్తూ నిమిషంపాటు ఇలా చేస్తే పాదాల నొప్పులు తగ్గుతాయి. ఆపై పాదం పక్కలకి (ఎడమ నుంచి కుడికి) కదిలించండి. దీనివల్ల కండరాలు సౌకర్యవంతంగా మారతాయి. హీల్ టో ప్రెస్: మడమ భాగంలో నొప్పి ఎక్కువగా ఉంటే, బంతిని మడమ కింద ఉంచి గట్టిగా నొక్కండి. అదేవిధంగా కాలి వేళ్ల కింద బంతిని ఉంచి నొక్కడం వల్ల ట్రిగ్గర్ పాయింట్స్ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఫ్రోజెన్ బాటిల్ టెక్నిక్: మీకు ప్లాంటార్ ఫాసిటిస్ లేదా పాదాల వాపు ఉంటే, గడ్డకట్టిన నీటి బాటిల్‌ను ఉపయోగించండి. ఇది మసాజ్‌తోపాటు కోల్డ్ థెరపీలా పనిచేసి వాపును తగ్గిస్తుంది. ఈ కసరత్తుల వల్ల పాదాలు, మడమల కదలికలు మెరుగుపడతాయి. బ్యాలెన్స్ కుదురుతుంది. పాదాలను రోల్ చేయడం వల్ల శరీరంలోని కండరాల కనెక్షన్లు బలపడి...



తలనొప్పి వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంది. పాదాలకు రక్త ప్రసరణ పెరిగి, రోజంతా ఉండే అలసట మాయమవుతుంది. ఇలా ప్రతి పాదానికి 45 సెకన్ల నుంచి 2 నిమిషాల వరకు రోలింగ్ చేస్తే మంచిది. మొదట తక్కువ ఒత్తిడితో ఆరంభించి క్రమంగా పెంచాలి. మరీ అతిగా నొక్కినా, బలంగా చేసినా కండరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

అండాల విడుదల సమయంలో మహిళలు ఫుట్ రోలింగ్ చేయకపోవడమే మంచిది. ఈ సమయంలో శరీరంలో హార్మోన్ల మార్పుల వల్ల లిగమెంట్లు సాగే గుణాన్ని కలిగి ఉంటాయి. దీనివల్ల గాయాలయ్యే ప్రమాదం ఉంది.

## చెవులకు చక్కటి ఆభరణాలు

ఎంతందంగా తయారైనా చెవులకు చక్కటి ఆభరణాలు లేకపోతే నిండుదనమే రాదు. అందుకే, అమ్మాయిల మనసుని మెప్పించడానికి వీటిల్లో ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లు వస్తూనే ఉంటాయి. అలా ఇప్పుడు ఇయర్ కఫ్స్ వంతు. ఏంటి ఇవి ఎప్పటి నుంచో ఉన్నవేగా అనేయకండి. నిన్నమొన్నటి వరకూ అచ్చంగా బంగారంతో, టెంపుల్ డిజైన్స్‌లో మెరిసిపోయిన ఇవి... ఇప్పుడు పచ్చలు, కెంపులు, రంగు రాళ్లూ, వజ్రాలతో కనువిందు చేస్తున్నాయి. చెవి తమ్మె నుంచి మొదలై లతలా అంచుని అల్లుకుంటూ నయా స్టైల్‌లో కనిపిస్తోన్న ఇవి... ధరించిన ఎవరికైనా కళ తెచ్చిపెడతాయి. ఆడంబరంగా కనిపించాలనుకునేవారికి చక్కని ఎంపిక. నిజానికి చెవికి ఒకటి కంటే ఎక్కువ రంధ్రాలు ఉంటేనే ఇలాంటి లుక్ వస్తుంది అనుకుంటాం. కానీ, రంధ్రం అవసరం లేకుండానే చెవిని చుట్టేసేలా క్లిప్ మోడల్స్‌లో ఇవి లభిస్తున్నాయి. మెడలో ఏమీ వేసుకోకపోయినా, కేవలం ఈ ఒక్క ఇయర్ కఫ్ పెట్టుకుంటే చాలు, వేడుకల్లో అందరి కళ్లూ మీ పైనే ఉంటాయి. నవరత్నాలలోని పచ్చలు, కెంపులు, వజ్రాలను ఈ ఆధునిక డిజైన్లలో వాడటం వల్ల ఇవి వెస్ట్రన్ దుస్తులకే కాకుండా పట్టుచీరలపైకి కూడా అద్భుతంగా నప్పుతాయి. మరింకెందుకు ఆలస్యం.... పెళ్లిళ్లు, పార్టీలు లేదా గ్రాండ్ ఈవెంట్లలో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు రావాలంటే ఇలాంటి 'బోల్డ్ అండ్ బ్యూటిఫుల్' ఇయర్ కఫ్స్ ఎంచుకోవాల్సిందే.



# వుదయం సినిమా

MOVIE TIME!

## సీఎం విజయ్ మీకు హ్యాట్సాఫ్



**వుదయం సినిమా :**
తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నటుడు విజయ్, అధికారంలోకి వచ్చిన వెంటనే సంచలన నిర్ణయం తీసుకున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజులకే, రాష్ట్రవ్యాప్తంగా 717 మద్యం దుకాణాలను మూసివేస్తూ తన తొలి సంతకం చేశారు. దేవాలయాలు, పాఠశాలలు, బస్టాండ్‌లకు 500 మీటర్ల పరిధిలో ఉన్న ఈ మద్యం దుకాణాలను తక్షణమే తొలగించాలని ఆయన తన తొలి ఉత్తర్వులో పేర్కొన్నారు. విజయ్ నిర్ణయంపై ఆయన స్నేహితుడు, నటుడు విశాల్ ఎక్స్ వేదికగా ప్రశంసలు కురిపించారు. "డియర్ సీఎం జోసెఫ్ విజయ్ గారు.. మీకు మా అభినందనలు.

## 'వీరభద్రుడు' ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య



**వుదయం సినిమా :**
థియేటర్స్ లో సెలబ్రేట్ చేసుకునే మంచి మాస్ మసాలా ఎంటర్‌టైనర్. కచ్చితంగా ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు:
'వీరభద్రుడు'లాంటి క్యారెక్టర్‌ను అన్నయ్య మాత్రమే చేయగలరు. ఇలాంటి సినిమాలు థియేటర్‌లోనే చూడాలి: హీరో కార్తిసూర్య
మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు'. త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ భారీ అంచనాలని సృష్టించాయి. ఈ చిత్రం ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో రిలీజ్ అవుతుంది. మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లో హీరో కార్తి, డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత సుప్రియా యార్లగడ్డ పాల్గొన్నారు.
ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులందరికీ నమస్కారం. నేను ఇక్కడికి వచ్చిన ప్రతిసారి చాలా అదృష్టవంతుడిగా భావిస్తాను. నాకు తెలుగు అంత బాగా రాకపోవచ్చు...కానీ తెలుగు వారి మనసు మాత్రం నాకు బాగా తెలుసు. సుప్రియ గారితో మాకు ఎప్పటి నుంచో చాలా మంచి స్నేహం ఉంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను రిలీజ్ చేయడం చాలా గౌరవంగా భావిస్తున్నాం.
హీరో కార్తీ మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. మీ ప్రేమకి హృదయపూర్వక కృతజ్ఞతలు. షూటింగ్ జరుగుతుండగా ఇక్కడ 'రోలెక్స్' ఉన్నారని చెప్పారు. అందుకే హాయ్ చెప్పాలని వచ్చాను. (నవ్వులు). ఈ సినిమా ఫస్ట్ లుక్ నాకు చాలా నచ్చింది. ఇది మాస్ మసాలా అలాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని కూడా చెప్పొచ్చు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ట్రైలర్‌ని నేను చాలా ఎంజాయ్ చేశాను. అలాగే వెంకీతో చేస్తున్న సినిమా కూడా మీ అందరి ప్రేమను అందుకోవాలని ఆశిస్తున్నాను. మీ అందరికీ ధన్యవాదాలు. డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఒక డివైన్ ఎలిమెంట్‌తో పాటు సోషల్ యాంగిల్‌ను అద్భుతంగా మిక్స్ చేసి ఆర్.జే. బాలాజీ గారు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా అన్ని చోట్ల పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ సినిమా గొప్ప విజయాలు సాధించి, అద్భుతాలు క్రియేట్ చేయాలని కోరుకుంటున్నాను.

## బ్లాక్ బస్టర్ 'శంబాల' కాంబో రిపీట్



**వుదయం సినిమా :**
బృందా రవీందర్ దర్శకత్వంలో ఆది హీరోగా షైనింగ్ పిక్చర్స్, యుగంధర్ ముని నూతన చిత్రం సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'శంబాల'తో షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు, దర్శకుడు యుగంధర్ ముని, హీరో ఆది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా నిలిచారు. 'శంబాల' లాంటి మరో వినూత్నమైన కథాంశంతో వీరంతా కలిసి ఓ ప్రయోగం చేయబోతోన్నారు. యుగంధర్ ముని సమర్పణలో షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలైన మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు ఆదితో మరో సినిమాని నిర్మించనున్నారు. ఈ చిత్రానికి బృందా రవీందర్ దర్శకత్వం వహించనున్నారు. 'శంబాల' తరువాత మళ్లీ ఆ స్థాయిలో సినిమాని నిర్మించాలని వీరంతా కలిసి కథాన్వేషణలో పడ్డారు. ఇక అద్భుతమైన కథ తో దవ్వడంతో వీరంతా కలిసి ముందుకు వచ్చారు. ఎమోషన్స్‌తో పాటుగా ఈ సారి హారర్ ఎలిమెంట్స్‌ను సరికొత్తగా చూపించబోతోన్నారు. భయం, ఉత్కంఠ, అన్‌లిమిటెడ్ ఎంటర్టైన్మెంట్, ఎమోషన్స్ తో భారతీయ తెరపై మును పెన్నడూ చూడని ఒక అద్భుతమైన అనుభూతిని అందించేందుకు టీం సిద్ధమైంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ అదిరిపోయింది. ఈ పోస్టర్‌లో ఆది సాయి కుమార్ ఇంటెన్స్ లుక్, రక్తం కారుతున్న తీరు, చుట్టూ ఉన్న పువ్వులు, ఆకులు, కనిపిస్తున్న పాత కాలం నాటి స్టాంప్ ఇవన్నీ చూస్తుంటే ఓ కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని తీసుకు వెళ్లేలా కనిపిస్తున్నారు. కాన్సెప్ట్ పోస్టర్‌తోనే ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించారు.

## ప్రెస్ మీట్ లో తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్



**వుదయం సినిమా :**
ఇది ఎగ్జిబిటర్ల బ్రతుకు పోరాటం. సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడ కోసం అందరికీ సమానంగా వర్తించే "పర్సెంటేజ్ షేరింగ్" విధానాన్ని అమలు చేయవలసిందిగా మనవి చేస్తున్నాము: సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిరక్షణ, కొనసాగింపుకు సంబంధించి ప్రతిపాదిత "పర్సెంటేజ్ షేరింగ్ విధానం" అమలుపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు తెలంగాణ ఎగ్జిబిటర్ సభ్యుల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు చదలవాడ శ్రీనివాస్, శిరీష్ రెడ్డి, సునీల్ నారంగ్‌తో పాటు పలువురు ఎగ్జిబిటర్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో కీలక అంశాలు, నిర్ణయాలను వెల్లడించారు.
మీడియా సమావేశంలో
చదలవాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒక నిర్మాతగా మాట్లాడాలంటే నిర్మాత తండ్రి అయితే, ఎగ్జిబిటర్ బిడ్డలాంటివాడు. అలా చూసినప్పుడే సినిమా ఇండస్ట్రీ బాగుంటుంది. తండ్రి ఎంత కష్టపడినా బిడ్డల సుఖం కోసమే. గత 20 ఏళ్లుగా ఎగ్జిబిటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికి గిట్టుబాటు లేక, ఆదరణ లేక పరిస్థితులు క్షీణించాయి. గత ఏడాది నుంచి పరిస్థితి మరింత దిగజారింది. ముఖ్యంగా గత ఆరు నెలలుగా ఎగ్జిబిటర్ల పరిస్థితి అస్సల్ బాలేదు. ఎగ్జిబిటర్ బాగుంటేనే సినిమా పరిశ్రమ బాగుంటుంది. సునీల్ నారంగ్ గారు, శిరీష్ గారు అందరూ కూడా థియేటర్ల అభివృద్ధి కోసం తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. నిర్మాతగా వారికి నా 100 శాతం సపోర్ట్ ఉంటుంది. ఎగ్జిబిటర్లను బ్రతికించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉంది. ప్రస్తుతం ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతల మధ్య సమన్వయం చాలా ముఖ్యం. సినిమా పరిశ్రమ మరింత బలపడేలా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగాలని ఆశిస్తున్నాను.
**నిర్మాత శిరీష్ రెడ్డి మాట్లాడుతూ..**
మీడియా మిత్రులకు ధన్యవాదాలు. మేము పర్సెంటేజ్ విధానం గురించి మాట్లాడుతున్నామంటే ఇది ఎగ్జిబిటర్ల బ్రతుకుపోరాటం. ఏ సినిమాను టార్గెట్ చేసి గానీ, ఏ నిర్మాతను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో గానీ ఇది చేయడం లేదు. థియేటర్లను రక్షించండి. మిగిలిన రాష్ట్రాల్లో థియేటర్లకు పర్సంటేజీ విధానం అమలు చేసి తెలుగులో మాత్రం ఎందుకు రెంటల్ పద్ధతి లో సినిమా రిలీజ్ చేస్తున్నారో ఒకసారి ప్రశ్నించుకోవాలి. మా విజ్ఞప్తి ఒక్కటే... మమ్మల్ని వేరే కోణంలో చూడకండి. దయచేసి ఎగ్జిబిటర్లను కాపాడండి. ఈ సందర్భంగా ప్రేక్షకులకు ఒక విషయం చెబుతున్నాం. జీవోలు వచ్చినా థియేటర్లో టికెట్ రేట్లు పెంచమని తెలియజేస్తున్నాం.

## 'రమణి కళ్యాణం' టీజర్ లాంచ్ ఈవెంట్ లో సహజనటి జయసుధ



**వుదయంసినిమా:**
సినిమా చూశాను. మంచి ఫీల్‌గుడ్ మూవీ. తప్పకుండా ఆడియన్స్ థియేటర్స్ లో ఎంజాయ్ చేస్తారు:
సూర్య వశిష్ట, దీప్షిక హీరో హీరోయిన్స్ గా విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఎమోషనల్ డ్రామా రమణి కళ్యాణం. కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్ పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి. శ్రీనాథ్ పసుపులేటి, సంజయ్ వెంపరాల నిర్మిస్తున్నారు. కోర్ట్ మూవీ ఫేం రామ్ జగదీష్ డైలాగ్స్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ని సహజనటి జయసుధ లాంచ్ చేశారు.
టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సహజనటి జయసుధ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా నిర్మించిన నిర్మాతలకు అభినందనలు. ఈ సినిమాలో హీరో, హీరోయిన్‌లు అద్భుతంగా నటించారు. విజయ్ చాలా ప్యాషన్‌తో ఈ సినిమాను తీశాడు. ఇది ఒక క్లీన్ మూవీ. ఫ్యామిలీ ఆడియన్స్ అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది. అందరూ థియేటర్స్‌లో చూసి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. మాకు ఎంతగానో సపోర్ట్ చేసిన జయసుధ గారికి థ్యాంక్యూ
హీరోయిన్ అక్స ఖాన్ మాట్లాడుతూ -"ఈ చిత్రంలో నేను డ్యాన్సర్ పాత్రలో నటిస్తున్నాను. నిజ జీవితంలో కూడా డ్యాన్సర్‌ను కావడంతో ఈ పాత్రకు బాగా కనెక్ట్ అయ్యాను. 'నంది నంది' పాట చాలా ప్రత్యేకంగా ఉంటుంది. మంచి ఫైట్స్ కూడా సినిమాలో ఉన్నాయి. నాకు ఈ అవకాశం ఇచ్చిన రామకృష్ణ గౌడ్ గారికి ధన్యవాదాలు. నా కోస్టార్ కిరణ్ ఎంతో ప్యాషన్‌తో పని చేశారు. ఆయనకు మంచి భవిష్యత్తు ఉండాలి. జూన్ 12న మా సినిమా విడుదలవుతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయాలి" అన్నారు.

## నాని 'ప్యారడైజ్'పై రూమర్లు

**వుదయంసినిమా:**
నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న 'ది ప్యారడైజ్' సినిమా చిత్రీకరణపై గత కొద్ది రోజులుగా ప్రచారంలో ఉన్న వదంతులపై చిత్ర బృందం స్పందించింది. సినిమా అనుకున్న ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగుతోందని, ఎలాంటి జాప్యం లేదని స్పష్టం చేస్తూ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలోనే



సినిమా విడుదల తేదీని కూడా ఖరారు చేసింది.
"'ది ప్యారడైజ్' సినిమాపై కొన్ని నిరాధారమైన ఊహాగానాలు వ్యాపిస్తున్నాయి. తొలి రోజు నుంచి స్పష్టమైన ప్రణాళికతోనే ఈ చిత్రాన్ని ప్రారంభించాం. ఇప్పటివరకు 100 రోజులకు పైగా షూటింగ్ విజయవంతంగా పూర్తి చేశాం. మిగిలిన షెడ్యూల్ కూడా పక్కాగా జరుగుతోంది. ఇప్పటివరకు ఒక్క రీషూట్ కూడా చేయలేదు, భవిష్యత్తులో కూడా అలాంటి ఆలోచన లేదు" అని చిత్ర బృందం తేల్చి చెప్పింది.

## జూన్ 12న "ఆర్ కే దీక్ష"



**వుదయంసినిమా:**
ఆర్ కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం "ఆర్ కే దీక్ష". డి.ఎస్ రెడ్డి సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూన్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది.
**దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ**
"మా 'ఆర్ కే దీక్ష' సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యాక్షన్ సన్నివేశాలు ఎక్కువగా ఉండటంతో సెన్సార్ వారు 'ఏ' సర్టిఫికెట్ జారీ చేశారు. పెద్దగా కట్స్ లేకుండా సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులకు ధన్యవాదాలు. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. దీక్ష, పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించగలమనే కాన్సెప్ట్‌తో హీరో పాత్రను తీర్చిదిద్దాం. హీరో కిరణ్ ఈ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంటారు. ఆయన భీముని పాత్రలో చెప్పిన వన్ మినిట్ నాన్ స్టాప్ డైలాగ్ హైలైట్ అవుతుంది.
హీరో కిరణ్ మాట్లాడుతూ -
"నేను ఇప్పటికే పలు చిత్రాల్లో నటించాను. ప్రస్తుతం మూడు పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నాను. 'ఆర్ కే దీక్ష'లో నటించడం ఆనందంగా ఉంది. ఇందులో పర్ఫార్మెన్స్‌కు మంచి స్కోప్ ఉన్న పాత్రలో కనిపిస్తాను. చిన్నప్పటి నుంచి దీక్షగా సినిమా ఇండస్ట్రీలో స్థిరపడాలని ప్రయత్నిస్తున్నాను. ఈ సినిమాలో కూడా అలాంటి పాత్రనే దర్శకుడు ఇచ్చారు. భీముని పాత్రలో చెప్పిన వన్ మినిట్ డైలాగ్ తర్వాత వచ్చే ఫైట్ సీన్ ప్రేక్షకులకు నచ్చుతుంది. యాక్షన్, రొమాన్స్, కామెడీ ఇలా అన్ని అంశాలు ఉన్న మా సినిమాను అందరూ ఆదరించాలి" అన్నారు.
సాధారణంగా ఇలాంటి లవ్‌స్టోరీస్‌కు పతాక సన్నివేశాలు హైలైట్ అవుతుంటాయి? ఈసినిమాలో పతాక సన్నివేశాలు ఎలా ఉంటాయి?
ఈ సినిమా పతాక సన్నివేశాలు అందర్ని ఆలోచింపజేస్తాయి. సినిమా చూసిన వచ్చిన తరువాత ఆ ఫీల్ మిమ్ములను వదిలివెళ్లదు' అన్నారు.అందరూ ఓ మంచి సినిమా చూశామన్న అనుభూతితో థియేటర్ నుంచి బయటికొస్తారు.

## నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పి. భరత్ భూషణ్ నియామకం



**వుదయంసినిమా:**
చైర్మన్ భరత్ భూషణ్‌ను అభినందించిన పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణఆంధ్ర ప్రదేశ్ ఎఫ్ డి సి చైర్మన్‌గా నియమింపబడ్డ భరత్ భూషణ్, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ గారిని కలవగా ఆయన భరత్ భూషణ్‌కు అభినందనలు తెలిపారు. అందరినీ కలుపుకుంటూ ఆంధ్ర ప్రదేశ్‌లో సినీ, టీవీ మరియు నాటక రంగ అభివృద్ధి కోసం ముందుకు సాగాలని నందమూరి బాలకృష్ణ గారు సూచించారు. సినిమాలపై మక్కువతో 20 సంవత్సరాలుగా సినిమాలు డిస్ట్రిబ్యూషన్ చేస్తూ ఎన్నో విజయవంతమైన సినిమాలను ప్రేక్షకులకు అందిస్తూ వచ్చారు భరత్ భూషణ్. అలాగే భరత్ ఇన్‌ఫ్రా అనే కంపెనీ స్థాపించి తద్వారా ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు అందించారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రెసిడెంట్‌గా తనదైన శైలిలో అటు పరిశ్రమ తరపున ప్రభుత్వానికి అలాగే ఇటు చిత్ర పరిశ్రమలో ఉన్న చిన్న స్థాయి సమస్యల నుండి కార్మికుల



Telugu Film Producer's Council

సమస్యల వరకు ప్రతి సమస్యను తీరుస్తూ వచ్చారు. కార్మికులకు, డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాతలకు ఎటువంటి సమస్య వచ్చినా న్యాయపరమైన చర్యలు తీసుకుని అందరికీ మంచి చేస్తూ వచ్చారు. ఇది ఇలా ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరత్ భూషణ్ గారిని రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించడం హర్షించదగిన విషయం. చలన చిత్ర, నాటక రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు భరత్ భూషణ్ గారిని చైర్మన్‌గా నియమించి రాష్ట్రంలో ఈ సంస్థ అభివృద్ధి బాధ్యతలను ఆయనకు అప్పగించడం జరిగింది.

## దూరదర్శని అందరి మనసులను హత్తుకుంటుంది

**వుదయంసినిమా:**
**దర్శకుడు కార్తికేయ కొమ్మి**
సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయశంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని పనులను పూర్తిచేసుకున్న ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శకుడు కార్తికేయ కొమ్మి చిత్ర విశేషాలను పంచుకున్నారు. ఆ విశేషాలివి.
**మీ నేపథ్యం ఏమిటి?**
ఇంతకు ముందు నేను సాధ్యం, వసూల్ రాజా, లక్ష్మీబాంబ్ సినిమాలకు దర్శకత్వం చేశాను. నేను కొత్తవాళ్లతో చేసిన తొలి ప్రాజెక్ట్ ఇది. యదార్థ సంఘటనతో చాలా రియలిస్టిక్‌గా ఈ సినిమాను రూపొందించాను.
**దూరదర్శని కథ ఏమిటి?**
కథగా చెప్పుకుంటే పేరెంట్స్ చాయిస్, సొసైటీ చాయిస్, పిల్లల చాయిస్.. వీటి మధ్య ఉండే క్లాష్.. ఈ చిత్ర కథాంశం. చిత్రలహరి టైమ్ పిరియడ్ మిస్ అయిన వారికి. ఆ టైమ్‌లో చిత్రలహరి అనుభూతిని పొందిన వారికి ఈ సినిమా పూర్తి సంతృప్తినిస్తుంది. చిత్రలహరి గురించి అందరూ ఎలా వెయిట్ చేసే వారు.. ఈ సినిమాలో మంచి ఎమోషన్ ఉంది. అందరి హృదయాలను హత్తుకుంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరికి వాళ్ల గోల్డెన్ డేస్‌లోకి తీసుకవెళుతుంది.
మీ తదుపరి చిత్రం?
ఆగస్టులో ఓ పెద్ద ప్రాజెక్ట్‌కు దర్శకత్వం

## 'రాక్షసపురం' సెన్సార్ పూర్తి

**మే 15న థియేటర్లలో విడుదల: కె. ఎస్ రామారావు**

**వుదయంసినిమా:**
ప్రముఖ నిర్మాణ సంస్థ క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత, సీనియర్ నిర్మాత కె.ఎస్ రామారావు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాక్షసపురం'. కన్నడలో సంచలన విజయం సాధించిన 'రాక్షసపుర' చిత్రానికి ఇది తెలుగు అనువాదం. తాజాగా ఈ సినిమా తెలుగు సెన్సార్ పూర్తియినట్లు చిత్ర సమర్పకులు కె.ఎస్ రామారావు ప్రకటించారు. సెన్సార్ బోర్డు నుంచి యూ/ఏ సర్టిఫికెట్ వచ్చిందని, సినిమా ప్రతి ఒక్కరినీ అలరించేలా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ చిత్రాన్ని మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు కె.ఎస్ రామారావు మరోసారి స్పష్టం చేశారు. విభిన్నమైన నటనతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కన్నడ స్టార్ రాజ్ బి శెట్టి ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఇన్ స్పెక్టర్ పాత్రలో నటించారు. డాక్టర్ రవి నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రం ఒక ఉత్కంఠభరితమైన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్. ఇన్వెస్టిగేషన్ డ్రామా నేపథ్యంలో సాగే కథనం ప్రేక్షకులను అడుగడుగునా థ్రిల్‌కు గురి చేస్తుంది. సెన్సార్ పూర్తయిన సందర్భంగా సినిమా గురించి కె.ఎస్ రామారావు స్పందిస్తూ.."ఈ సినిమాలోని మేకింగ్ విలువలు, సస్పెన్స్ ఎలిమెంట్స్ నన్ను బాగా ఆకట్టుకున్నాయి.



వేసవి సెలవుల దృష్ట్యా ఈ తేదీ సినిమాకు కలిసి వస్తుందని భావిస్తున్నాం. ప్రస్తుతం ఐపీఎల్ సందడి మరియు ఓటీటీల పోటీ ఉన్నప్పటికీ, కంటెంట్ బలంగా ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని నమ్ముతున్నాం. 'రాక్షసపురం' కచ్చితంగా ఆ కోవలోకి వస్తుంది. సెన్సార్ నుంచి కూడా మంచి అప్రిసియేషన్ వచ్చింది. ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది'' అని రామారావు ధీమా వ్యక్తం చేశారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.